


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో **ఒక పూర్తి పేజీ**

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

నిజామాబాద్

: fb.com/vaartha Digital

Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

12-6-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 132 పేజీలు: 10+4 వెల: 6.50




## గృహిణులు దేశ నిర్మాతలు

కుటుంబంలో వారే కీలక పాత్ర

వారు చేసే పనికి వెల కట్టలేం

పరిహారంలోనూ అన్యాయం

సుప్రీం కోర్టు చారిత్రాత్మక తీర్పు

2

## ఇరాన్‌పై భీకరదాడులు

మినాబ్, బందర్ అబ్బాస్, సిరిక్, టెహ్రాన్‌లపైనే

ట్రంప్ ఆదేశాల మేరకు, ఆత్మరక్షణ కోసమే చేశాం: అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటన

ఇరాన్ ప్రతీకార దాడులు తీవ్రతరం

యుఎస్ సైనిక కేంద్రాలపై బాలిస్టిక్ మిస్సైళ్లు

జోర్డాన్‌లోని అమెరికా ఎయిర్‌బేస్ ధ్వంసం

ఖర్గ్‌ను స్వాధీనం చేసుకుంటాం: ట్రంప్




## మరో వాణిజ్య నౌకపై దాడి

మంటల్లో భారత నౌక జల్‌వీర్

రంగంలోకి దిగిన ఒమన్ నౌకాదళం

తీవ్రంగా ఖండించిన భారత్

అమెరికా దౌత్యాధికారికి సమన్లు

దాడులు ఆందోళనకరం

అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధం

ఐరాస వేదికగా భారత్ నిరసన

5



## ఒమన్ తీరంలో గల్లంతైన ముగ్గురు భారతీయులు మృతి

అమెరికా దాడిని తప్పుపట్టిన ఇండియా

నౌకలపై దాడులు ఆపాలని డిమాండ్

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

కేంద్ర మంత్రి సర్బానంద సోనావాల్



గురువారం మీడియాతో సజ్జనార్

### ఇగ్నైట్ గోల్‌మాల్

## గుట్టురట్టు

రూ.5 వేల కోట్ల దోపిడీకి చెక్

నాలుగు రాష్ట్రాల్లో సోదాలు, ఆరుగురి అరెస్టు: సిపి సజ్జనార్

**హైదరాబాద్ జూన్ 11, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా లక్షలాది మంది అమాయకులను మల్టీ మార్కెటింగ్ పేరిట నిండా ముంచి వందల కోట్ల రూపాయలను దోచుకున్న క్యూనెట్ మోసకారి సంస్థ పోలీసుల దాడులకు భయపడి ఇగ్నైట్ పేరిట ఏర్పాటు చేసిన మరో గోల్‌మాల్ సంస్థను

>>2

### మెట్రో ఫేజ్2 విస్తరణను

# ఆమోదించండి

రాష్ట్ర ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి

రీజినల్ రింగ్ రోడ్ పనులకు వెంటనే అనుమతి ఇవ్వండి

ట్రిపులార్‌లో ఉత్తర, దక్షిణ కారిడార్లను ఒకేసారి ఆమోదించండి

హైదరాబాద్-అమరావతి-బందర్ పోర్ట్ ఎక్స్‌ప్రెస్‌వేకు అనుమతి ఇవ్వాలి

మహారాష్ట్రతో చర్చలకు కేంద్రం సహకరించాలి

హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయండి, వరంగల్ ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభించండి: ప్రధాని మోడీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్11:** తెలంగాణ రాష్ట్రానికి కీలకమైన పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై కేంద్రం సహకారం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకునేలా మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర భవిష్యత్తు అవసరాలకు గోదావరి జలాల వినియోగం అత్యంత ముఖ్యమని వివరించారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 విస్తరణ ప్రతిపాదనలను ఆమోదించాలని కూడా ప్రధానికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఫేజ్-2లో 7 కారిడార్లలో 122.9 కిలోమీటర్ల మెట్రో విస్తరణకు రూ.38,595 కోట్ల ప్రతిపాదనలు సమర్పించినట్టు వివరించారు. ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా మంజూరు చేయాలని కోరారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్ పనులకు వెంటనే ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి

>>2



గురువారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో సిఎం రేవంత్

## అభివృద్ధికి విద్యే మూలం

నగరాల అభివృద్ధి కోసం ఎం -6 టాస్క్‌ఫోర్స్

2

రూ.6 లక్షల కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేయండి

నీతి ఆయోగ్ సమావేశంలో సిఎం రేవంత్




నీతి అయోగ్ భేటీలో సిఎం రేవంత్, తమిళ సిఎం విజయ్

### మహేశ్వరం, చౌటుప్పల్‌లో 1500 మె.వా

# బ్యాటరీ ఇంధన నిల్వ ప్లాంట్లు

విద్యుత్ రంగంలో సరికొత్త విధానానికి రాష్ట్ర సర్కార్ శ్రీకారం

ఎకరా భూమి లీజు కేవలం ఒక్క రూపాయికే



**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** తెలంగాణలో విద్యుత్ కొరతను అధిగమించడానికి, గ్రేటర్ హైదరాబాద్ నగరానికి అంతరాయం లేని విద్యుత్ సరఫరాను అందించడానికి తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసేందుకు సర్కార్ సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. తొలి విడతలో గ్రేటర్ హైదరాబాద్ నగరానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు వీలుగా మహేశ్వరం, చౌటుప్పల్ ప్రాంతాల్లో 1500 మెగావాట్ల సామర్థ్యంతో సరికొత్త బ్యాటరీ ఇంధన నిల్వ ప్లాంట్ల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఇందుకోసం ట్రాన్స్‌కోకు చెందిన ప్రభుత్వ భూములను ఏడాదికి ఎకరాకు కేవలం రూ.1 చొప్పున లీజుకు ఇవ్వనున్నారు. ఈ టెండర్ల ఆమోదం కోసం తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కో పిటిషన్ సమర్పించింది. తక్కువ ధరకే భూములను లీజుకు ఇస్తూ భారీ బ్యాటరీ ఇంధన నిల్వ

>>2




# రాజ్‌కసిరెడ్డి, వాసుదేవరెడ్డి అరెస్టు

**లిక్కర్‌స్కాం కేసులో తెలుగు రాష్ట్రాల్లో ఇడి సోదాలు**

**మాజీ మంత్రి కారుమూరి నివాసాల్లో, కార్యాలయాల్లో ఇడి అధికారుల తనిఖీలు**

**హవాలా, మనీలాండరింగ్ ద్వారా నిధులు తరలించినట్లు ఇడి దర్యాప్తులో గుర్తింపు**

**హైదరాబాద్ జూన్ 11, ప్రభాతవార్త:** ఏపీలో సంచలనం రేపిన మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి హైదరాబాద్‌లో గురువారం నాడు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ నిర్వహించిన దాడుల్లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ స్కాంలో కీలక సూత్రధా రిగా వున్న రాజ్ కసిరెడ్డితో పాటు ఎపి బేవరరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండి వాసుదేవ రెడ్డిలను ఈడీ అధికారులు అరెస్టు చేశారు. వీరిద్దరిని గురువారం రాత్రి నాంపల్లిలోని ఈడీ కోర్టులో హాజరు పరచగా కేసును విచారించిన న్యాయమూర్తి ఇద్దరు నిందితులకు రెండు వారాల రిమాండు విధించడంతో వెంటనే చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగాఅంతకు ముందు ఉదయం ఎనిమిది గంటల నుంచి ఈకేసుకు సంబంధిం చి ఈడీ అధికారులు హైదరాబాద్‌లోని పలు చోట్ల సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నానక్‌రాంగూడలో రాజ్ కసిరెడ్డి ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఇదే సమయంలో నగరంలోనే వున్న ఎపి బేవరరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండి వాసుదేవ రెడ్డి ఇంట్లోనూ తనిఖీలు చేబట్టారు. దీంతో పాటు మరో ఆరుగురి ఇళ్లలో ఈడీ అధికారులు సోదాలు చేబట్టారు. సోదాల సందర్భంగా పెద్ద ఎత్తున పత్రాలను జప్తు చేశారు. అక్కడ వున్న వారిని ప్రశ్నించారు. ఏపీలో గతంలో అధికారంలో వున్న వైకాపా హయాంలో వెలుగు చూసిన మద్యం కుంభకోణం సంచలనం రేపడం తెలిసిందే. దీనిపై ఓవైపు ఆ రాష్ట్ర పోలీసు విభాగం విచారిస్తుండగా మరోవైపు ఈడీ అధికారులు మనీలాండరింగ్, హవాలా కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో కీలక సూత్రధారి రాజ్ కసిరెడ్డిని ఏపీ పోలీసులు ఇప్పటికే ఒకసారి అరెస్టు చేయగా ఆయన బెయిలుపై విడుదలై హై దరాబాద్‌లో వుంటున్నారు. వేల కోట్ల రూపాయల ఈ కుంభకోణంలో హవాలా, మనీలాండరింగ్ ద్వారా డబ్బులు చేతులు మారినట్లు అభియో గాలు వున్నాయి.

# ఇగ్నైట్ గోల్‌మాల్ గుట్టురట్టు

>> సిటీ పోలీసులు స్వల్ప వ్యవధిలో రట్టు చేశారు. నాలుగు రాష్ట్రాల్లో సిటీ సిసిఎస్‌లోని ఆర్థిక నేరాల విభాగం, స్పెషల్ బ్రాంచి పోలీసులు సం యుక్తంగా దాడులు నిర్వహించి సంస్థ మోసకారి కార్యకలాపాలను బట్టబయలు చేశారు. ఈ సందర్భంగా ఆరుగురు నేరగాళ్ల అరెస్టవగా ఐదు వేల కోట్ల రూపాయలను కాజేసేందుకు ఈ సంస్థ పన్నిన పన్నాగాన్ని వమ్ము చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సిటీ కొత్వాల్ సజ్జనర్ గురువారం మీడియాకు వెల్లడించారు. రెండున్నర దశాబ్దాల క్రితం ఏర్పాటైన గోల్డ్ క్వెస్ (క్యూనెట్) గోల్‌మాల్ సంస్థ గురించి తెలిసిందే. మల్టీలెవల్ మార్కెటింగ్‌తో పాటు తాము ఉత్పత్తి చేసిన అమాంబాపతు సరుకులు నాణ్యమైనవిగా ప్రచారం చేసి అమాయకులకు అంటగట్టి దండిగా దోపిడి చేయడం ఈ సంస్థ గొప్పత నం. ఈ సంస్థ బారినపడి లక్షలాది మంది మోసపోగా పలువురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ సంస్థ బండారాన్ని ఇంతకు ముందు సైబరా బాద్, హైదరాబాద్ పోలీసులు రట్టు చేయడం విదితమే. దీని తరువాత పలుపేర్లు మార్చి తాజాగా ఇగ్నైట్ పేరుతో తన వ్యాపారాన్ని కొనసాగి స్తూ మరోసారి అమాయకులను ముంచసాగింది. గతంలో వున్నట్లుగానే మల్టీలెవల్ మార్కెటింగ్ కొనసాగిస్తూ నాణ్యతపరంగా సవ్యంగా లేని ఉత్పత్తులను ఇగ్నైట్ సంస్థ మార్కెట్లో విక్రయిస్తోంది. ఈ సంస్థను నమ్మిన ముగ్గురు హైదరాబాద్ వాసులు 1.87 లక్షల రూపాయలు మోస పోగా దీనిపై ఇటీవలే పోలీసుకు ఫిర్యాదు చేశారు. మోసపోయిన ముగ్గురిని ఇగ్నైట్ సంస్థకు చెందిన నిర్వాహకులు ఆఫ్రికా వాట్సాప్ ద్వారా ఆన్‌లైన్ ద్వారా ముంచారని పోలీసుల విచారణలో తేలింది. ఈ క్రమంలో పంజాగుట్టలోని ఓ మాల్‌లో బాధితులతో సంస్థ నిర్వాహకులు ముఖాముఖిగా మాట్లాడారు. బాధితుల ఫిర్యాదుపై సిసిఎస్ ఆర్థిక నేరాల విభాగం కేసు నమోదు చేసి విచారణ చేబట్టగా మోసగాళ్లు కాజేసిన నగ దు కోల్‌కతాలోని భవానిపూర్‌లో గల పారస్‌నాథ్ మర్కంటైల్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ఖాతాకు చేరినట్లు తేలింది. ఇందుకు సంబంధించి మోసం చేసిన నేరగాళ్లు పక్కాగా ఒకే వ్యవస్థలో పనిచేసినట్లు తేలింది. దీనిపై మరింత లోతుగా విచారించగా హాంకాంగ్ కేంద్రంగా 25 ఏళ్లు గా ఈ సంస్థ గోల్‌మాల్‌ను కొనసాగుతున్నట్లు తేలింది. ఈ క్రమంలో పోలీసుల దాడులకు భయపడి అనేక పేర్లు మార్చుకున్నట్లు తేలింది. మొ దట 1998 నుంచి 2005 వరకు గోల్డ్ క్వెస్ట్ పేరిట పనిచేయగా పదికి పైగా దేశాలు దీనిని నిషేధించాయి. దీని తరువాత 2005 నుంచి 2012 వరకు క్వెస్ట్ నెట్ పేరుతో పనిచేసింది. ఈ క్రమంలో ఒక్క భారత్‌లోనే 50 వేలకు పైగా ఫిర్యాదులు ఈ సంస్థపై రావడంతో దీనిని నిషేధించారు. దీని తరువాత 2012 నుం చి 2026 వరకు క్యూనెట్ విహాన్ పేరిట భారత్‌లోని ముంబాయి, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, పూణె తదితర నగరాలలో గోల్‌మాల్ కార్యకలాపాలు నిర్వహించి లక్షలాది మందిని మోసం చేసి వందల కోట్ల రూపాయలను దోచుకుంది.

ఈ సంస్థను ఏడాది క్రితం నిషేధించడంతో ఇగ్నైట్ పేరిట కొత్తగా మళ్లీ మోసకారి కార్యకలాపాలను చేబట్టింది. ఈ సంస్థపైనా నిఘా పెరగడంతో చండీఘడ్‌లో ఇండి కనెక్ట్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఈ సంస్థ మరో అవతారం ఎత్తినట్లు సిటీ పోలీసుల విచారణలో తేలింది. కాగా ఈ సంస్థ బాధితులను మోసం చేయడానికి వారిని నమ్మించడానికి వాట్సాప్. జూం కాల్స్, షాపింగ్ మాల్స్ వంటి వేరు వేరు మార్గాలను ఎ ంచుకుంటున్నట్లు తేలింది. ఈ మార్గాలలో వసూలు చేసిన నగదును చివరకు ఇగ్నైట్ నెట్‌వర్క్‌కు చెందిన పారస్‌నాథ్ మ్యార్కంటైల్, ఇండి కనెక్ట్ వెంచర్స్ ఖాతాల్లో చేరినట్లు పోలీసులు తేల్చారు. కాగా ఈ గోల్‌మాల్‌కు సంబంధించి ఇగ్నైట్ టీం లీడర్‌గా వున్న ఢిల్లీ నివాసి ఒనియల్ గుప్తా (ఇతనిపై నగరంలో రెండు కేసులున్నాయి), సంస్థ డైరెక్టర్‌గా వున్న యుపిలోని బులంద్‌షహర్‌కు చెందిన దినేష్ కుమార్ (ఇతను ఇండి కనెక్ట్ వెంచర్స్‌కు డైరెక్టర్‌గా వున్నాడు), మరో డైరెక్టర్ యుపిలోని బులంద్‌షహర్‌కు చెందిన ప్రియాన్షు సక్సేనా (ఇతను కంపెనీలో 50 శాతం వాటా దారుగా వున్నాడు), మరో డైరెక్టర్ కోల్‌కతాకు చెందిన ప్రవీణ్ కుమార్ (ఇతను పారస్‌నాథ్ మార్కంటైల్‌లోనూ డైరెక్టర్‌గా వున్నాడు), మరో డైర క్టర్ కోల్‌కతా వాసి పరితోష్ కుమార్, సంస్థ తరపున ఉద్యోగులను రిక్రూట్ చేస్తున్న కేరళలోని మలప్పురం నివాసి రియాజ్‌లను అరెస్టు చేశారు.

కాగా ఇగ్నైట్ సంస్థ అమాయకులను మోసం చేసి సంపాదించిన నగదును భారత్ నుంచి హాంకాంగ్‌కు తరలిస్తున్నట్లు సిటీ కొత్వాల్ సజ్జ నర్ తెలిపారు. ఈ తరహా మోసకారి కంపెనీల ప్రకటనలను ప్రజ లు నమ్మరాదని సజ్జనర్ కోరారు. ఇగ్నైట్ కంపెనీ గోల్‌మాల్‌ను కేవలం 18 రోజుల్లో రట్టు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో అదనపు పోలీసు కమిషనర్ (క్రైం అండ్ సిట్) శ్రీనివాస్, ఎస్‌బి జాయింట్ సిపి విజయ్ కుమార్, సిసిఎస్ డిసిపి చైతన్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గురువారం నీతి ఆయోగ్ భేటీలో పాల్గొన్న ప్రధాన మంత్రి మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్, తెలంగాణ సిఎం రేవంత్ సహా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు

# గృహిణులు దేశ నిర్మాతలు

**కుటుంబంలో వారే కీలక పాత్ర**

**వారు చేసే పనికి వెల కట్టలేం**

**పరిహారం విషయంలోనూ అన్యాయం**

**సుప్రీం కోర్టు చారిత్రాత్మక తీర్పు**

**న్యూఢిల్లీ,జూన్ 11:** దేశంలో గృహిణుల శ్రమపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. గృహిణులు దేశ నిర్మాతలు అని, వారు చేసే పనికి కనీసం రూ.30వేలు పరిహారం చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. రోడ్డు ప్రమాదాల్లో గృహిణులు మరణించినా, వైకల్యం సంభవించినా నెలకు కనీస పరిహారం కింద ఈ మొత్తం చెల్లించాలని సూచించింది. సుప్రీంకోర్టు జడ్జీలు జస్టిస్ సంజయ్ కరోల్, కే కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం తాజా ఆదేశాలు జారీ చేసింది. రోడ్డు ప్రమాదాల్లో ఎవరైనా మరణించినా లేదా వైకల్యం సంభవించినా బాధితుల ఆదాయం వంటి వివరాల ఆధారంగా కూడా ఇన్సూరెన్స్ కంపెనీలు పరిహారం అందిస్తాయి. ఈ నేపథ్యంలో ఒక కేసుకు సంబంధించి సుప్రీం కోర్టు తాజా ఆదేశాలు జారీ చేసింది. రోడ్డు ప్రమాదాల్లో గృహిణులు మరణిస్తే బాధితులకు నెలకు రూ.30వేల పరిహారం అందించాలని ఆదేశించింది. గృహిణులను దేశ నిర్మాతలుగా అభివర్ణించింది. వారు ఇంటి పని చేస్తూ, పిల్లల్ని, కుటుంబ సభ్యుల్ని చూసుకుంటారని, వారి అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని, అంతిమంగా దేశాభివృద్ధికి దోహదపడతారని కోర్టు అభిప్రాయపడింది. వారు ఇంట్లోచేసే పనులతో ఆదాయం సంపాదించకపోయినంతమాత్రాన వారి పనితనానికి వెలకట్టలేమని కాదని, సగటున కనీసం రూ.30వేలు చెల్లించాలని ఆదేశించింది. సాధారణంగా గృహిణులు చేసే పనులకు పరిహారం తక్కువగా వస్తుంటుంది. ఎందుకంటే ఈ పనిని ఇటు కూలీ పనిలాగా కాకుండా, అటు స్కిల్డ్, నాన్ స్కిల్డ్ పనిలాగా కాకుండా చూస్తారు. అందుకే పరిహారం విషయంలో గృహిణులకు తగిన న్యాయం జరగడం లేదు. సుప్రీంకోర్టు తాజా ఆదేశాలకు అనుగుణంగా ఇకపై గృహిణులు మరణిస్తే వారి కుటుంబాలకు ప్రతి నెలా కనీస పరిహారం అందే అవకాశం ఉంది. 2001లో పంజాబ్‌లో ఒక మహిళ రోడ్డు ప్రమాదంలో మరణించింది. ఆమె తరఫున పరిహారం కోరుతూ భర్త, ముగ్గురు పిల్లలు మోటార్ యాక్సిడెంట్స్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. అనంతరం ఈ అంశం వివిధ కోర్టుల్లో విచారణ జరుగుతూ.. చివరికి సుప్రీంకోర్టు వరకు చేరింది. తాజాగా కోర్టు వారికి అనుకూలంగా, పరిహారం చెల్లించాలని ఆదేశించింది.

# అభివృద్ధికి విద్యే మూలం

**కులగణన తర్వాత అభివృద్ధి నమూనా వివరించిన సిఎం**

**ప్రధాన నగరాల అభివృద్ధి కోసం 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలి**

**నీతి ఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్11:** దేశ అభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాదని నీతి ఆయోగ్ సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కులగణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనాను నీతి ఆయోగ్‌లో ఆయన వివరించారు. విద్యా విప్లవం, నైపుణ్యాభివృద్ధి, ప్రపంచ స్థాయి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టిఅవసరమని ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం చెబుతున్న వికసిత్ భారత్2047 లక్ష్యాన్ని సాధించాలన్నా, దేశంలోని ప్రతి విద్యార్థికి, పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలని చెప్పారు. గురువారం రాష్ట్రపతి భవన్‌లో ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... దేశ అభివృద్ధి అంటే ప్రజల అభివృద్ధేనని గుర్తు చేశారు. ప్రజలను ఆర్థిక శక్తులుగా, దేశ నిర్మాతలుగా తీర్చిదిద్దడంలో విద్య, ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తాయని సీఎం చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం 2024లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (ఎస్ఈఈఈపిసి)లో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయని సీఎం తెలిపారు. గడచిన 75 ఏండ్లలో మనమంతా ఉచిత విద్య అందించేందుకు ప్రయత్నం చేశామని, కానీ నాణ్యమైన విద్యను అందించడం మనకు ఒక సవాలుగా మారిందన్నారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టిందన్నారు. తమ ప్రభుత్వం నిర్మించే యంగ్ ఇండియా స్కూల్స్ కులాల మధ్య గోడలు కూల్చివేస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. సమాజంలో సమానత్వం పెంపొందించేందుకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

దేశంలో ఏ రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి అయినా.. అధికారులైనా తమ రాష్ట్రంలోని యంగ్ ఇండియా స్కూల్స్ చూడాలంటే తాము సంతోషంగా చూపిస్తామని చెప్పారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) యుగంలో యువతకు కొత్త నైపుణ్యాలు అవసరమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తయారీ రంగం, సేవారంగాల్లో భారీ ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైల్వే, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను తెలంగాణకు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని, ఈ దిశగా యూనివర్సిటీ ఆఫ్ లండన్ హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు చేయడం తొలి విజయమని వివరించారు. దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఇంజిన్లుగా ఉన్న ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నగరాల అభివృద్ధి కోసం ప్రధానమంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. ఈ నగరాల అభివృద్ధి కోసం రూ.6 లక్షల కోట్ల ప్రత్యేక నిధిని కేటాయించాలని కోరారు.

ఒక్కో నగరానికి రూ.1 లక్ష కోటి చొప్పున మౌలిక వసతుల అభివృద్ధికి అందించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరుతూ సీఎం పలు ప్రతిపాదనలు చేశారు. రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ, మూసీ నది పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అనుమతులు, సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు మద్దతు, హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు వంటి అంశాల్లో సహకారం అందించాలని కోరారు. దేశ ప్రజల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి పెడితే ప్రపంచంలోనే అత్యుత్తమ దేశంగా భారత్ అవతరిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# బ్యాటరీ ఇంధన నిల్వ ప్లాంట్లు

>> ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం టెండర్లను ఖరారు చేసింది. రాజధాని శివారు ప్రాంతమైన రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పరిసరాల్లో ట్రాన్స్‌కోకు ఉన్న ప్రభుత్వ భూముల్లో ఈ ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి. ఈ మెగా ప్రాజెక్టును ఆకర్షణీయంగా మార్చడానికి ప్రభుత్వం ల్యాండ్ లీజ్ పాలసీలో భారీ రాయితీ ప్రకటించింది. ప్లాంట్లను ఏర్పాటు చేసే ప్రైవేట్, ప్రభుత్వ సంస్థలకు ఎకరా భూమిని ఏడాదికి కేవలం రూ.1 చొప్పున, 15 సంవత్సరాల కాలపరిమితితో లీజుకు ఇవ్వనున్నారు. మహేశ్వరం, చౌటుప్పల్‌లలో ఒక్కొక్కటి 187.5 మెగావాట్ల సామర్థ్యంతో ఈ గ్రిడ్ ఆధారిత ప్లాంట్లు నిర్మితమవుతాయి. కాగా ప్లాంట్ నిర్మించే సంస్థలు రోజులో విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉండే సమయంలో ఖచ్చితంగా 4 గంటల పాటు బ్యాటరీల నుండి కరెంట్‌ను సాధారణ విద్యుత్ గ్రిడ్‌కు సరఫరా చేయాలి. ఇలా రోజుకు రెండు విడతలుగా మొత్తం 8 గంటలు 1500 మెగావాట్ల కరెంట్‌ను సరఫరా చేస్తారు. ఈ బ్యాటరీ విద్యుత్‌ను కొనుగోలు చేయడానికి దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్లాంట్ల ఏర్పాటును పర్యవేక్షించి, పంపిణీ సంస్థలకు విద్యుత్ విక్రయాలు జరిపించినందుకు గాను ప్రతి యూనిట్‌కు 7 పైసల చొప్పున జెన్కో కమీషన్ రూపంలో ఆదాయాన్ని పొందుతుంది. ఈ ప్రాజెక్టు కోసం తొలుత 16 కంపెనీలు టెండర్లు దాఖలు చేశాయి. ప్రారంభంలో ఒక మెగావాట్‌కు నెలకు మహేశ్వరం ప్లాంటుకు రూ.3.06 లక్షలు, చౌటుప్పల్ ప్లాంటుకు రూ.3.25 లక్షల ధర కోట్ చేయగా.. అది చాలాఎక్కువగా ఉందని జెన్కో భావించింది. దీంతో పారదర్శకత కోసం అధికారులు రివర్స్ బిడ్డింగ్ విధానాన్ని అమలు చేశారు. ఈ రీటెండర్లలో ధరలు భారీగా తగ్గాయి. మహేశ్వరానికి రూ.2.98 లక్షల అత్యల్ప ధరకు ఒక ప్రైవేట్ కంపెనీ, చౌటుప్పల్ ప్లాంటుకు రూ.3.14 లక్షల ధరకు ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా టెండర్లను కైవసం చేసుకున్నాయి. గతేడాది హైదరాబాద్ శివారు శంకర్‌పల్లిలో ఈ ప్లాంట్ ఏర్పాటు చేయాలని భావించినప్పటికీ టెండర్ల ఆమోదంలో జాప్యం జరగడంతో కేంద్రం అప్పట్లో కేటాయించిన రూ.27 లక్షల వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ రద్దయింది. అయినప్పటికీ ప్రస్తుత కొత్త ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం మెగావాట్‌కు రూ.18 లక్షల చొప్పున వీజీఎఫ్ నిధులను మంజూరు చేయనుందని జెన్కో స్పష్టం చేసింది. కాగా తెలంగాణలో ఇంతవరకు ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి మాత్రమే ప్రయోగాత్మకంగా చిన్న బ్యాటరీ నిల్వ ప్లాంటును ఏర్పాటు చేయగా, ఇంత పెద్ద ఎత్తున గ్రిడ్ బ్యాకప్ ప్లాంట్లు రావడం ఇదే తొలిసారి.

# 'ఖర్గ్'ను స్వాధీనం చేసుకుంటాం

**వరుసగా మూడో రాత్రి భీకర దాడులుచేస్తాం: అమెరికా అధ్యక్షుడు**

**వాషింగ్టన్,జూన్ 11:** ఇరాన్‌పై సైనిక చర్యలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వరుసగా మూడో రాత్రి కూడా అమెరికా దాడులు కొనసాగుతాయని ఆయన తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ప్రకటించారు. ఇరాన్ నౌకాదళం, వైమానిక దళం, రాడార్ వ్యవస్థలు, వైమానిక రక్షణ సామర్థ్యాలు దాదాపు నిర్వీర్యమయ్యాయని పేర్కొంటూ, ఈ రాత్రి ఇరాన్‌పై అమెరికా చాలా తీవ్రంగా దాడి చేస్తుందని ట్రంప్ వెల్లడించారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఖర్గ్ దీవిని తమ ఆధీనంలోకి తీసుకుంటామని ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ ముడి చమురు ఎగుమతుల్లో సుమారు 90 శాతం ఈ దీవి ద్వారానే జరుగుతుండటంతో దీనికి వ్యూహాత్మక ప్రాధాన్యం ఉంది. ఇరాన్ చమురు, గ్యాస్ మార్కెట్లపై పూర్తిస్థాయి నియంత్రణ సాధిస్తామని ఆయన అన్నారు. అమెరికా సెంట్రల్ కమాండ్ ఇరాన్‌లోని పలు లక్ష్యాలపై అదనపు ఆత్మరక్షణ దాడులు నిర్వహించినట్లు ధృవీకరించింది. దీంతో వరుసగా రెండో రోజు అమెరికా సైనిక చర్యలు కొనసాగినట్లైంది. మరోవైపు ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లో వైమానిక రక్షణ వ్యవస్థలు యాక్టివేట్ అయ్యాయని, టెహ్రాన్ పశ్చిమ ప్రాంతాలు, ఫార్స్ ప్రావిన్స్, బందర్ అబ్బాస్, ఖేష్మ్, కిష్, ఇస్ఫహాన్ ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కువైట్, బహ్రెయిన్‌లలోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణి దాడులు జరిపామనిప్రకటించింది. అలీ అల్ సలేం, అహ్మద్ అల్ జాబర్ వైమానిక స్థావరాలతో పాటు బహ్రెయిన్‌లోని షేక్ ఈసా ఎయిర్ బేస్‌ను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇరాన్ వెల్లడించింది. అమెరికా ఆర్మీకి చెందిన అపాచీ హెలికాప్టర్ కూల్చివేత తర్వాత పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఏప్రిల్ 8 నుంచి అమల్లో ఉన్న కాల్పుల విరమణ ఒప్పందం ఈ ఘటనతో దాదాపు కూలిపోయినట్లైందని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా, ఇరాన్ పరస్పర దాడులతో మళ్లీ యుద్ధ వాతావరణం నెలకొంది. ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రాంతీయ దేశాలు దౌత్యపరమైన పరిష్కారానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో ఖతర్ ప్రతినిధి బృందం టెహ్రాన్‌కు వెళ్లి ఇరాన్ అధికారులతో చర్చలు జరిపింది.




గురువారం న్యూఢిల్లీలో మీడియాతో కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్

# భారత్‌కు అతిపెద్ద సంపద 70 కోట్లమంది యువత!

**వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగస్వాములను చేయాలి**

**నీతి ఆయోగ్11వ భేటీలో ప్రధాని మోడీ**

**న్యూఢిల్లీ, జూన్ 11:** ప్రపంచస్థాయిలోప్రధాన ఆర్థికవ్యవస్థల్లో అధికశాతం అనిశ్చితి, సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ భారత్ ఆర్థికవృద్ధిప్రపంచానికి స్ఫూర్తిగా నిలుస్తోందని ప్రధాని నరేంద్రమోడీ పేర్కొన్నారు. స్వావలంబన లక్ష్యం మరింత బలోపేతం కావాలని, పునరుత్పాదక ఇంధన రంగంలో అంతర్జాతీయ పద్ధతులను అమలుచేయాలని కోరారు. నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశానికి అధ్యక్షత వహించి ప్రసంగించిన ప్రధాని కేంద్ర రాష్ట్రాలు కలిసి పనిచేస్తేనే వికసిత భారత్ లక్ష్యం సాధించగలమన్నారు. ప్రతిరాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామస్థాయిలో ఉమ్మడి సంకల్పంగా వికసిత్‌భారత్ లక్ష్యం ఉండాలని అన్నారు. భారత్‌కు అత్యంత మేలుచేసే అంశం అతిపెద్ద సంపద యువతేనన్నారు. సుమారు 70 కోట్లమంది 25 ఏళ్లలోపు యువత ఉన్నారన్నారు. ఈ జనాభాను అభివృద్ధికారకులుగా మార్చేందుకు విద్య,నైపుణ్యాభివృద్ధి, సామర్థ్య, నిర్మాణ కార్యక్రమాలపై రాష్ట్రాలు దృష్టిసారించాలని కోరారు. భారత్ పలుదేశాలతో ఏర్పరుచుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ప్రయోజనాలను యువత ఎంఎస్ఎంఇ రంగం సద్వినియోగంచేసుకునేలా రాష్ట్రాలుచర్యలు తీసుకోవాలన్నారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ మూడు లకోట్లలఖ్‌పతి దీదీల సంఖ్యను ఆరుకోట్లకు పెంచేలక్ష్యంతో రాష్ట్రాలు పనిచేయాలన్నారు. వన్‌డిస్ట్రిక్ట్ వన్‌ప్రొడక్ట్ (ఒడిఒపి) కార్యక్రమాలు బలోపేతంచేసి ఎగుమతి ఆధారిత వ్యూహాలు అమలుచేయాలన్నారు. రక్షణరంగ తయారీలో భారత్‌ప్రత్యేక గుర్తింపును సాధించిందని, ఈరంగంలో అవకాశాలు సద్వినియోగం అయ్యేలా రాష్ట్రాలు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఆశావహ జిల్లాల నమూనాలోనే వ్యవసాయ రంగంలో 100 జిల్లాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. వికసిత్‌భారత్ 2047 లక్ష్యసాధనకు 100 రోజుల, ఐదేళ్ల కార్యాచరణప్రణాళికలు, పర్యవేక్షణ వ్యవస్థలురూపొందించాలని రాష్ట్రాలనుకోరారు. పెట్టుబడుల సాధనకు సుపరిపాలన, పారదర్శకత, మౌలిక సదుపాయాల వృద్ధి కీలకమని పేర్కొన్న ప్రధాని డేటా సెంటర్లు, కృత్రిమ మేధను వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో అవకాశాలు వినియోగించుకోవాలన్నారు. ఎఐను సవాలుగా కాకుండా అవకాశంగామాత్రమే చూడాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే సవాళ్లపై దృష్టిపెట్టిన ప్రధాని జలసంరక్షనకు ప్రాదాన్యం ఇవ్వాలని, సహజ సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని రాష్ట్రాలనుకోరారు. ఖరీఫ్‌సీజన్‌లో రైతులు 11 లక్షల టన్నుల సేంద్రీయ ఎరువులను కొనుగోలు చేయడం స్థిరమైన వ్యవసాయంఐ పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. డ్రగ్స్ వినియోగం, సైబర్ మోసాలు వంటిసామాజిక సవాళ్ల ఎదుర్కొనేందుకు సమన్వయంతో చర్యలు అవసరమన్నారు. అవగాహణ సదస్సులు, సుపరిపాలనద్వారా ఈసమస్యలు అధిగమించవచ్చన్నారు. దేశంలోని 28 రాష్ట్రాలముఖ్యమంత్రులు, ఐదు కేంద్రపాలితప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, పరిపాలనాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మొత్తం 28 రాష్ట్రాలముఖ్యమంత్రులు పాల్గొనడం ఇదే మొదటిసారి. సమావేశంలో మోడీ 12 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భాన్నిపురస్కరించుకుని ఆయనకు ప్రత్యేక అభినందనలుతెలిపారు.

# మెట్రో ఫేజ్2 విస్తరణను ఆమోదించండి

>> కోరారు. ఉత్తర భాగంలో భూసేకరణ ఖర్చులో 50 శాతం వాటా భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని, ఎన్‌హెచ్ఏఐకి రూ.626 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. ఉత్తర భాగానికి సంబంధించి 90 శాతానికి పైగా భూసేకరణ అవార్డు పూర్తయిందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ట్రిపుల్ ఆర్‌లో దక్షిణ భాగం నిర్మాణం కూడా అంతే కీలకమని ముఖ్యమంత్రి వివరించారు. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు దక్షిణ కారిడార్ నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ చుట్టూ రవాణా వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని తెలిపారు.

దక్షిణ భాగానికి సంబంధించిన అలైన్‌మెంట్ మ్యాపులు, హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్లను ఇప్పటికే కేంద్ర రోడ్డు రవాణా శాఖకు అందించామని చెప్పారు. ఉత్తర, దక్షిణ కారిడార్లను ఒకేసారి ఆమోదించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్-అమరావతి-బందర్ పోర్ట్ ఎక్స్‌ప్రెస్‌వేకు కేంద్రం అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్టును కలిపే 12 లేన్ ఎక్స్‌ప్రెస్‌వే తెలంగాణకు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందని చెప్పారు. 120 మీటర్ల రైట్ ఆఫ్ వే తో ప్రతిపాదించిన ఈ హైవే ద్వారా సముద్ర తీరం లేని తెలంగాణకు పోర్ట్ కనెక్టివిటీ లభిస్తుందని వివరించారు. ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల ఎగుమతులకు ఇది కీలక మార్గంగా నిలుస్తుందని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనులను ప్రారంభించాలన్న అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. ఇప్పటికే అవసరమైన భూసేకరణ పూర్తిచేసి ఎయిర్ పోర్ట్ అథారిటీకి అప్పగించామని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ పారిశ్రామిక, విద్యా, పర్యాటక రంగాలకు మరింత లబ్ధి చేకూరుతుందని అన్నారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలని కోరారు.

ఐఐఎంకు అవసరమయ్యే 200 ఎకరాల స్థలం కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే ఐఐటీ, ఐఐఐటీ, నల్సార్, టీఐఎఫ్ఆర్ వంటి ప్రముఖ జాతీయ విద్యాసంస్థలున్నాయని, ఐఐఎం ఏర్పాటు చేస్తే నూతన విద్యావిధానం -2020 ఆశించిన లక్ష్యం కూడా నెరవేరుతుందని ప్రస్తావించారు.

## వారం - వర్జ్యం

12-06-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, మృగశిర కార్తె
ద్వాదశి రా.7.32, అశ్వని ఉ.6.28
భరణి తె.4.04
వర్జ్యం : మ.3.06-సా.4.33
దు.ఉ.8.11-ఉ.9.03
(2) మ.12.33-మ.1.25
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** నూతన ప్రయత్నాలు నిదానంగా నెరవేరుతాయి. విలాస జీవితం సాగిస్తారు. పాతబాకీలు వసూలవుతాయి.

**వృషభం:** వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. దేవాలయాలను సందర్శిస్తారు. ఇంటా బయటా సమస్యలు ఎదురైన అధిగమిస్తారు.

**మిథునం:** దూరపు బంధువుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. కోర్టు వివాదాల నుండి బయటపడతారు.

**కర్కాటకం:** భూ వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. చాకచక్యంగా వ్యవహరించి కార్యక్రమాలు పూర్తి చేస్తారు.

**సింహం:** కుటుంబ సభ్యులందరి ప్రోత్సాహం లభిస్తుంది. శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. గృహ కొనుగోలు.

**కన్య :** శ్రమకు తగిన ఫలితం ఉండదు. కొత్త కార్యక్రమాలు చేపట్టినా ముందుకు సాగవు. స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి.

**తుల :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండదు. కుటుంబ సమస్యలు కొంతవరకు తీరుతాయి. బంధువుల కలయిక.

**వృశ్చికం:** ఇంటర్వ్యూలకు హాజరవుతారు. పట్టుదలతో ముందుకు సాగుతారు. ముఖ్య సమాచారం అందుకుంటారు.

**ధనుస్సు:** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడుతాయి. ఆ పరిచయాలు భవిష్యత్తుకు బంగారు బాటలు అవుతాయి.

**మకరం:** చాకచక్యంగా వ్యవహరించి ఎంతటి వారినైనా ఆకట్టుకుంటారు. సమస్యల నుండి బయటపడతారు. వాహనసౌఖ్యం కలదు.

**కుంభం:** రాజకీయ రంగాలలోని వారికి యోగదాయకమైన కాలం. మధ్యవర్తిత్వం లాభించదు. శుభవార్తలు అందుకుంటారు.

**మీనం:** సంతానం నాకు విద్యావకాశాలు పొందుతారు. భూముల విషయంలో నూతన అగ్రిమెంట్లు చేసుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



## సదరన్ కమాండ్ జిఒసిఇన్‌సి గవర్నర్‌తో భేటీ

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 10: పుణెలోని సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్‌ఇన్‌చీఫ్ (జీఓసీఇన్‌సీ) లెఫ్టినెంట్ జనరల్ సందీప్ జైన్ (ఏవీఎస్ఎం, ఎస్ఎం) తెలంగాణలో అధికారిక పర్యటనలో భాగంగా గురువారం లోక్ భవన్‌లో తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. సదరన్ కమాండ్‌కు చెందిన పలువురు సీనియర్ సైనిక అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ జనరల్ సందీప్ జైన్ సదరన్ కమాండ్ పరిధిలో చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు, భద్రతా చర్యల గురించి గవర్నర్‌కు వివరించారు. గండిపేట చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.వి. నరసింహులు గవర్నర్‌ను కలిశారు. వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ అధ్యక్షుడు సిద్దా వెంకటసూర్యప్రకాశరావు, సంస్థకు చెందిన ఇతర సభ్యులతో కలిసి లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్‌ప్రతాప్‌శుక్లాను కలిశారు. గవర్నర్‌తో జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం నాయకుల భేటీ జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు చందా లింగయ్య దొర, సంఘం ప్రతినిధులతో కలిసి గురువారం లోక్ భవన్‌లో గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను కలిశారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ పొందుపరిచిన నిబంధనల ప్రకారం తెలంగాణలోని షెడ్యూల్ ప్రాంతాలలో పెసా చట్టం, 1/70 చట్టం పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని గవర్నర్ కు జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం ప్రతినిధులు కోరారు. గిరిజన ప్రాంతాల్లో ఇసుక, ఖనిజ వనరుల వెలికితీత బాధ్యతలను స్థానిక గిరిజనులకే అప్పగించాలని, ఆ నిధులను గిరిజన అభివృద్ధి ప్రాంతాలకే వెచ్చించేలా చూడాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, భాషా పరిరక్షణ ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

## థర్మల్ పవర్ ప్లాంట్‌లో కార్మికుల నిరసన

హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త: ఎన్టీపీసీ యాజమాన్యం వ్యవహారశైలిపై కార్మికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. యాజమాన్యం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కాంట్రాక్టు కార్మికుల నిరసనలు చేశారు. జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ గేట్ 2 వద్ద ఉదయం కార్మికులు విధులను బహిష్కరించి పెద్దఎత్తున నిరసన తెలపారు. 2018లోని అగ్రిమెంట్‌లో చేసుకున్న చట్టబద్ధమైన ఒప్పందాన్ని ఎన్టీపీసీ యాజమాన్యం పూర్తిగా తుంగలో తొక్కిందని కార్మికులు ఆరోపించారు. కాంట్రాక్టర్ మారినప్పుడల్లా పీఎఫ్ వేధింపులు ఎందుకని ప్రశ్నించారు. దశాబ్దాలుగా ఇక్కడే నమ్ముకుంగా పని చేస్తున్న కార్మికులపై ప్రతిసారి పోలీస్ వెరిఫికేషన్ పేరుతో కొత్త ఆంక్షలు దేనికని నిలదీశారు.

## ఉద్యోగం పేరిట రూ. 10 లక్షలు కాజేసి, బాధితుడిని బెదిరించిన నేరగాడికి యేడాది జైలు

హైదరాబాద్ జూన్ 11, ప్రభాతవార్త: ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఓ నిరుద్యోగి నుంచి పది లక్షల రూపాయలు తీసుకుని, అతన్ని మోసం చేయడంతో పాటు చంపుతానని బెదిరించిన కేసులో ఓ నేరగాడికి నాంపల్లి కోర్టు ఏడాది కారాగార శిక్షతో పాటు పది వేల రూపాయల జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పింది. వివరాలు ఇలావున్నాయి. నిర్మల్ జిల్లా సోమవార్ పేట్‌కు చెందిన అనంతుల అభిలాష్ (33) అంబర్‌పేట్‌లోని ఆనంద్‌నగర్‌లో వుంటూ వ్యాపారం చేస్తుంటాడు. 2017లో మలక్‌పేట్‌కు చెందిన తనకు పరిచయస్తుడు శ్యాంసుందర్ నుంచి అభిలాష్ ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి పది లక్ష రూపాయలు తీసుకున్నాడు. దీని తరువాత నెలలు గడిచినా అభిలాష్ నుంచి ఎలా ఆటి సమాచారం రాకపోవడంతో బాధితుడు దీనిపై నిలదీశాడు. దీంతో అభిలాష్ తనకు తెలిసిన రౌడీలతో బాధితుడిని బెదిరించి చంపుతానని హెచ్చరించాడు. దీనిపై బాధితుడు అదే ఏడాది నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేసి అభిలాష్‌పై చర్యలు తీసుకోవాలని మెజిస్ట్రేట్‌ను కోరాడు. ఈ పిటిషన్‌ను విచారించిన కోర్టు అభిలాష్‌పై కేసు నమోదు చేసి విచారణ చేయాలని చాదర్‌ఘాట్ పోలీసులను ఆదేశించింది. కోర్టు ఆదేశాల మే రకు అభిలాష్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేబట్టి నిందితుడు బాధితుడిని మోసం చేసినట్లు తేల్చారు. దీనిపై నాంపల్లి కోర్టులో తొమ్మిదేళ్లుగా విచారణ జరిగింది. ఈ కేసుపై గురువారం నాడు నాంపల్లి ఎనిమిదవ ఎసిజెఎం కోర్టు న్యాయమూర్తి సిహెచ్ సంపత్ కుమార్ తీ ర్పు వెలువరి స్తూ నిందితుడు అభిలాష్‌కు ఏడాది పాటు కారాగార శిక్షతో పాటు పది వేల రూపాయల జరిమానా విధించారు. ఈ కేసులో ఎపి పిగా రమణితో పాటు పోలీసు శాఖ తరపున కోర్టులో ఆధారాలు సమర్పించిన కానిస్టేబుళ్లను ఇన్‌స్పెక్టర్ మురారి అభినందించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

## ఓటరు జాబితా సవరణపై ప్రతిపక్షాల దుష్ప్రచారం తగదు

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

కొండపాక, జూన్ 11, ప్రభాతవార్త: ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారం మానుకోవాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు హితవు పలికారు. సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండల పరిధిలోని మాత్‌పల్లి శివారులో ఉన్న ఓ ప్రైవేటు రిసార్ట్‌లో గురువారం నిర్వహించిన పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు రాజకీయ లబ్ధి కోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 1952 సంవత్సరం నుండి దాదాపు దేశంలో 10 సార్లు ఓటరు జాబితా సవరణలు జరిగాయన్నారు. ఇది కొత్తగా తెచ్చిన అంశం కాదని ఆయన ప్రతిపక్షాలకు సూచించారు. నకిలీ ఓట్లు, చనిపోయినవారి ఓట్లు, ఒకే వ్యక్తికి పలుచోట్ల ఉన్న ఓట్లను తొలగించడమే ఈ ప్రక్రియ ముఖ్య ఉద్దేశమన్నారు. హైదరాబాద్‌లో అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలు ఓటర్లుగా నమోదు కాకుండానికే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు ఉన్నాయన్నారు. అందుకే అర్హులైన భారతీయ పౌరుల హక్కులను కాపాడడానికి ఈ ప్రక్షాళన అవసరమన్నారు. ఓటరు జాబితా సవరణకు, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు లేదా ఆస్తులకు ఏలాంటి సంబంధం లేదన్నారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దన్నారు. మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రక్షాళనను రాజకీయ కోణంలో చూడకుండా ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతను పెంచే చర్యగా ప్రజలు అర్థం చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒకరుకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, అధికార ప్రతినిధి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలేష్ గౌడ్, వివిధ మండలాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ కట్టడికి ఎఐని ఆయుధంగా ఉపయోగించాలి

### ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

### తెలంగాణలో అంతర్జాతీయస్థాయి నిఘా వ్యవస్థలను తీసుకువస్తాం

### ఎక్సైజ్ అకాడమీలో ఘనంగా పాసింగ్‌ఔట్ పరేడ్



ప్రతిభ కనబరిచిన అధికారులకు బహుమతులు అందజేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్ జూన్ 11,ప్రభాతవార్త: రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, మాదకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ బండ్లగూడ జాగీర్‌లోని ఎక్సైజ్ అకాడమీలో గురువారం నిర్వహించిన అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ల దీక్షాంత్ పరేడ్ (పాసింగ్ అవుట్ పరేడ్)లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి, కొత్తగా విధుల్లోకి అడుగుపెడుతున్న అధికారులు ప్రజాసేవ, కర్తవ్య నిష్ఠ, నిజాయితీని తమ సేవా జీవితానికి మార్గదర్శక సూత్రాలుగా మలచుకోవాలని పిలుపునిచ్చారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు మంత్రి పురస్కారాలు అందజేశారు. ఆరు నెలల కఠోర సంస్థాగత శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 28 మంది అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, 89 మంది ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు కలిపి మొత్తం 117 మంది అధికారులు దీక్షాంత్ పరేడ్‌లో పాల్గొన్నారు. వీరిలో 33 మంది మహిళా అధికారులు ఉన్నారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర మద్యనిషేధ, ఎక్సైజ్ శాఖ కేవలం ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే శాఖ మాత్రమే కాదని, యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడటం, సమాజాన్ని మాదకద్రవ్యాల ముప్పు నుంచి రక్షి ంచే అత్యంత కీలకమైన విభాగమని మంత్రి స్పష్టం చేశారు. ఒకప్పుడు నాటుసారా, గుడుంబా, దేశీదారు, కల్తీ కల్లు ప్రధాన సవాళ్లుగా ఉండేవని, ప్రస్తుతం గంజాయి, సింథటిక్ డ్రగ్స్, నార్కోటిక్ నెట్‌వర్క్‌లు, ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న అక్రమ వ్యాపారాలు కొత్త సవాళ్లుగా మారాయని తెలిపారు. డ్రగ్స్ అనేవి కేవలం చట్ట ఉల్లంఘన మాత్రమే కాదని, కుటుంబాలను విచ్ఛిన్నం చేసి యువత భవిష్యత్తును నాశనం చేసే సామాజిక విపత్తని పేర్కొన్నారు. అధికారులు స్వాధీనం చేసుకునే ప్రతి డ్రగ్స్ ప్యాకెట్ వెనుక ఒక యువకుడి భవిష్యత్తు ఉంటుందని, వారి విధులు కేవలం నమోదు వద్ద ముగియవని, సమాజాన్ని రక్షించడంలో ప్రారంభమవుతాయని అన్నారు.

#### సాంకేతికతే అతిపెద్ద ఆయుధం

నేటి కాలంలో నేరగాళ్లు సాంకేతికతను వినియోగించి కొత్త మార్గాల్లో నేరాలకు పాల్పడుతున్నారని, వారిని ఎదుర్కోవడానికి అధికారులు కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని మంత్రి సూచించారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు డ్రగ్స్ నెట్‌వర్క్‌లను ఛేదించేందుకు డేటా అనలిటిక్స్, కృత్రిమ మేధస్సు (ఏఐ), ఆధునిక నిఘా వ్యవస్థలను వినియోగిస్తున్నాయని తెలిపారు. డ్రోన్ సర్వైలెన్స్ ద్వారా గంజాయి సాగు, అక్రమ సారా కేంద్రాలను గుర్తించడం, మొబైల్ యాప్స్, జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా రవాణాను పర్యవేక్షించడం, సోషల్ మీడియా ఇంటెలిజెన్స్ ద్వారా డ్రగ్ నెట్‌వర్క్‌లను ముందుగానే పసిగట్టడం సాధ్యమవుతుందని చెప్పారు. తెలంగాణలో కూడా అంతర్జాతీయ స్థాయి నిఘా విధానాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా అమలు చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

#### డ్రగ్స్‌పై నిర్లక్ష్యం పోరు అవసరం

డ్రగ్స్, గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలని, రాష్ట్రంలోకి మాదకద్రవ్యాలు ప్రవేశించకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. గంజాయి, మద్యం అక్రమ రవాణా చేసే ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమార్కులు ఎంతటివారైనా చట్టం ముందు నిలబెట్టాలని ఆదేశించారు. మెరుగైన పోలీసింగ్ కోసం ప్రజల సహకారం అవసరమని ఆయన అన్నారు. మోకాలిరోగ్య కర్తవ్య నిర్వహణ ఉండాలని స్పష్టం చేశారు.

#### సామ్య సావాసం స్ఫూర్తిగా తీసుకోవాలి

క్రమశిక్షణ, నిజాయితీ, పారదర్శకత, ప్రజాసేవా దృక్పథమే అధికారుల అసలు గుర్తింపుగా ఉండాలని మంత్రి పేర్కొన్నారు. అక్రమ మద్యం తయారీ, మాదకద్రవ్యాల రవాణాను అరికట్టడం ద్వారా తెలంగాణను మరింత సురక్షితమైన, ఆరోగ్యకరమైన రాష్ట్రంగా తీర్చిదిద్దవచ్చని అన్నారు. నిజామాబాద్‌లో గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో ప్రాణత్యాగం చేసిన కానిస్టేబుల్ సౌమ్య ధైర్యసాహసాలు కొత్త అధికారులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఖురేషీ, అకాడమీ డైరెక్టర్ సురేష్, జాయింట్ కమిషనర్ అంజన్‌రావు, జాయింట్ డైరెక్టర్ శశిధర్‌రెడ్డి, చీఫ్ డ్రిల్ ఇన్‌స్ట్రక్టర్ రంగారెడ్డి, ఇతర ఉన్నతాధికారులు, శిక్షణార్థుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా పరీక్షల మూల్యాంకన వ్యవస్థ

### ఉస్మానియా యూనివర్సిటీ


హైదరాబాద్ (తార్నాక), జూన్ 11, ప్రభాతవార్త: పరీక్షల మూల్యాంకనం, పునర్మూల్యాంకనం (రీవాల్యుయేషన్)పై వెలువడిన వార్తల నేపథ్యంలో గురువారం ఉస్మానియా విశ్వవిద్యాలయం స్పష్టత ఇచ్చింది. విశ్వవిద్యాలయ విద్యా సంబంధిత రక్షణ వ్యవస్థలు అత్యంత పటిష్టంగా, పారదర్శకంగా, డిజిటల్ భద్రతతో ఉన్నాయని రిజిస్ట్రార్ ఆచార్య జి. నరేష్ రెడ్డి తెలిపారు. లా పరీక్షల పునర్మూల్యాంకనంలో అధిక సంఖ్యలో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారనే వార్తలపై పరీక్షల విభాగాన్ని వివరణ కోరినట్లు వెల్లడించారు. మూల్యాంకనం, పునర్మూల్యాంకనంలో తప్పులు జరిగే అవకాశం లేదని పేర్కొన్న ఆయన, ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలితే సంబంధిత మూల్యాంకనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం నేతృత్వంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఇటీవల విడుదలైన న్యాయశాస్త్ర విభాగ పరీక్షా ఫలితాల్లో మొత్తం 5,831 మంది విద్యార్థుల్లో 86 శాతం మంది తమ మార్కులపై సంతృప్తి వ్యక్తం చేయగా, 14 శాతం మంది మాత్రమే రీ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారని పరీక్షల నియంత్రణాధికారి వెల్లడించారు. రీ వాల్యుయేషన్ అనంతరం మొత్తం విద్యార్థుల్లో కేవలం 5.14 శాతం మందికి మాత్రమే మార్కులు లేదా గ్రేడ్‌లలో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఈ మార్పులు ఏ ఒక్క విభాగానికే పరిమితం కాకుండా వివిధ కోర్సుల్లో స్వల్పంగా నమోదయ్యాయని పేర్కొన్నారు. సబ్జెక్టివ్ పేపర్ల మూల్యాంకనంలో స్వల్ప వ్యత్యాసాలు సహజమేనని, దీనిని వ్యవస్థాగత లోపంగా పరిగణించలేమని అధికారులు వివరించారు. మొదటి మూల్యాంకనానికి, పునర్మూల్యాంకనానికి మధ్య 10 శాతానికి మించి వ్యత్యాసం ఉన్నప్పుడే సవరించిన మార్కులను పరిగణనలోకి తీసుకునే కఠిన నిబంధన అమల్లో ఉందని గుర్తు చేశారు. విద్యార్థుల పేరు, రోల్ నంబర్ వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతూ ఆన్‌లైన్ మూల్యాంకన విధానాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బోర్డ్ ఆఫ్ స్టడీస్ నామినేట్ చేసిన స్వతంత్ర నిపుణుల ద్వారానే పునర్మూల్యాంకనం నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యా ప్రమాణాలను ఉల్లంఘించినా, మూల్యాంకనంలో నిర్లక్ష్యం చేసినట్లు తేలినా సంబంధిత ఎగ్జామినర్లను శాశ్వతంగా తొలగించడంతో పాటు కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని విశ్వవిద్యాలయ పరిపాలన విభాగం అధికారులు హెచ్చరించారు.

# ప్రజలకు గౌరవప్రదమైన సేవలే లక్ష్యం

### తహసీల్దార్, ఆర్డీవో, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 11: రాష్ట్రంలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన పరిపాలన అందించాలనే లక్ష్యంతో ఆర్డీవో, తహసీల్దార్ మరియు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ భవనాలను హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గురువారం సచివాలయంలో తన కార్యాలయంలో రెవెన్యూ, హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రిగారు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ ఐ.జి. రాజీవ్ గాంధీ హనుమంతు, హౌసింగ్ సెక్రటరీ వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఎన్ని తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి, శిథిలావస్థ, పాలనకు అనువుగా లేని భవనాలు వివరాలను సేకరించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడం సరైంది కాదు. ప్రజలకు సేవలందించే కేంద్రాలు గౌరవప్రదంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి స్పష్టం చేశారు. మొదటి దశలో అద్దె భవనాల్లో, శిథిలావస్థలో ఉన్న 125 తహసీల్దార్ కార్యాలయాలు, 11 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టడానికి నివేదికలు అందించాలని రెవెన్యూ సెక్రటరీని ఆదేశించారు. ఇందుకు అవసరమైన స్థలాలను తక్షణమే గుర్తించి నిర్మాణ పనులు వీలైనంత త్వరితగతిన ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి డిజైన్లకు తుది రూపు ఇవ్వనున్నామని చెప్పారు. తద్వారా ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు, ఏర్పడిన తర్వాత కూడా రెవెన్యూ కార్యాలయాలు ప్రజలకు సౌకర్యవంతంగా లేకపోవడంతోపాటు చాలా వరకు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వం ముందుచూపు లేకుండా, ప్రణాళికాబద్ధత లేకుండా మండలాల పునర్విభజన చేపట్టిందని, కొన్ని మండలాలు రెండు మూడు జిల్లాల పరిధిలోకి వచ్చే విధంగా రూపొందించిందని మంత్రి విమర్శించారు. అనేక కార్యాలయాల్లో కనీస వసతులు లేకపోవడం, సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త మండలాలకు అవసరమైన పోస్టులు మంజూరు చేసి పరిపాలనను బలోపేతం చేశామని తెలిపారు. స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖలో అత్యాధునిక వసతులతో ఇప్పటికే సమీకృత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి సమీకృత భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే గచ్చిబౌలి, మేడ్చల్-మల్కాజిగిరి, పఠాన్ చెరువు, కోహెడలో భవనాలకు శంకుస్థాపన చేసుకొని పనులు కూడా ప్రారంభించుకున్నామని తెలిపారు. జిల్లా నియోజక వర్గ కేంద్రాలలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సంబంధించి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ సంఖ్యకు అనుగుణంగా భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. రెండు డివిజ, నాలుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్, 52 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 4 వేల చదరపు అడుగుల నుంచి 10 వేల చదరపు అడుగులు ఉండేలా ఒకే నమూనాలో నిర్మించబోతున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కోసం అవసరమైన స్థలాలను గుర్తించే కార్యక్రమం ముమ్మరంగా సాగుతుందని త్వరలోనే క్యూర్ పరిధిలోని జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించబోతున్నామని వెల్లడించారు.



## మామిడి పళ్లు తిని ఇద్దరు బాలికల మృతిపై సమగ్ర విచారణ: సిపి సజ్జనార్

హైదరాబాద్ జూన్ 11, ప్రభాతవార్త: నగరంలోని నారాయణగూడలో మైనర్ బాలికలైన ఇద్దరు అక్కా చెల్లెళ్లు మామిడి పళ్లు తిని వున్నట్టుండి అస్వస్థతకులోనై మరణించిన ఉదంతంపై సిటీ కొత్వాల్ సజ్జనార్ గురువారం మీడియాతో మాట్లాడారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, విచారణ సాగుతోందని తెలిపారు. మరణించిన అక్కా చెల్లెళ్ల మృతదేహాలలో అంతర్గత అవయవాల (విసెరా) నమూనాలను భద్రపరిచి, ఫోరెన్సిక్ పరీక్షలకు పంపాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఈ కేసును లోతుగా విచారించి, వీరి మరణానికి గల కారణాలను కను గొంటామని ఆయన వెల్లడించారు. నారాయణగూడలో మూడు రోజుల క్రితం మామిడి పళ్లు తిని మొత్తం కుటుంబం వాంతులు చేసుకుని అస్వ స్థతకు గురవడం సంచలనం రేపింది. అయితే రెండు రోజుల వ్యవధిలో మొదట 17 ఏళ్ల బాలిక మరుసటి రోజు పదేళ్ల బాలిక మరణించడం కుటుంబంలో విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో మరొకరు ఇంకా ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నారు.

## రాజకీయ కుట్రతోనే మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ: పిసిసి చీఫ్ మహేష్

హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త: మధ్యప్రదేశ్ కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరించడం వెనుక రాజకీయ కుట్ర దాగున్నదని తెలంగాణ పిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ ఆరోపించారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఏఐసిసి సమావేశానికి మహేష్‌కుమార్ గౌడ్ హాజరయ్యారు. రెండున్నర గంటల పాటు సాగిన సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సమావేశంలో దేశంలో తాజా రాజకీయాలపై చర్చించాం. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర ధరలు పెరగడంతో సామాన్య ప్రజలు పడుతున్న ఇబ్బందులను సమీక్షించాం. విద్య పరీక్షలు, యూనివర్సిటీ వీసీల నియామకం వంటి అంశాలను చర్చించాం. వీసీలను ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్న వారు చాలా మంది ఉన్నారని ఆరోపించారు. మీనాక్షి నటరాజన్ పై పెద్దలకు విచారణ ఇద్దాం. మీనాక్షి నటరాజన్ని తెలంగాణలో కేసు లేదు. నోటీస్ మాత్రమే వచ్చింది.. నోటీస్ విషయాలు మెన్షన్ చేయాలని నామినేషన్ పత్రాల్లో ఎక్కడా లేదు. ఫిర్యాదు చేసిన వ్యక్తి ఒక రోజు ముందు నోటీస్ కాపీని సోషల్ మీడియాలో షేర్ చేశారు. మా పార్టీ నుండి ఎవరు చెప్పలేదు. రాజకీయ కక్షతో నామినేషన్ను తిరస్కరించారు.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on: X @SCRailwayIndia
www.scr.indianrailways.gov.in

టెండరు ప్రకటన నం. 78 TO 80 DRM_W_HYB_26, తేదీ: 10.06.2026

భారత రాష్ట్రపతి తరఫున డివిజనల్ రైల్వే మేనేజర్/వర్క్స్, హైదరాబాద్ డివిజన్ దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు 06/07/2026 యొక్క 15.00గం. వరకు క్రింది పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా బహిరంగ టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

టెండర్ నం. 78_DRM_W_HYB_26 పనిపేరు: ... RSC/SC ... అంచనా విలువ (రూ.): 99,52,561, బయానా రూ: 1,99,100.

టెండర్ నం. 79_DRM_W_HYB_26 పనిపేరు: SC-MUE సెక్షన్ ... 11.40 కి.మీ -TRR (P) ... SC-MUE సెక్షన్ : 30 ... అంచనా విలువ (రూ.): 2,43,72,193, బయానా రూ: 4,87,500.

టెండర్ నం. 80_DRM_W_HYB_26 పనిపేరు: ... TWS+WCMSC-45 ... TWSE ... 67 సెట్లు. అంచనా విలువ (రూ.): 59,44,395, బయానా రూ: 1,18,900.

తదుపరి వివరాలకు వెబ్‌సైట్ www.ireps.gov.in ను చూడండి.

డివిజనల్ రైల్వే మేనేజర్/వర్క్స్/హైదరాబాద్.

టెండరు ప్రకటన

టెండర్ నం. 79_DRM-OEW-26-27-కొరకు Sr.DEE-M-HYB, 13-SDF-26-27- Sr.DEE-M-HYB, 14-TRAF-26-27- Sr.DEE-M-HYB, 15-SW-26-27-Sr.DEE-M-HYB.

భారత రాష్ట్రపతి తరఫున Sr.DEE/M/HYB వారు క్రింది టెండర్లను ఇ-టెండర్లు కోరుచున్నారు. ముగింపు తేదీ: 07.07.2026, 15.00గం.

క్ర.సం.1. ... టెండర్ నం. 7B-OEW-26-27 Sr.DEE-M-HYB ... బయానా రూ: 1,90,600/-. పూర్తి కాలం: 12 నెలలు. ముగింపు యొక్క తేదీ: 07.07.2026.

క్ర.సం.2. ... టెండర్ నం. 13-SDF-26-27 Sr.DEE-M-HYB ... RSC/SC ... 32x25m ... PEB ... అంచనా విలువ (రూ.): 85,96,814/-, పూర్తి కాలం: 12 నెలలు. బయానా రూ: 1,71,900/-. ముగింపు యొక్క తేదీ: 07.07.2026.

క్ర.సం.3. ... టెండర్ నం. 14-TRAF-26-27 Sr.DEE-M-HYB ... అంచనా విలువ (రూ.): 1,30,33,929/-, బయానా రూ: 2,60,700/-. పూర్తి కాలం: 12 నెలలు. ముగింపు యొక్క తేదీ: 07.07.2026.

క్ర.సం.4. ... టెండర్ నం. 15-SW-26-27 Sr.DEE-M-HYB ... అంచనా విలువ (రూ.): 4,50,03,361/-, బయానా రూ: 9,00,100/-. పూర్తి కాలం: 12 నెలలు. ముగింపు యొక్క తేదీ: 07.07.2026.

వెబ్‌సైట్ ప్రకటన వివరములు www.ireps.gov.in

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, హైదరాబాద్

టెండరు ప్రకటన

భారత రాష్ట్రపతి తరఫున, SR డివిజన్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, హైదరాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు క్రింది పనులకు 03.07.2026 తేదీ యొక్క 11.30గం. వరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా బహిరంగ టెండర్లను కోరుచున్నారు.

టెండర్ తేదీ: 09.06.2026

క్ర.సం.1. టెండర్ నం.: Y-SG-36-2026-27-07. పనిపేరు: 17 గుడ్స్ షెడ్స్ వద్ద CCTV ... అంచనా విలువ (రూ.): 31139118.49, బయానా రూ: 622800.

... https://www.ireps.gov.in ...

సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్/హైదరాబాద్.

A432

తదుపరి టెండరు నిబంధనలు/నివరణలు మరియు టెండరు డాక్యుమెంట్లు డౌన్‌లోడింగ్, దయచేసి వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in చూడవచ్చును.

pnb Housing

B.O: హైదరాబాద్ ...

తేదీ: 12.06.2026

వార్త

ఇరవైయేళ్ల వయసుంటేనే యువకుడి కింద లెక్కకాదు. ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగినా స్పందించే వారే యువకులు.

-థామస్ ఫుల్లర్

# పౌష్టికాహారలోపంలో భారతావని!

ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా, మరెన్ని లక్షల కోట్ల రూపాయలు వెచ్చించినా, వెచ్చిస్తున్నా పౌష్టికాహార లోపం నుండి దేశ ప్రజలను గట్టెక్కించలేకపోతున్నారు. స్వాతంత్య్రం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా నేటికీ పౌష్టికాహార లోపంతో రకరకాల సమస్యలతో సతమతమవుతున్నవారు భారత్‌లో కోట్ల సంఖ్యలో ఉన్నారు. ప్రపంచ జనాభాలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న బాలల్లో ఇరవైఐదు శాతం పైగా భారతావనిలోనే ఉన్నారని ఐక్యరాజ్యసమితి నివేదికలు ఎంతో కాలంగా చెప్తూనే ఉన్నాయి. ఐదుసంవత్సరాల్లోపు పిల్లల్లో నలభైశాతం మంది తక్కువబరువుతో పుడుతు న్నారని, వారిలో దాదాపు ఏడెనిమిది శాతం మంది పుట్టిన ఐదేళ్ల లోపే మరణిస్తున్నారని ఎన్నోనివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ భూమ్మీద పుట్టిన వారు ఎవరికైనా జీవించే హక్కు రాజ్యాంగం కల్పించింది. అలాంటిది కన్నులైన సరిగ్గా తెరవని పసిగుడ్డులకు సరైన ఆహారం అందకపోతే అందుకు బాధ్యత వహించాల్సింది పాలక పెద్దలే. తల్లీబిడ్డకు పౌష్టికాహారం అందివ్వలేకపోవడం కూడా పాలకుల బాధ్యతారాహిత్యం కిందికే వస్తుంది. అందుకోసం దేశవ్యాప్తంగా ఇప్పుడు కొత్తగాపథకాలు ప్రవేశపెట్టకపోతే పోయారు. ఉన్నపథకాలు ఏమేరకు అమలుచేస్తున్నారు? అర్హులైనవారిలో ఎంత మందికి అందిస్తున్నారు? అధ్యయనాలు, సమీక్షలు, సమావేశాలు నిర్వహించడమే కాదు. పర్యవేక్షణ కూడా అవసరం. ఆ పర్యవేక్షణ లోపం కారణంగానే తల్లీబిడ్డకు అందించాల్సిన పౌష్టికాహారం పక్కదారిపడుతున్న విషయం ఎన్నోసార్లు వెలుగుచూసినా పటిష్టమైన చర్యలు లేకపోవడంతో నిరాటంకంగా కొనసాగుతున్నది. దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా కూడా పౌష్టికాహార లోపం పెచ్చరిల్లి పోతున్నదనే చెప్పొచ్చు. ఇటీవల ప్రపంచ ఆహారనివేదిక వెల్లడించిన సమాచారం ప్రకారం పౌష్టికాహారంతో బాధపడేవారి సంఖ్యప్రపంచంలో ఎనభైకోట్లకుపైగా ఉంటుందని అంచనా వేశారు. దేశంలో పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు. దేశ వ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగులు నిరంతరం కృషి చేస్తున్నారు. రకరకాల నూతన పథకాలను ప్రవేశపెడు తున్నారు. 1975లోనే ఆరేళ్లలోపు పిల్లల్లో తల్లులకు పౌష్టికాహారం అందించేందుకు ఆనాటి కేంద్ర ప్రభుత్వం సమీకృత శిశుఅభివృద్ధి పథకాన్ని (ఐసిడీఎ) ప్రవేశపెట్టింది. ఈపథకం ప్రవేశపెట్టినప్పుడు దేశవ్యాప్తంగా ఎంతోమంది నిరుపేదలకుచేయూతనిచ్చింది. కానీ రానురాను అవకతవకలు, అవినీతి కారణంగా ఈపథకం పక్కదారి పట్టిందనే చెప్పొచ్చు. అర్హులైన వారికి ఎందరికో ఇది అందకుండాపోయింది. ఎన్నో ఆరోపణలు వచ్చాయి. విచారణలు జరిగాయి. కొన్ని సంఘటనలపై చర్యలు కూడా తీసుకున్నారు. పటిష్టమైన పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడంవల్లనే ఈ పథకం ఆశించిన మేరకుఫలితాలు ఇవ్వలేకపోతున్నదనే ఆరోపణలను కొట్టివేయలేం. ఇవేకాదు ఇంకెన్నో పథకాలు ప్రవేశపెట్టారు. ప్రధానమంత్రి మాతృవందన యోజన, పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం, తదితర ఎన్నో కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈపథకాలను ఇంటర్మీడియేట్ కాలేజీల్లోకూడా ప్రవేశపెట్టాలని ఇటీవలనే తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. దేశంలో కొన్నిప్రాంతాల్లో పౌష్టికాహార లోపాన్ని అధిగ మించేందుకు పిల్లలకు కోడిగుడ్లు కూడా అందిస్తున్నారు. అయినా భారత్‌లో పౌష్టికాహార లోపం ఎందరినో పట్టిపీడిస్తున్నది. ప్రపంచ ఆకలి సూచీలో మూడేళ్ల క్రితం వెల్లడించిన వివరాల ప్రకారం నూటఇరవైఒక్క దేశాల్లో భారత్ నూట ఏడో స్థానంలో ఉంది. ఈపౌష్టికాహార లోపంకారణంగా ఆరోగ్యపరంగా ముఖ్యంగా మహిళలలో, చిన్నారుల్లో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఐదేళ్లలోపు పిల్లల్లో దాదాపు ముప్పైశాతానికి పైగా వయసుకు తగిన ఎత్తు పెరగడం లేదు. మరో పంతొమ్మిది శాతం ఎత్తుకుతగిన బరువు ఉండడం లేదు. ముప్పైరెండు శాతం పిల్లలు ఎదుగుదల లోపాన్ని ఎదుర్కొంటున్నారు. జార్ఖండ్, మహారాష్ట్ర, అసోం, గుజరాత్, తదితర రాష్ట్రాల్లో ఈపౌష్టికాహార సమస్యఅధికంగా ఉంది. ఇంకోవైపు పదిహేనేళ్ల బాలికల నుండి యాభైఏళ్లలోపు ఉన్న మహిళలలో దాదాపు యాభైఏడుశాతం రక్తహీనతతో బాధపడుతున్నారు. ఎనభైశాతానికి పైగాసూక్ష్మపోషకాల కొరతను ఎదుర్కొంటున్నట్లు అంతర్జాతీయ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రజాపంపిణీ వ్యవస్థద్వారాపోషకాలు కలిగిన బియ్యాన్ని అందించే కార్యక్రమం కొనసాగిస్తూనే ఉన్నారు. 2030 నాటికి పిల్లల్లో తీవ్రమైన పౌష్టికాహార లోపాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక పథకాల ద్వారా ఒడిశా ప్రభుత్వం కృషి చేస్తున్నది. మరికొన్ని రాష్ట్రాల్లో కూడా పలురకాల పథకాలు ప్రవేశపెడుతున్నారు. పథకాలు, ఉద్దేశ్యాలు సక్రమంగా ఉన్నా సంతృప్తి కలిగించే విధంగాకన్పిస్తున్నా ఆచరణకు వచ్చేసరికి చాలా వరకు కాగితాలకే పరిమితమవుతున్నాయి. వాస్తవంగా చూసినా భారత్‌లో గత దశాబ్దకాలంగా ఆహారధాన్యాల ఉత్పత్తులకు కొరత లేదు. రికార్డు స్థాయిలో దిగుబడులు వస్తున్నాయి. నిల్వలు చేసుకోవడానికి అవసరమైన గోదాములు లేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇలా ఆహారోత్పత్తులు భారీగా పెరుగుతున్నా అందరికి రెండుపూటలా ఆకలి తీర్చుకునేందుకు తిండిగింజలు అందించలేకపోతున్నారు. మరొకపక్క పాఠశాలల్లో పారిశుధ్య సౌకర్యంలేకపోవడం వల్ల అంటువ్యాధులకు కేంద్రాలుగా మారుతున్నాయి. ఇవన్నీ పాలకులకు తెలియనివికావు. ఇలాంటి పరిస్థితుల్లో కొత్తపథకాల గురించి ఆలోచించకపోయినా ప్రస్తుతం ఉన్న పథకాల్లో లోపాలను సవరించి పర్యవేక్షణ పెంచితే కొంతమేరకైనా లక్ష్యాన్ని చేరుకోగలుగుతాం.

అంతరాయాలు కలుగుతున్న కొద్దీ సంకల్పాన్ని దృఢతరం చేసుకుంటూ పోవాలి.



శ్రీ రమణ మహర్షి

అందరిలోనూ శక్తిసామర్థ్యాలు ఎంతో కొంత ఉంటాయి. వాటిని వినియోగించుకోవడంలోనే అసలు సమస్య ఉంటుంది.



బెంజిమెన్ ఫ్రాంక్లిన్

## ప్రజావాక్కు

### విద్యార్థులకు శాస్త్రీయ విద్యను అందించండి

చాగంటి, నాగపని శర్మలాంటి వారిని దూరం పెట్టండి. విద్యార్థులకువిలువలు పెంచేందుకుఒకటవతరగతి నుండి చాగంటి వారి ప్రవచనాలు బోధించేందుకు ప్రభుత్వం సిలబసు ఇచ్చింది. అయ్యా ..విద్యాశాఖామంత్రి గారు మీరు విదేశాలలో చదువుకొని వచ్చారు, మీలో శాస్త్రీయ ఆలోచనలు మెండుగా ఉంటాయి అనుకున్నాము. మరి మీరేమో విలువల కొరకు చాగంటి వారిని ఆశ్రయిస్తున్నారు. ప్రజాకవి వేమనపద్యాలు సిలబస్‌లోచేర్చండి. విద్యార్థులకు..చాగంటి సూక్తులు కాదు. సూర్యుడు చంద్రుడు భూమి తమ చుట్టూ తాము అలా అలా తిరిగే క్రమంలో ఒకదాని నీడఒకదాని మీదపడి గ్రహణాలు ఏర్పడతాయి. పాఠశాలలో ఇవి చెప్పే సైన్స్ పంతులు గ్రహణం రోజు కదలకుండా దుప్పటి కప్పుకొని పడుకునే వాళ్ళు కూడా ఉన్నారు. ఆచరణ ముఖ్యం. అలాంటి విద్యను విద్యార్థులకు నేర్పండి. శాస్త్రీయ సమాజం నిర్మించండి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ఫిరాయింపుదారుల సభ్యత్వాన్ని రద్దుచేయాలి

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు తీర్పు అత్యంత పవిత్రమైనది. ప్రజలు ఒకసిద్ధాంతాన్ని నమ్మి తమ ప్రతినిధులను ఎన్నుకుంటారు. అయితే ఇటీవల రాజకీయాల్లో చోటు చేసుకుంటున్న ఫిరాయింపులు ఓటర్ల నమ్మకాన్ని వమ్ము చేస్తున్నాయి. ప్రజాప్రతినిధులు ప్రలోభాలకు గురై పక్షాలు మార్చడం ప్రజాస్వామ్య విలువలకే గొడ్డలి పెట్టు. ప్రస్తుతం ఉన్నఫిరాయింపు నిరోధకచట్టం ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదు. ఈ చట్టంలోని లొసుగులను వాడుకుని ప్రతినిధులు స్వార్థ ప్రయోజనాల కోసం పక్షాలు మారుతున్నారు. ఒక గుర్తుపై గెలిచి మరో పక్షంలోకి వెళ్లడం ఓటర్లను మోసం చేయడమే. ఫిరాయింపులకు పాల్పడినప్పుడు సభ్యత్వం తక్షణమే రద్దు అయ్యేలా కఠిన నిబంధనలు ఉండాలి.

- కె.నాగరాజు, నల్గొండజిల్లా

### చెత్త సేకరణలో నిర్లక్ష్యం

పట్టణాలలో, గ్రామాలలో నిరంతరం ప్రయాణిస్తూ రోడ్ పైన ఎక్కడబడితే నిరుపయోగమైన ప్లాస్టిక్ కవర్లు, తినుబండారాలు, తడి చెత్త పొడి చెత్త వేస్తుంటాం. దీని వలన దానికి దగ్గరగా ఉన్న కుటుంబాలు అనారోగ్యాల పాలు అవుతూ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నాం. కావున సిబ్బంది ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్‌లలోమాత్రమే చెత్తవేసి ప్రాణాలను కాపాడుదాం.

- ఎం. శంకర్‌రావు, హైదరాబాద్

### ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పెనుముప్పు

మానవ మనుగడలో సాంకేతిక పరిజ్ఞానం భాగమైన వేళ ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణానికి పెను సవాలుగా మారాయి. పాత మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, రిఫ్రిజిరేటర్లు, టెలివిజన్ల వంటి పరికరాలు పనికిరాకుండా పోయినప్పుడు అవి ఇ వ్యర్థాలుగా మారుతాయి. భారతదేశంలో ఈ సమస్య తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. గణాంకాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఇవ్యర్థాల ఉత్పత్తిలో అమెరికా, చైనా తర్వాత భారతదేశం మూడవ స్థానంలో ఉంది. భారతదేశం ఏటా సుమారు 3.2మిలియన్ టన్నుల ఎలక్ట్రానిక్ వ్యర్థాలనుఉత్పత్తి చేస్తోంది. ఇందులో కేవలం పది శాతం మాత్రమే శాస్త్రీయంగా పునర్వినియోగం అవుతోంది. మిగిలిన వ్యర్థాలు అసంఘటిత రంగం చేతుల్లోకి వెళ్లడంవల్ల విషపూరితమైన సీసం, పాదరసం, కాడ్మియం వంటి మూలకాలు నేలలోకి, నీటిలోకి చేరుతున్నాయి. దీనివల్ల శ్వాసకోశ వ్యాధులు, నాడీ వ్యవస్థ దెబ్బతినడం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. కనుక ఎలక్ట్రానిక్ వ్యర్థాలు ఎంత తక్కువగా ఉంటే అంత మంచిది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### బాధితులకు ఉపశమనం

ప్రకృతి విపత్తులు ఊహించుకుని సమయంలోనే కాకుండా ఎప్పుడైనా సంభవించి జనజీవితం అతలాకుతలం అవుతుంది. దీనికితోడు తుఫానుకు, అగ్నిప్రమాదాలకు నివాస గృహాలుపోయి గూడులేక, పనులు స్తంభించి కుటుంబాల రోదనతో బాధ వర్ణనాతీతం. ప్రభుత్వ పరిహారం అందేలోపున రిజర్వ్ బ్యాంక్ ప్రభావిత ప్రాంతాల అభ్యర్థులకు వారు అడగకముందే రుణ ఉపశమన చర్యలు అమలు చేయొచ్చునని మార్గదర్శకాలు వెలువడినవి. ఈ నిర్ణయం బాధలతో ఉన్న వారిని దయతో, బ్యాంకులు ఆదుకోవడం మానవత్వం తో తీసుకున్న ఉత్తర్వు. దీనితోపాటు బ్యాంకుల సేవలను తాత్కాలిక ప్రాంగణం నుండిచేస్తారు. ఇంటిని పునర్నిర్మాణం చేయుటకు బాధితులకు ఎంతో ఉపశమనం కల్గించే విషయం.

- బి మేఘనాదం, విశాఖపట్నం

### సర్ పై అప్రమత్తంగా ఉందాం..

ఎలక్షన్ కమిషన్ ప్రవేశపెడుతున్న ఓటర్ సవరణ చట్టం పై నిరంతరం అవగాహన కలిగి ఉండి మనం అప్రమత్తంగా అర్హులుగా ఉన్న కూడా మన ఓటును తొలగించే అవకాశాలు లేకపోలేదు. అప్రమత్తంగా ఉంటేనే ప్రజాస్వామ్యాన్ని కాపాడిన వ్యక్తులవుతాము. మన ఓటు హక్కును మనమే కాపాడుకోవాలి. తప్పులు చూపించి తప్పించుకునే అవకాశాలు ఉన్నాయి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# నకిలీ విత్తనాల కాటుకు రైతాంగం బలి!

*జాతీయ నేర గణాంకాల బ్యూరో ప్రకారం దేశంలో ప్రతి సంవత్సరం వేలాదిమంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 2022లో దేశవ్యాప్తంగా 11 వేలకుపైగా రైతులు, వ్యవసాయ రంగానికి చెందిన వ్యక్తులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు నమోదైంది. నకిలీ విత్తనాలకు రాష్ట్రాల సరిహద్దులు లేవు. ఒక రాష్ట్రంలో తయారై, మరోరాష్ట్రంలో ప్యాక్ అయి, ఇంకో రాష్ట్రంలో రైతు చేతికి చేరుతున్నాయి. అందుకే ఇది ఒక రాష్ట్ర సమస్య కాదు, జాతీయ వ్యవసాయ భద్రతకు సంబంధించిన సమస్య. తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు తరచూ ఈకేసుల్లో ప్రస్తావనకు వస్తున్నప్పటికీ, దేశవ్యాప్తంగా నకిలీ విత్తనాల మాఫియా వేర్లు విస్తరించాయని దర్యాప్తులు సూచిస్తున్నాయి. నకిలీ విత్తనం పొలంలో పడితే పంట నష్టం, మార్కెట్‌లో అమ్మితే రైతుకు నష్టం, దాన్ని అరికట్టకపోతే దేశానికే నష్టం. అందుకే నకిలీ విత్తనాలపై యుద్ధం ప్రతి ఒక్కరి బాధ్యత.*

డాక్టర్ మోటె చిరంజీవి

వ్యవసాయ రంగంలో విత్తనం అత్యంత కీలకమైన ఉత్పాదక సాధనం. రైతు వేసే పంట భవిష్యత్తు, దిగుబడి, ఆదాయం అన్నీ విత్తనం నాణ్యతపై ఆధారపడి ఉంటాయి. ముఖ్యంగా వానాకాలం ప్రారంభమయ్యే సమయంలో రైతులు విత్తనాల కొనుగోలుకు పెద్ద ఎత్తున సిద్ధమవుతారు. ఈ అవకాశాన్ని కొందరు అక్రమ వ్యాపారులు నకిలీ విత్తనాలను మార్కెట్‌లోకి విడుదల చేయడానికి వినియోగిస్తుంటారు. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోవడమే కాకుండా అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. నకిలీ విత్తనాల వల్ల మొలక శాతం తగ్గిపోవడం, మొక్కల ఎదుగుదల సరిగా లేకపోవడం, తెగుళ్లు అధికంగా సోకడం, ఆశించిన దిగుబడి రాకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. రైతు ఒకసారి నష్టపోతే ఆ ప్రభావం మొత్తం వ్యవసాయ చక్రంపై పడుతుంది. అందుకే నకిలీ విత్తనాల నివారణకు రైతులు, అధికారులు, విత్తన విక్రేతలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. రైతులు విత్తనాలను కొనుగోలు చేసే ముందు ప్రభుత్వం గుర్తింపు పొందిన డీలర్లు లేదా లైసెన్స్ కలిగిన విక్రయ కేంద్రాల నుంచే కొనుగోలు చేయాలి. విత్తన ప్యాకెట్‌పై కంపెనీ పేరు, బ్యాచ్ నంబర్, గడువు తేదీ, మొలకశాతం, ధృవీకరణ గుర్తులు ఉన్నాయో లేదోపరిశీలించాలి. ముఖ్యంగా కొనుగోలు చేసిన ప్రతి విత్తనానికి బిల్లు తీసుకోవడం తప్పనిసరి. భవిష్యత్తులో ఏదైనా సమస్య తలెత్తితే ఆ బిల్లు రైతుకు చట్టపరమైన ఆధారంగా ఉపయోగపడుతుంది. అదే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. రైతులకు నాణ్యమైన విత్తనాల గుర్తింపు, నకిలీ విత్తనాల వల్ల కలిగే నష్టాలపై శిక్షణ ఇవ్వాలి. మార్కెట్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. చట్టాలను మరింత కఠినంగా అమలు చేయడం ద్వారా మాత్రమే ఈ అక్రమ వ్యాపారాన్నిఅరికట్టగలం. నేటి పరిస్థితుల్లో రైతు కేవలం పంట సాగు చేయడమే కాకుండా వినియోగదారుడిగా కూడా అప్రమత్తంగా ఉండాలి. తక్కువ ధరకు వస్తోందని నాణ్యతను విస్మరించడం ప్రమాదకరం. నాణ్యమైన విత్తనం కొనుగోలు చేయడం రైతు హక్కు మాత్రమే కాదు, అతని భవిష్యత్తుకు భరోసా కూడా. భారతదేశ వ్యవసాయ రంగం నేడు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, వాటిలో అత్యంత ప్రమాదకరమైనది నకిలీ విత్తనాల వ్యాపారం. రైతు పొలంలో విత్తనం నాటే క్షణం నుంచే అతని భవిష్యత్తు నిర్ణయమవుతుంది. అలాంటి విత్తనమే నకిలీగా మారితే రైతు కష్టం, పెట్టుబడి, ఆశలు అన్నీ ఒక్కసారిగా కూలిపోతాయి. ఇది కేవలం పంట నష్టానికి మాత్రమే పరిమితం కాకుండా, అప్పుల భారానికి, మానసిక వేదనకు, చివరకు రైతు ఆత్మహత్యలకు కూడా దారి తీస్తున్న సామాజిక సమస్యగా మారింది. దేశంలో ప్రతి ఏటా లక్షలాది మంది రైతులు విత్తనాలపై భారీ మొత్తంలో పెట్టుబడులు పెడుతున్నారు. అయితే నాణ్యతలేని లేదా నకిలీ విత్తనాల కారణంగా పంటలు విఫలమైన సంఘటనలు అనేక రాష్ట్రాల్లో నమోదవుతున్నాయి. ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, కూరగాయల పంటల్లో ఈసమస్య తీవ్రంగా కనిపిస్తోంది. విత్తనాలు మొలకెత్తకపోవడం, మొక్కల ఎదుగుదల సరిగా లేకపోవడం, దిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోవడంవల్ల రైతులు తీవ్రనష్టాలను చవిచూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన వివరాల ప్రకారం,



గత కొన్నేళ్లలో పలు రాష్ట్రాల్లో భారీ మొత్తంలో నకిలీ విత్తనాలు స్వాధీనం అయ్యాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో నకిలీ విత్తనాల తయారీ, విక్రయాలపై కేసులు నమోదయ్యాయి. అయినప్పటికీ ఈ అక్రమ వ్యాపారం పూర్తిగా అరికట్టబడలేదన్నది వాస్తవం. అత్యంత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, నకిలీ విత్తనాల వల్ల కలిగే పంట నష్టాలు రైతులను తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్నాయి. రైతు ఒక పంట కోసం అప్పులు చేసి పెట్టుబడి పెడతాడు. పంట విఫలమైతే అప్పు తీర్చలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ పరిస్థితుల్లో అనేక మంది రైతులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. దేశవ్యాప్తంగా నమోదవుతున్న రైతు ఆత్మహత్యల్లో నకిలీ విత్తనాలు ఒక పరోక్ష కారణంగా అనేక రైతు సంఘాలు, వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు. అయితే ప్రభుత్వ గణాంకాల్లో 'నకిలీ విత్తనాల వల్లే ఆత్మహత్య' అని ప్రత్యేకంగా నమోదు చేసే విధానం లేకపోవడం వల్ల అసలు సమస్య తీవ్రత పూర్తిగా బయటకు రావడం లేదు. జాతీయ నేర గణాంకాల బ్యూరో నివేదికలు ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు చూపిస్తున్నాయి. ఈ మరణాల వెనుక అప్పులు, పంట వైఫల్యాలు, మార్కెట్ సమస్యలు, ప్రకృతి వైపరీత్యాలు వంటి అనేక కారణాలు ఉంటాయి. అయితే పంట వైఫల్యానికి నకిలీ విత్తనాలు కూడా ఒక ముఖ్య కారణంగా నిలుస్తున్నాయనే విషయాన్ని విస్మరించలేం. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం రైతులను అప్రమత్తం చేయడం సరిపోదు. నకిలీ విత్తనాల తయారీ, నిల్వ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. విత్తనాల విక్రయ కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. నేరస్తులపై కఠిన శిక్షలు అమలు చేయాలి. అదే సమయంలో నష్టపోయిన రైతులకు త్వరితగతిన పరిహారం అందించే వ్యవస్థను బలోపేతం చేయాలి. రైతు దేశానికి అన్నదాత. అతని చేతిలోని విత్తనం నాణ్యంగా ఉంటేనే దేశ ఆహార భద్రత సురక్షితంగా ఉంటుంది. నకిలీ విత్తనాల వ్యాపారం రైతు జీవితాలతో చేసే చెలగాటం మాత్రమే కాదు, దేశ వ్యవసాయ భవిష్యత్తుపై జరిగే దాడికూడా. ఈమౌన విపత్తును అరికట్టడం ప్రభుత్వాలు, అధికారులు, విత్తనకంపెనీలు, రైతు సంఘాలుసమాజం మొత్తం బాధ్యతగా గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. వ్యవసాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం ఒక పంట విజయంలో 20నుంచి25శాతం వరకు ప్రభావం విత్తన నాణ్యతపై ఆధారపడి ఉంటుంది. కేంద్ర వ్యవసాయశాఖ పార్లమెంట్‌లో వెల్లడించిన సమాచారం ప్రకారం, గత కొన్నేళ్లలో దేశవ్యాప్తంగా వేలాది క్వింటాళ్ల నకిలీ, నాణ్యతలేని విత్తనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో నకిలీ విత్తనాల విక్రయాలపై వందలాది కేసులు నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో 2015-2022 మధ్య కాలంలో 21,724 టన్నుల నకిలీ లేదా నాణ్యతలేని విత్తనాలు స్వాధీనంకాగా, తెలంగాణలో 1.17 లక్షలటన్నులకు పైగా విత్తనాలు పట్టుబడినట్లు కేంద్ర ప్రభుత్వ సమాచారం. ఇది సమస్య తీవ్రతకు నిదర్శనం. జాతీయ నేరగణాంకాల బ్యూరోప్రకారం దేశంలో ప్రతి సంవత్సరం వేలాదిమంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 2022లో దేశవ్యాప్తంగా 11వేలకుపైగా రైతులు, వ్యవసాయ రంగానికి చెందిన వ్యక్తులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు నమోదైంది. నకిలీ విత్తనాలకు రాష్ట్రాల సరిహద్దులు లేవు. ఒక రాష్ట్రంలో తయారై, మరోరాష్ట్రంలో ప్యాక్ అయి, ఇంకో రాష్ట్రంలో రైతుచేతికి చేరుతున్నాయి. అందుకే ఇదిఒక్క రాష్ట్ర సమస్య కాదు, జాతీయ వ్యవసాయ భద్రతకు సంబంధించిన సమస్య. తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు తరచూ ఈకేసుల్లో ప్రస్తావనకు వస్తున్నప్పటికీ, దేశవ్యాప్తంగా నకిలీ విత్తనాల మాఫియా వేర్లు విస్తరించాయని దర్యాప్తులు సూచిస్తున్నాయి. నకిలీ విత్తనం పొలంలో పడితే పంట నష్టం, మార్కెట్‌లో అమ్మితే రైతుకు నష్టం, దాన్ని అరికట్టకపోతే దేశానికే నష్టం. అందుకే నకిలీ విత్తనాలపై యుద్ధం ప్రతి ఒక్కరి బాధ్యత. ●

# బాలల భవిత బంగారు బాట... సమాజ సంక్షేమం


రామకిష్టయ్య సంగనభట్ల

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం, వివిధ దేశాలలో చట్టాలు ఎన్ని చేసినా అవి అమలుకు నోచుకోవడం లేదు. ఐక్యరాజ్య సమితి ప్రత్యేక విభాగమైనఅంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) 2002లో ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవంను ప్రారంభించింది. ప్రపంచంలో అసంఘటిత రంగంలో బాల కార్మికుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఉదాహరణకు ఇళ్లలో పనిచేసే బాలలు. వాస్తవానికి అనేక సందర్భాల్లో బాలకార్మిక వ్యవస్థప్రభుత్వ లెక్కల్లోకి రాదని కూడా జాతీయ బాలల హక్కుల కమిషన్ పేర్కొంటోంది. యునిసెఫ్ ప్రకారం దాదాపు సగం మంది, ప్రణాళికా సంఘం అంచనా ప్రకారం సుమారు 43 శాతం మంది బాలబాలికలు ఎనిమిదో తరగతిలోపే బడి మానివేస్తున్నారు. షెడ్యూల్డ్ కులాల్లో ఇది 55శాతం షెడ్యూల్డ్ తెగల్లో 63శాతం దాకా ఉందని అంచనా. బడి మానేసిన ప్రతి పిల్లవాడూ అనివార్యంగా బాలకార్మికుడిగానే జీవిస్తున్నాడని వివిధ అధ్యయనాలు తెలియ జేస్తున్నాయి. ఫలితంగా బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు పెరుగుతున్నాయి. 2005 నాటికి జాతీయ బాలల కార్యాచరణలో భాగంగా బాల కార్మిక వ్యవస్థ నిషేధంతో పాటు బాల్య వివాహాలను పూర్తిగా నిరోధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ, ఈ లక్ష్య సాధనలో విఫలమయ్యాం. ప్రపంచ బాలలహక్కుల దినోత్సవం జరుపుకుంటున్నా ప్రయోజనం లేకుండాపోయింది. అందమైన బాల్యాన్ని లేకుండా చేయడం అతి పెద్ద మానవ హక్కుల ఉల్లంఘన. బాలకార్మిక వ్యవస్థను రద్దు చేయాలన్నా లేదా బాల్యవివాహాలను పూర్తిగా నిషేధించాలన్నా ముందు జరగాల్సింది సార్వత్రిక ప్రాథమిక విద్యను అందుబాటులోకి తేవడం. అందుకే విద్యను ప్రాథమిక హక్కుగాచేశారు. చట్టంఅమల్లో భాగంగా బడిబయట ఉన్న పిల్లలను, మధ్యలో మానేసిన వారిని తిరిగి బడిలో చేర్పించడం సవాలుగా మారింది. విద్యాహక్కు చట్టం హామీ ఇచ్చినవిధంగా వీరందరికీ వాళ్ల వయసుకు తగినతరగతిలో చేర్పించి విద్యనందించడమూ ఒక సవాలే. మధ్యలో బడి మానేయకుండా చూడటానికి ఎనిమిదో తరగతి వరకూ పిల్లలకు డిటెన్షన్ పద్ధతి ఉండకూడదని, వీరిని సమగ్ర, నిరంతర మూల్యాంకన పద్ధతిద్వారా పరీక్షించాలని విద్యాహక్కు చట్టం చెబుతోంది. నాణ్యమైన విద్యనందించడం ద్వారా ప్రతిఒక్కరూ అవసరమైన స్థాయిలో చదువు నేర్చుకుని, తర్వాతి తరగతిలోకి ప్రవేశించగలిగేలా చేయాల్సిన బాధ్యత పాఠశాలపై ఉంటుందనీ చట్టం పేర్కొంటోంది. బాలలు బాలకార్మికులుగా మారకుండా చేసేందుకు విద్యాహక్కు చట్టంలో అనేక ఇతర నిబంధనలూఉన్నాయి. విద్యా సంవత్సరంలో ఏ సమయంలో వచ్చినా తగిన తరగతిలో చేర్చుకోవాలి. అవసరమైన అదనపు శిక్షణ ఇవ్వాలి. దండన లేనిబోధన అందించాలి. బడిలో ఉండాల్సిన పిల్లలు అందులో చేరకపోవడానికి, మధ్యలో బడి మానేసి బయట ఉండటానికి తల్లిదండ్రుల పేదరికం, సామాజిక వెనక బాటుతనం, పిల్లలకు అనుకూలంగా లేని బోధనాంశాలు, బోధనా ప్రణాళిక తదితర కారణాలున్నాయి. భారత రాజ్యాంగంలోని 24,39,45వ అధికరణలు పిల్లలకు శ్రమ దోపిడీ నుంచే కాకుండా ఇతర రక్షణలనూ కల్పిస్తున్నాయి. వయసుకుతగని ఆర్థిక కార్యకలాపాలు, వృత్తుల్లో పని చేయకుండా భారత రాజ్యాంగం పిల్లలకు రక్షణకల్పిస్తోంది. బాలకార్మిక వ్యవస్థను రూపుమాపడానికి భారత ప్రభుత్వం త్రిముఖవ్యూహాన్ని అమలుచేస్తోంది. బాలకార్మిక చట్టాల అమలు, బాలలసమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రణాళికల రూపకల్పన, అమలు, బాలకార్మికవ్యవస్థ అధికంగా ఉన్న రంగాలపై ప్రత్యేకదృష్టి కేంద్రీకరించి, నిర్మూలనా పథకాలను అమలు చేయడం. ●

# ప్రభుత్వ బడులను బలోపేతం చేయాల్సిందేనా?

దాడిశెట్టి శ్యామ్ కుమార్

విద్య అనేది దేశ నాగరికత జీవన విధానాలపై ప్రభావాన్ని చూపిస్తూ ఉంటుంది. దేశం శాస్త్ర సాంకేతిక అభివృద్ధి పథంలో ముందుకు పురోగమించాలంటే అక్షర జ్ఞానం కూడా ప్రతిఒక్కరికి అందాల్సి ఉంటుంది. ఈక్రమంలో దేశంలో ప్రతి ఒక్కరికి విద్యను అందించే రీతిలో రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ప్రీ ప్రైమరీ మొదలు ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాల విద్యాభివృద్ధికి ఉచిత విద్యాబోధనతో పాటు అనేక సదుపాయాలను కల్పిస్తున్నాయి. ప్రధానంగా ప్రాథమిక స్థాయి నుండి ఉచిత విద్యను అందించాలనే లక్ష్యంతో విద్యాహక్కు చట్టం అమలుకు ప్రభుత్వాలు ప్రాధాన్యతనిస్తూ దేశంలోని బడిఈడు పిల్లలందరికి నిర్బంధవిద్యను అమలు పరుస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో విద్యాహక్కు చట్టం పూర్తిస్థాయిలో అమలు జరగడం లేదనే విమర్శలు కూడా లేకపోలేదు. అయితే విద్యను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి జాబితాలో చేర్చడం జరిగింది. ఈ క్రమంలో అనేక రకాలైనటువంటి విద్యా ప్రయోజనాత్మక విలువలు గణనీయంగా పెరుగుతున్నాయి. ప్రభుత్వాలు సైతం ప్రభుత్వ పాఠశాలలో నాణ్యత కలిగిన విద్య కోసం ఉత్తమమైన విషయ బోధకులను నియమిస్తూ అత్యున్నతమైన నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించేందుకు ప్రయత్నిస్తుంది. ఆధునిక సాంకేతిక విధానాలను కూడా ప్రభుత్వ పాఠశాలలో వినియోగించుకునే రీతిలో ఇంటర్నెట్ సదుపాయం ఇంటరాక్ట్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డులు డిజిటల్ బోధనతో పాటు సహ పాఠ్య కార్యక్రమాల నిర్వహణ కూడా చేపడుతుంది. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల రూపకల్పనకు కావలసిన బడ్జెట్ సరిపోవడంలేదని భిన్న వాదనలు తరచుగా వినిపిస్తున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం పాఠశాల మౌలిక వసతులకు కొంత బడ్జెట్‌ను కేటాయిస్తూ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తూ మౌలిక సదుపాయాల అభివృద్ధిపరిచే దిశగా ప్రయత్నిస్తూనే ఉన్నప్పటికి కారణాలు ఏవైనా క్షేత్రస్థాయిలో ఎందుకో పరిపూర్ణంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు అనుకున్న స్థాయి చేరుకోలేకపోతుందనే సంశయం కలగక మానదు. ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఇంగ్లీష్ మాధ్యమాలలో విద్యాబోధన, సహ పాఠ్య కార్యక్రమాలు ఆధునిక శాస్త్ర సాంకేతిక భావన అభివృద్ధి పరిచే సైన్స్ ప్రయోగశాలల నిర్వహణతో పాటు విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నైపుణ్యాలను పెంపొందించే విధంగా క్రీడలకు కూడా ప్రాధాన్యతనిస్తున్నాయి. అయితే ఇన్ని విధాలుగా ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాల నిర్మాణాత్మక విధానాలకు ప్రత్యేక కార్యచరణ చేపడుతున్నప్పటికీ, ప్రభుత్వ పాఠశాలలో అనుకున్న స్థాయిలో విద్యార్థులు నమోదు కాకపోవడం గమనార్హం. దీనికి ప్రధానంగా స్థానికంగా ప్రభుత్వపాఠశాలలపై పూర్తి అవగాహన లేకపోవడమా లేక ప్రభుత్వ పాఠశాల ఔన్నత్యాన్ని పూర్తిస్థాయిలో స్థానికులు గుర్తించలేకపోతున్నారా అనిపిస్తుంది. ప్రభుత్వాలు నడిపే ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల్లో చాలా వరకు విశాలమైన ఆటస్థలాలు అనుకూలమైన నీటివసతి, శానిటేషన్ వ్యవస్థ



విద్యార్థులకు అడపాదడపా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడం, సరైనవిద్యార్హతలు కలిగిన బోధనా సిబ్బందిని నియమించడంతోపాటు ఉచిత మధ్యాహ్న భోజనం పాఠ్య పుస్తకాలు నోటు పుస్తకాలు, స్కూల్ యూనిఫార్మ్ ఇలాంటిఎన్నో పథకాలు ప్రభుత్వాలు అమలుచేస్తుండడం ఒక ఎత్తు అయితే ప్రభుత్వ పాఠశాలలో అనుకున్న స్థాయిలో విద్యార్థులు తగినంతగా లేకపోవడం మరో ఎత్తుగా ఉంటుంది. నాణ్యత ప్రమాణాలు పుష్కలంగా ఉన్నటువంటి విద్యావ్యవస్థగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో అన్ని వర్గాల వారితో పాటు ఎక్కువగా పేద, బడుగు బలహీన వర్గాలు ఆర్థికంగా వెనుకబడి ఉన్న విభిన్నవర్గాల వారికి ఉపయోగకరంగా ఉంటున్నప్పటికీ, విద్యార్థుల సంఖ్య అనుకున్న స్థాయిలో లేకపోవడం ఆర్థికంగా వెనుకబడిన వారు దారిద్ర్యరేఖకు దిగువ ఉన్నటువంటి కుటుంబాల నుండివస్తున్న విద్యార్థుల సంఖ్యనే ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం గోచరిస్తుంది. గత రెండు దశాబ్దాల నుండి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు తగ్గిపోతుండడం ప్రధానంగా ప్రభుత్వాలే కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాలు మోడల్ స్కూల్స్, సాంఘిక సంక్షేమ గురుకుల వ్యవస్థలను ఏర్పాటు చేయడంతో చాలా వరకు ఆయా విద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తున్నది. తద్వారా స్థానికంగాఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు సంఖ్య తగ్గిపోతుందా అనిపిస్తుంది. ప్రతి విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో కనీస స్థాయిలో నిరంతరం నమోదు శాతం పెరుగుతూ ఉండాలి. అయితే ప్రస్తుతం కొన్ని రాష్ట్రాల్లో ప్రీప్రైమరీ స్కూళ్లను ప్రారంభించడం ద్వారా కొంతవరకు ప్రభుత్వ పాఠశాలలో క్రమంగా విద్యార్థుల సంఖ్య పెరుగుదలకు ఆస్కారం ఉంటుందని అనుకుంటున్నారు. ప్రాథమిక స్థాయి నుండే మౌలిక వసతులు మరింత ఉన్నతీకరించబడి తరగతి గదుల సంఖ్యతోపాటు అవసరమైన విషయ బోధకులు ఉన్నట్లయితే ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల వైపు గణనీయంగా ఆకర్షింపబడతారని అంచనా. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక స్థాయిలో ఐదు తరగతులకు ఎక్కువగా ఒకటి నుండి రెండు తరగతి గదులు ఉండడమే కాకుండా ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉంటున్నారు. ఇలా కాకుండా ప్రాథమిక స్థాయి పటిష్టంగా ఉండాలంటే విషయ బోధకులు సరిపడా ఉండాలనే వాదనలు వినిపిస్తున్నాయి . ప్రాథమిక స్థాయి పటిష్టంగా ఉంటే తద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అవకాశం ఏర్పడుతుందనే భిన్న అభిప్రాయాలు లేకపోలేదు. ఏది ఏమైనప్పటికీ విద్యా లక్ష్యాలకువిద్యార్థుల అభ్యసన సామర్థ్యాలకు ప్రభుత్వ పాఠశాలలు చాలా ప్రాధాన్యతను ఇస్తూనేఉన్నాయి. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సాంకేతికతను కూడా వినియోగించుకుని విద్యా బోధన పద్ధతులతో బాధ్యతగా విషయ బోధకులు నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు ప్రీప్రైమరీ ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత స్థాయి తరగతులలో విద్యార్థులను అధికంగా నమోదు చేయించడానికి స్థానికంగా ఉన్నటువంటి పాఠశాలవిద్యా కమిటీలతో సహా అన్నివర్గాల ప్రజలు సంయుక్తంగాప్రభుత్వ సహకారంతో బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసించేందుకు అవసరమైన అన్ని చర్యలను మరింతగా తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంటుందేమో. ●

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు



## ఇరాన్‌పై అమెరికా దాడులు

## యుఎస్ సైనిక స్థావరాలు లక్ష్యంగా ఇరాన్ ప్రతీకారదాడులు

**వాషింగ్టన్, జూన్ 11:** ఇరాన్‌పై భారీ స్థాయిలో దాడులు చేస్తామని ట్రంప్ చెప్పిన కొద్దిసేపటికే ఆ హెచ్చరికలు వాస్తవ రూపం దాల్చాయి. దీంతో పశ్చిమాసియాలో యుద్ధపు మంటలు తీవ్రమయ్యాయి. ఇరాన్‌లోని పలు లక్ష్యాలపై దాడులు చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఇవి ట్రంప్ ఆదేశాల మేరకు కేవలం ఆత్మరక్షణ కోసమే చేశామని పేర్కొంది. ఇరాన్‌లోని దక్షిణ ప్రాంతంలో భారీగా పేలుళ్లు జరిగాయి. మినాబ్, బందర్ అబ్బాస్, సిరిక్, టెహ్రాన్ ప్రాంతాలపై అమెరికా దృష్టి సారించింది. మరోవైపు కాల్పుల విరమణ కోసం ఇరాన్ ప్రతినిధులు ప్రాధేయపడ్డారని ట్రంప్ వ్యాఖ్యానించారు. దీనిని ఇరాన్ కొట్టిపారేసింది. ఈ విడతలో దాడులు ముగిసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది.

**సంతకం చేయకపోతే దాడులే**

అమెరికా ప్రతిపాదిత ఒప్పందంపై ఇరాన్ సంతకం చేయకపోతే రేపు రాత్రి దాడులు చేస్తామని అధ్యక్షుడు ట్రంప్ చెప్పినట్లు ఆ దేశ జాతీయ మీడియా సంస్థ పేర్కొంది. దీనికి తగినట్లే ఇరాన్‌లోని స్థావరాలను లక్ష్యంగా చేసుకొంది. మొత్తం 49 తోమహాక్ క్షిపణులను ఈ దాడుల్లో వినియోగించినట్లు పేర్కొంది. ఇరాన్‌కు 64 కి.మీ. దూరంలోని కొన్ని లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు తెలిపింది. దీంతోపాటు ఫైటర్ జెట్లు కూడా దాడుల్లో పాల్గొని పర్షియన్ గల్ఫ్ వద్ద ఇరాన్ రాడార్, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను దెబ్బతీసినట్లు వెల్లడించింది.

**హార్ముజ్ మూసివేత.. బహ్రెయిన్, కువైట్‌పై ప్రతిదాడులు**

అమెరికా దాడులకు ఇరాన్ దీటుగా స్పందించింది. హార్ముజ్ జలసంధిని అన్నిరకాల నౌకలకు మూసివేసినట్లు ప్రకటించింది. రెండు చమురు ట్యాంకర్లపై కూడా ఐఆర్‌జిసి దళాలు దాడులు చేశాయి. వాటికి అమెరికా యుద్ధనౌకలు సాయపడుతున్నట్లు ఆరోపించాయి. మరోవైపు కువైట్, బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాలను ఇరాన్ టార్గెట్ చేసింది. బహ్రెయిన్‌లోని షేక్ ఇసా ఎయిర్‌బేస్, కువైట్‌లోని అలీఅల్‌సలీమ్ ఎయిర్‌బేస్‌లపై డ్రోన్లు దాడి చేసినట్లు ఐఆర్‌జిసి పేర్కొంది.



## మరో భారత్ ట్యాంకర్ జల్‌వీర్‌పై అమెరికా క్షిపణి దాడులు

**న్యూఢిల్లీ,జూన్ 11:** ఇరాన్‌అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ భారతీయ సిబ్బందితో ప్రయాణి స్తున్న మరో వాణిజ్య నౌక దాడికి గురైంది. ఒమన్‌లోని షినాస్ పోర్టు సమీపంలో ఈ ఘటన జరిగింది. ఈ విషయాన్ని ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం ధృవీకరించింది. ఘటనపై స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. ప్రాథమిక సమాచారం ప్రకారం గినియాబిస్సావు జెండాతో ప్రయాణిస్తున్న జలవీర్ ట్యాంకర్‌లో భారతీయ సిబ్బంది ఉన్నారు. దానిపై దాడి జరిగినప్పటికీ అందులోని సిబ్బంది క్షేమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. వారం రోజుల్లో భారతీయ సిబ్బందితో ఉన్న నౌకలపై దాడి జరగడం ఇది మూడోసారి. ముందురోజేసెట్టెబెల్లోఅనే ట్యాంకర్‌పై అమెరికా జరిపిన దాడిలో ముగ్గురు భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. పశ్చిమాసియాలో పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారుతున్నాయి. అమెరికా సైనిక హెలికాప్టర్‌ను కూల్చివేయడంతో అమెరికా బలగాలు ప్రతీకార దాడులు చేపట్టాయి. దానికి ప్రతిగా ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో ఎదురుదాడులు చేసింది. దీంతో గల్ఫ్ ప్రాంతంలో భద్రతా పరిస్థితులు మరింత క్లిష్టంగా మారాయి. జోర్డాన్, కువైట్, బహ్రెయిన్‌లో ఉన్న అమెరికా స్థావరాలపై దాడి చేసినట్లు ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రకటించింది. జోర్డాన్ అల్ అజ్రక్ ఎయిర్ బేస్‌పై 12 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్లు ఐఆర్జీసీ తెలిపింది. అక్కడ అమెరికా తన జెట్స్‌ను స్టేషన్ చేసింది. ఎఫ్15, ఎఫ్16, ఎఫ్35 విమానాలు అక్కడ ఉన్నట్లుతెలిసింది.

తమ దాడిలో అమెరి కాకు చెందిన అనేక యుద్ధ విమానాలు ధ్వంసం అయినట్లు ఇరాన్ పేర్కొన్నది. బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో ఆపరేషన్ చేపట్టినట్లు ఇరాన్ తెలిపింది. భారత సిబ్బందితో ఉన్న నౌకలపై దాడులను కేంద్ర విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. అంతర్జాతీయ జలమార్గాల్లో స్వేచ్ఛాయుత రాకపోకలకు భంగం కలగకూడదని స్పష్టం చేసింది. ఉద్రిక్తతలను తగ్గించి, దౌత్య పరమైన పరిష్కారం దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చింది.



## మీనాక్షి నటరాజన్ ఆశలు గల్లంతు

### మధ్యప్రదేశ్‌లో ముగ్గురు బిజెపి అభ్యర్థులు ఎన్నిక: ఇసి ప్రకటన

**భోపాల్,జూన్ 11:** రాజ్యసభ ఎన్నికల్లో బిజెపికి భారీ విజయం దక్కింది. మధ్యప్రదేశ్‌లోని మూడు రాజ్యసభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో మూడింటినీ బిజెపి కైవసం చేసుకుంది. 2026 రాజ్యసభ ఎన్నికల్లో మధ్యప్రదేశ్ నుంచి ముగ్గురు బిజెపి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రజనీష్ అగర్వాల్, తరుణ్‌చుగ్, మహేశ్ కేవత్. ఈ మూడింటిలో ఒక స్థానం నుంచి కాంగ్రెస్ మహిళా నేత మీనాక్షి నటరాజన్ రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. ఆమె నామినేషన్‌ను ఇసి తిరస్కరించిన సంగతి తెలిసిందే. మీనాక్షి నామినేషన్ తిరస్కరణకు గురికావడంతో ఆ స్థానం బిజెపికి దక్కింది. నామినేషన్ల తిరస్కరణ ప్రక్రియ పూర్తి కావడంతో పోటీలో మూడు స్థానాలకు ముగ్గురు బిజెపి అభ్యర్థులు మాత్రమే మిగిలారు. దీంతో వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఇసి ప్రకటించింది. వారికి నియామకపత్రాల్ని కూడా ఇసి అందించింది. నిజానికి ఈ ఎన్నిక ఈ నెల 18న జరగాల్సి ఉంది. కానీ, కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నామినేషన్‌ను ఇసి తిరస్కరించింది. తెలంగాణలో నమోదైన ఒక కేసుకు సంబంధించి ఆమె వివరాలు పేర్కొనలేదని చెబుతూ మీనాక్షి నామినేషన్‌ను తిరస్కరించింది. ఈవిషయంపై బిజెపి తగిన ఆధారాల్ని ఇసికి సమర్పించింది. వాటిని పరిశీలించిన ఇసి మీనాక్షి అఫిడవిట్‌లో తప్పుడు వివరాలు ఉన్నాయని భావించి, ఆమె నామినేషన్ రద్దు చేసింది. ఈ అంశంలో బిజెపి, ఇసి కలిసి కుట్ర పన్నారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. దీనిపై కాంగ్రెస్ పార్టీ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. 12వ తేదీన సుప్రీంకోర్టులో దీనిపై విచారణ జరగనుంది.

## హార్ముజ్‌లో అమెరికా రహస్య ఆపరేషన్



### 100 మిలియన్ బ్యారెళ్ల చమురును తరలించాం

### ట్రూత్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి

**వాషింగ్టన్, జూన్ 11:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక సంచలన విషయాన్ని వెల్లడించారు. ఇరాన్‌తో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, వ్యూహాత్మకంగా హార్మూజ్ జలసంధిలో తమ సైన్యం ఓ రహస్య ఆపరేషన్ నిర్వహించిందని ప్రకటించారు. గత నెలలో జరిగిన ఈ ఆపరేషన్‌లో భాగంగా 100 మిలియన్ బ్యారెళ్లకు పైగా చమురును సురక్షితంగా తరలించామని, ఈ విషయం ఇరాన్‌కు ఇప్పుడే తెలిసిందని ఆయన పేర్కొన్నారు. ఈ చర్యతో అంతర్జాతీయ మార్కెట్లో చమురు సరఫరాకు అంతరాయం కలగకుండా చూశామని తెలిపారు. ఓవల్ ఆఫీసులో మాట్లాడిన ట్రంప్, ఆ తర్వాత తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో మరిన్ని వివరాలు పంచుకున్నారు. గత నెలలో హార్మూజ్ జలసంధి గుండా ఆయిల్ ట్యాంకర్లు, ఇతర వాణిజ్య నౌకలు ప్రయాణించేందుకు సహకరించాలని మన గొప్ప యూఎస్‌సైన్యాన్ని నేను ఆదేశించాను. ఈ ప్రయత్నం ఫలితంగా 100 మిలియన్ బ్యారెళ్లకుపైగా చమురు జలసంధిని దాటి బహిరంగ మార్కెట్‌లోకి చేరిందని ప్రకటించడానికి నేను సంతోషిస్తున్నాను. 200కు పైగా వాణిజ్య నౌకలు సురక్షితంగా ప్రయాణించాయని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ కారణంగానే అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు (ప్రస్తుతం బ్యారెల్‌కు 8590 డాలర్లు) భారీగా పెరగకుండా నిలకడగా ఉన్నాయని ట్రంప్ తెలిపారు. ఇరాన్ ఆంక్షల కారణంగా చమురు సరఫరాకు ఆటంకం కలగకుండా ఈ చర్యలు తీసుకున్నామని, మిషన్‌కు ప్రమాదం కలగకూడదనే ఉద్దేశంతోనే ఈ విషయాన్ని ఇప్పటివరకు గోప్యంగా ఉంచామని ఆయన వివరించారు.

## భారతీరాజా మృతిపట్ల ప్రధాని మోడీ సంతాపం



### స్వగ్రామంలో భారతీరాజాకు అంత్యక్రియలు పూర్తి

**న్యూఢిల్లీ,జూన్ 11:** దక్షిణాది చలనచిత్రరంగ దర్శకుడు భారతీరాజా మరణం పట్ల ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. భారతీయ సినిమా రంగంలో, ముఖ్యంగా తమిళ చిత్ర పరిశ్రమలో ఆయన ఒక దిగ్గజమని, తన అద్భుతమైన సృజనాత్మకతతో తమిళ సినిమా గమనాన్నే మార్చేశారని ప్రధాని కొనియాడారు. సోషల్‌మీడియాలో మోడీ తన సంతాప సందేశాన్ని పంచుకున్నారు. భారతీరాజా గ్రామీణ జీవనాన్ని, పల్లెటూరి వాతావరణాన్ని వెండితెరపై ఆవిష్కరించిన తీరు అద్భుతమని, అది ఎప్పటికీ ప్రశంసనీయంగా నిలిచిపోతుందని మోడీ పేర్కొన్నారు. ఈ కష్టసమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఓం శాంతి అంటూ ప్రధాని నివాళులర్పించారు. మరోవైపు భారతీరాజా అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన తేనిలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు పూర్తి ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. 1977లో వచ్చిన క్లాసిక్ హిట్ 16 వయతినిలే సినిమాతో దర్శకుడిగా ప్రస్థానాన్ని ప్రారంభించిన భారతీరాజా దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సాగిన సినీ ప్రస్థానంలో 40కిపైగా చిత్రాలను తెరకెక్కించారు.

తమిళ చిత్రసీమలో ఆయన అందించిన విశేష సేవలకుగానూ ఇయక్కునర్ ఇమయంఅంటే దర్శక శిఖరం అనే బిరుదును దక్కించుకు న్నారు. తమిళనాడు దిండుగల్ జిల్లా కొడైకెనాల్ సమీపాన వత్తలగుండు ఘాట్‌రోడ్డులోని ఆయన సొంత ఎస్టేట్‌లో భారతీ రాజా అంత్యక్రియలు పూర్తిచేసినట్లు ఆయన కుమార్తె జనని తెలిపారు. తండ్రి మరణవార్త తెలియగానే మలేసియా నుంచి చెన్నైకు చేరుకున్న ఆమె భారతీరాజా కోరిక మేరకే ఆయన అంత్యక్రియలను ఆయన స్వగ్రామంలో నిర్వహించామని తెలిపారు.

## భార్యనే కాడెద్దుగా మార్చిన చిన్నరైతు



### వైరల్ విడియోపై స్పందించిన మహారాష్ట్ర సిఎం

**ముంబయి,జూన్ 11:** మహారాష్ట్రలోని మారుమూలగ్రామంలో ఒక సన్నకారురైతు పిడుగు పాటుకు తన ఎద్దుమృతిచెందడంతో ఒక్క ఎద్దుతోపాటు రెండోపక్క తన భార్యనే పెట్టి పొలం దున్నుతున్న వైనం చూపరులను కలిచివేసింది. ఈ దృశ్యాన్ని సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో రాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవిస్ తక్షణమే స్పందించడంతో ఆమె కుటుంబానికి న్యాయం జరిగింది. మహిళే ఎద్దు స్థానంలో కాడి మోయాల్సి వచ్చింది. ఖరీఫ్ సాగు నిమిత్తం తన భర్తతో కలిసి పొలాన్ని దున్నేందుకు ఆమె సిద్ధపడింది. ఈ హృదయ విదారక దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తక్షణమే స్పందించి ఆ కుటుంబాన్ని ఆదుకున్నారు. లాతూర్ జిల్లాలోని దేవని తాలూకా బొంబాలి గ్రామానికి చెందిన కౌలు రైతు కాశీనాథ్ గైక్వాడ్‌కు రెండు ఎద్దులు ఉండగా, ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పిడుగు పడటంతో వాటిలో ఒకటి మరణించింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో, కొత్త ఎద్దును కొనుగోలు చేసే స్తోమతలేక ఆ దంపతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఈ క్రమంలో కాశీనాథ్ భార్య హౌసాబాయి గైక్వాడ్, మిగిలిన ఒక్క ఎద్దుతో కలిసి తానూ కాడి మోసింది. తమ ఎనిమిది ఎకరాల పొలాన్ని దున్నడానికి ఆమె సిద్ధమైంది. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో నాయకులు స్పందించారు. ఎన్సీపీ (ఎస్పీ) ఎమ్మెల్యే రోహిత్ పవార్, శివసేన (యూబీటీ) ఎమ్మెల్సీ అంబదాస్ దాన్వే ఈ ఘటనపై ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రభుత్వ సాయం కోరారు. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో బుధవారం లాతూర్ కలెక్టర్ భరత్ నేతృత్వంలో అధికారులు ఆ గ్రామాన్ని సందర్శించి, గైక్వాడ్ కుటుంబానికి కొత్త ఎద్దును అందజేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సుమారు రూ.32,000 నష్టపరిహారాన్ని వారి బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ప్రభుత్వ సాయం అందడంతో హౌసాబాయి ఊపిరి పీల్చుకుంది. పొలం ఎలా దున్నాలో అర్థం కాక దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. ఇప్పుడు మా ఆందోళన తొలగిందని ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

## సెట్టెబెల్లో ట్యాంకర్‌పై దాడి ఘటనలో ముగ్గురు భారతీయ సిబ్బంది మృతి

**న్యూఢిల్లీ,జూన్ 11:** ఒమన్ తీరానికి సమీపంలో అమెరికా బలగాలు జరిపిన దాడిలో ముగ్గురు భారత నావికులు మరణించినట్లు కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ వెల్లడించారు. తొలుత వీరు గల్లంతైనట్లు సమాచారం వచ్చినా ఇప్పుడు వారి మరణాన్ని అధికారికంగా ధ్రువీకరించారు. ముగ్గురిలో ఇద్దరి మృతదేహాలు మాత్రమే ఇప్పటివరకు లభ్యమైనట్లు తెలిపారు. పలావు జెండాతో ప్రయాణిస్తున్న సెటెబెల్లో ఆయిల్ ట్యాంకర్‌పై ఈ దాడి జరిగినట్లు సమాచారం. నౌకలో మొత్తం 28 మంది సిబ్బంది ఉండగా వారిలో 24 మంది భారతీయులు ఉన్నారు. మిగిలిన వారిలో ఇద్దరు పాకిస్థాన్‌కు చెందిన వారు, ఓ ఉక్రెయిన్ పౌరుడు, ఓ రష్యా పౌరుడు ఉన్నారు. దాడి తర్వాత 21 మంది భారత నావికులను సురక్షితంగా రక్షించారు. అయితే డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ, ఇంజిన్ ఫిట్టర్ శివానంద్ చౌరాసియా, చీఫ్ ఇంజినీర్ పట్నాల సురేశ్ కనిపించకుండా పోయారు. తాజాగా వీరు మరణించినట్లు నిర్ధారణ అయింది. రక్షించిన సిబ్బందిని వెంటనే స్వదేశానికి తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మృతదేహాలను కూడా త్వరగా భారత్‌కు తరలించే చర్యలు చేపట్టాలని సూచించారు. ఇరాన్ చమురు రవాణాపై అమల్లో ఉన్న ఆంక్షలను ఉల్లంఘించిందనే ఆరోపణలతో అమెరికా సెంట్రల్‌కమాండ్ ఈ నౌకపై దాడి చేసినట్లు తెలుస్తోంది. హార్మూజ్ జలసంధి మీదుగా ప్రయాణించే సమయంలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. ఈఘటనను భారత్ తీవ్రంగా ఖండించింది. భారతీయులు ప్రయాణిస్తున్న నౌకపై దాడి జరగడం ఆందోళన కలిగించే విషయమని తెలిపింది. ఉద్రిక్త పరిస్థితులు మరింత పెరగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చింది. ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయ ప్రతినిధిని పిలిపించి నిరసన వ్యక్తం చేసింది.

## మాట వినకుంటే బాంబులతో జవాబిస్తాం

### అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్

**వాషింగ్టన్,జూన్ 11:** అణు కార్యక్రమంపై అమెరికా ప్రతిపాదించిన ఒప్పందాన్ని ఇరాన్ అంగీకరించకపోతే దాడులు కొనసాగుతాయని ఆ దేశ రక్షణ మంత్రి హెగ్సెత్ హెచ్చరించారు. అవసరమైతే బాంబులతోనే చర్చలు జరుపుతాం అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆ విషయంలో తమ కంటే మెరుగైన వారు ఎవరూ లేరని వ్యాఖ్యానించారు. ఇరాన్‌కు ఇంకా ఒప్పందం చేసుకునే అవకాశం ఉందని హెగ్సెత్ తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన అణు ఒప్పందాన్ని అంగీకరిస్తే పరిస్థితి మారుతుందని ఇరాన్ చర్చలను ఆలస్యం చేస్తోందని ఆరోపించారు. ఫలితంగా అమెరికాఒత్తిడి కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. దౌత్యపరమైన ప్రయత్నాలకు మద్దతుగా సైనిక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అధ్యక్షుడు ఆశిస్తున్న ఒప్పందాన్ని సాధించేందుకు అవసరమైన పరిస్థితులు సృష్టించడమే లక్ష్యమని



పేర్కొన్నారు. ఇరాన్‌తో ఉద్రిక్తతల మధ్య హార్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలు కొనసాగేందుకు అమెరికా చర్యలు చేపడుతోందని హెగ్సెత్ తెలిపారు. ఇటీవలి సైనిక చర్యలతో ఇరాన్ నౌకాదళం, వైమానిక దళం, వైమానిక రక్షణ వ్యవస్థలు బలహీనపడ్డాయని పేర్కొన్నారు. అవసరమైతే భవిష్యత్తులో కూడా చర్యలుచేపడతా మని హెచ్చరించారు.

## 'గణాంకాలు బాగున్నాయి.. ఐ లవ్ ద్రవ్యోల్బణం': ట్రంప్

**వాషింగ్టన్, జూన్ 11:** పశ్చిమాసియా ఘర్షణలతో అంతర్జాతీయంగా ద్రవ్యోల్బణ భయాలు ముసురుకుంటున్నాయి. ఇప్పటికే భారత్ సహా పలు దేశాల్లో ఆ ప్రభావం కనిపిస్తోంది. చమురు మంటలతో అమెరికాలో మే నెల ద్రవ్యోల్బణ గణాంకాలు మూడేళ్ల గరిష్ఠానికి చేరిన నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. అసలు ఆ భయాలే అవసరం లేదన్నట్టుగా ఆయన మాటాడారు. 'గణాంకాలు బాగున్నాయి. ద్రవ్యో ల్బణం అంటే నాకు చాలా ఇష్టం' అని మీడియాతో వ్యాఖ్యానించారు. అమెరికాలో కన్జూమర్ ప్రైస్ ఇండెక్స్ 4.2 శాతానికి పెరిగింది. ఏప్రిల్ 2023 తర్వాత ఇదే అత్యధికస్థాయి. ఇలాంటి సమయంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అమెరికన్లు ఎదుర్కొంటున్న ఆర్థిక నష్టాలను లెక్కచేయని విధంగా ఆయన మాటలు ఉన్నాయని డెమోక్రాట్లు మండిపడుతున్నారు. 'ద్రవ్యోల్బణాన్ని ప్రేమిస్తున్నాని ట్రంప్ చెప్తున్నారు. ఆయన మాటలు ప్రతి ఒక్కరూ చూడాలి' అని డెమోక్రాటిక్ పార్టీ సోషల్ మీడియా వేదికగా ప్రచారం మొదలుపెట్టింది. నవంబరులో మధ్యంతర ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధ్యక్షుడి వ్యాఖ్యలు ప్రతిపక్ష పార్టీకి అస్త్రంగా మారాయి. ఆయన మాటలను విపక్ష నేతలు వక్రీకరించారంటూ రిపబ్లికన్ పార్టీ నేత మైక్ జాన్సన్ నష్టనివారణకు దిగినా ప్రయోజనం లేకపోయింది.




## కేరళలో నిఫావైరస్ కలకలం

### కోజికోడ్‌లో ఒకరికి పాజిటివ్

**కోజికోడ్,జూన్ 11:** కేరళ రాష్ట్రంలో నిఫా వైరస్ కలకలం రేపింది. కోజికోడ్ జిల్లాకు చెందిన 43 ఏండ్ల వ్యక్తికి ప్రాథమిక పరీక్షలో వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఆవ్యక్తికి గిడ్డంగిని శుభ్రం చేస్తున్న ప్పుడు ఈ ఇన్ఫెక్షన్ సోకి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తు న్నారు. అతడిని పరీక్షించిన వైద్యులు రోగి శాంపిల్స్‌ను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపించారు. పరీక్ష ఫలితాలు నేడు వెలువడే అవకాశం ఉందని, ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన ప్రభుత్వం కోజికోడ్ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. నిఫా పరిస్థితులపై అంచనా వేసి మెడికల్ బోర్డు ఆధ్వర్యంలో తీసుకోవాల్సిన చర్యలపై నేడు చర్చించనున్నారు. ఎన్ఐవి పరీక్ష ఫలితాల ఆధారంగా కంటైన్‌మెంట్ జోన్‌లను ఏర్పాటు చేయడం, రాష్ట్రంలో ఆంక్షలు విధించడంపై నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. రోగి పలువురితో కలిసి తిరిగినందున ఆరోగ్య శాఖ అధికారులు ఇప్పటికే కాంటాక్ట్ ట్రేసింగ్ ప్రారంభించారు. కేరళ ఆరోగ్య మంత్రి కె. మురళీధరన్ మాట్లాడుతూ నిఫాపై ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

## ఆ నలుగురి కోసం పాకిస్థాన్ ఆర్మీ వేట

**ముజఫరాబాద్,జూన్ 11:** పాక్ ఆక్రమిత కశ్మీర్ పివొకెలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇటీవల జరిగిన హింసాత్మక నిరసనల నేపథ్యంలో, ఆందోళనలకు నాయకత్వం వహించిన నలుగురు కీలక నేతలను పట్టుకునేందుకు అక్కడి ప్రభుత్వం వేట మొదలుపెట్టింది. వారిని అరెస్ట్ చేయడానికి సమాచారం ఇచ్చిన వారికి రూ.కోటి రివార్డును ప్రకటించింది. ఈ ఘర్షణల్లో భద్రతా సిబ్బందితోపాటు పలువురు పౌరులు మరణించడంతో పరిస్థితి మరింత జటిలంగా మారింది. ధరల పెరుగుదల, నిరుద్యోగం, తీవ్రమైన విద్యుత్ కోతలు, రాజకీయపరమైన అంశాలపై స్థానికుల్లో చాలాకాలంగా అసంతృప్తి పేరుకుపోయింది. ఈ సమస్యలపై పోరాడేందుకు 2023లో ఏర్పాటైన జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జెఎఎసి) ఆధ్వర్యంలో ప్రజలు ఆందోళన బాట పట్టారు. ముజఫరాబాద్ వైపు భారీ పాదయాత్రకు పిలుపునివ్వడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. వెంటనే జాక్ సంస్థను ఉగ్రవాద నిరోధక చట్టాల కింద నిషేధించి, దాని నేతలపై దేశద్రోహం కేసులు నమోదు చేసింది. షౌకత్ నవాజ్ మీర్, ఉమర్ నజీర్ కశ్మీరీ, ఖవాజా మెహ్రాన్ అర్షద్, సర్దార్ అమన్ ఖాన్ అనే నలుగురు ముఖ్య నేతలను పట్టుకోవడమే లక్ష్యంగా అధికారులు గాలిస్తున్నారు. పివొకెలోని రావల్‌కోట్ వంటి ప్రాంతాల్లో నిరసనకారులకు, భద్రతా బలగాలకు మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ హింసలో సుమారు 7 నుంచి 11 మంది మరణించినట్లు అల్ జజీరా, రాయిటర్స్ వంటి అంతర్జాతీయ మీడియా సంస్థలు నివేదించాయి. మృతుల్లో నలుగురు భద్రతా సిబ్బంది కూడా ఉన్నారని తెలిపాయి. జాక్ పిలుపునిచ్చిన బంద్‌తో పివొకెలోని మార్కెట్లు, రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించాయి.

**భారత్ స్పందన.. ప్రస్తుత పరిస్థితి:** పివొకెలో పోలీసుల దౌర్జన్యాలపై వస్తున్న వార్తలపై భారత విదేశాంగ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మానవ హక్కుల ఉల్లంఘనపై అంతర్జాతీయ సమాజం దృష్టి సారించాలని కోరింది. శాంతియుత నిరసనలను అణచివేయ డాన్ని పలు హక్కుల సంఘాలు కూడా ఖండించాయి. ప్రస్తుతం పీవోకే వ్యాప్తంగా ఉద్రిక్త వాతావరణం నెలకొని ఉంది. భారీగా భద్రతా బలగాలను మోహరించి, తప్పించుకున్న నేతల కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

## ఆ వార్తల్లో నిజం లేదు.. టిఎంసి విలీనంపై కాంగ్రెస్ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, జూన్ 11:** తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) పార్టీ కాంగ్రెస్‌లో విలీనం కానుందన్న ప్రచారాన్ని కాంగ్రెస్ పార్టీ ఖండించింది. అలాంటి చర్చలు ఎక్కడా జరగలేదని స్పష్టం చేసింది. ఈ వార్తలన్నీ పూర్తిగా నిరాధారమని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ కొట్టిపారేశారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి సమావేశానికి పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, టిఎంసి జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు సోనియాగాంధీ, రాహుల్ గాంధీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీతర్వాతే రెండు విలీనంపై ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే ఆ సమావేశంలో జాతీయ రాజకీయ అంశాలపై మాత్రమే చర్చ జరిగిందని వేణుగోపాల్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా సమస్యలను మరింత సమర్థంగా ఎలా లేవనెత్తాలనే అంశంపైనే చర్చ జరిగిందన్నారు. విలీన ప్రతిపాదనగానీ, అలాంటి చర్చలు గానీ, అసలు జరగలేదని స్పష్టంచేశారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## రాష్ట్రంలోనే హుస్నాబాద్ హరిత ఆదర్శంగా నిలవాలి

### ప్రతి ఇంటికి ఐదు మొక్కలు పంపిణీ చేయండి: మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, జూన్ 11, ప్రభాతవార్త:** వన మహోత్సవం సందర్భంగా చేపట్టే మొక్కల నాటే కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గం రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలవాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. గురువారం హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వన మహోత్సవం, ఇంకుడుగుంతలు, హరితహారం కార్యక్రమాలపై అధికా రులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ఏడు మండలాలకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి మొక్కల నాటకం, సంరక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లో కలిపి 2.5 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించినట్లు చెప్పారు. హుస్నాబాద్- ఎల్కతుర్తి జాతీయ రహదారి ఇరువైపులా కూడా మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. గౌడ సంఘాలు, ఎక్సైజ్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. హుస్నాబాద్‌లో నిర్మితమవుతున్న అర్బన్ ఫారెస్ట్ పార్కులో చిన్నారుల కోసం ఆట స్థలాలు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.



## జిహెచ్ఐఎల్ ప్రభుత్వానికి రూ.12.28 కోట్ల డివిడెండ్ చెల్లింపు

**రంగారెడ్డి అర్బన్ జూన్ 11,ప్రభాతవార్త :** జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ తన వాటాదారులకు స్థిరమైన రాబడులు, దీర్ఘకాలిక విలువ సృష్టి పట్ల ఉన్న కట్టుబాటును కొనసాగిస్తూ, ప్రభుత్వానికి సుమారు 12.28 కోట్ల మధ్యంతర డివిడెండ్‌ను బదలీ చేసినట్లు ప్రకటించింది. ఈ చెల్లింపు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంస్థ ప్రకటించిన రెండో మధ్యంతర డివిడెండ్‌లో భాగం కాగా, డివిడెండ్ రేటు 25 శాతంగా నిర్ణయించబడింది. అంతకుముందు, ఫిబ్రవరిలో ప్రభుత్వానికి ..36.85 కోట్ల డివిడెండ్‌ను సంస్థ పంపిణీ చేసింది. దీంతో, 2025-26 ఆర్థిక సంవత్సరానికి జిహెచ్ఐఎల్ ప్రకటించిన మొత్తం డివిడెండ్ పంపిణీ 49.14 కోట్లకు మించి చేరుకుంది. ఈ ఆర్థిక సంవ త్సరానికి మొత్తం డివిడెండ్ చెల్లింపు రేటు 100 శాతంగా నమోదైంది. జిహెచ్ఐఎల్ కార్యకలాపాలు ప్రారంభమైన నాటి నుంచి ప్రభుత్వానికి మొత్తం 149.87 కోట్ల డివిడెండ్‌లను చెల్లించింది, ఇది సంస్థ యొక్క స్థిరమైన ఆర్థిక పనితీరు, నగదు ప్రవాహ నిర్వహణ సామర్థ్యం, వాటాదారుల రాబడి పెంపుపై దృష్టిని ప్రతిబింబిస్తుంది. ప్రభుత్వంతోపాటు అన్ని వాటాదారులకు దీర్ఘకాలిక, స్థిరమైన విలువను అందించాలనే లక్ష్యంతో జిహెచ్ఐఎల్ ముందుకు సాగుతోంది.



## ఖమ్మంలో భారీ చోరీ!

### సోనోవిజన్‌లో ఐఫోన్లు లూటీ చేసిన దొంగలు

### సిబ్బంది షోరూమ్‌కు చేరుకునేలోపే కారులో పరారైన నిందితులు

**ఖమ్మం క్రైమ్, ప్రభాతవార్త :** ఖమ్మం నగరంలో గురువారం తెల్లవారు జామున భారీ చోరీ ఘటన జరిగింది. నగరంలోని ప్రధాన మార్గమైన వైరా రోడ్‌లోని సోనోవిజన్ షాపులో దుండగులు ప్రవేశించి విలువైన సెల్ ఫోన్లను, ఇతర సొత్తును దొంగలించారు. దోపిడీకి గురైన సొత్తు విలువ రూ. 60 లక్షల వరకు ఉంటుందని నగర ఏసీపీ రమణమూర్తి తెలిపారు. ఖమ్మం సిటీ ఏసీపీ కథనం ప్రకారం.. గురువారం తెల్లవారుజామున 3.30 గంటలకు ఘటన జరిగిందని షాపులోకి దుండగులు ప్రవేశించగానే అలారం మోగింది. అలారం మోతకు విజయవాడలోని సోనోవిజన్ షాపునకు సంబంధించినవారు గమనించి 3.40 గంటల ప్రాంతంలో స్థానిక షాపు నిర్వాహకులకు, సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన ఖమ్మం సోనో విజన్ షాపునకు చెందిన వ్యక్తులు అక్కడికి చేరుకునేలోపే దుండగులు చోరీకి పాల్పడి షాపు నుంచి బయటకు వస్తున్నారు. అప్పటికే షోరూం బయట పారిపోయేందుకు కారును సిద్ధంగా ఉంచుకున్నారు. షోరూమ్ లో నుంచి బయట కు వచ్చిన దొంగలు కారు ఎక్కి పరారు అవుతుండగా షోరూం సిబ్బందిలో ఒకరు తమ ద్విచక్ర వాహనాన్ని అడ్డుపెట్టి వారిని ఆపేందుకు ప్రయత్నించిన నిందితులు కారు రివర్స్ తీసుకొని వేగంగా అక్కడి నుంచి ఉడాయించారు. షాపులో విలువైన ఐ ఫోన్లు, ఛార్జర్లు, అడాప్టర్లు వంటి సొత్తు చోరీకి గురైందని, వీటి విలువ రూ. 60 లక్షల వరకు ఉంటుందని ప్రాథమికంగా గుర్తిం చినట్లు ఏసీపీ రమణమూర్తి చెప్పారు. సీసీ ఫుటేజీని పరిశీలిస్తు న్నామని, దుండగుల కోసం గాలిస్తున్నామని ఆయన తెలిపారు. ఘటనా స్థలాన్ని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించి, చోరీ జరిగిన ప్రాంతాన్ని, షాపును పరిశీలించారు. ఘటనకు సంబం ధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిందితులను వీలైనంత తొందరలో పట్టుకునేలా పోలీస్ అధికారులను ఆదేశించారు.

**కీలక ఆధారాలు, వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీమ్**

నగరంలోని ప్రముఖ విక్రయ కేంద్రమైన 'సోని విజన్' షోరూమ్‌లో అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీ జరిగింది. సమాచారం తెలుసుకున్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. నిందితులను పట్టుకునేలా పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. గుర్తుతెలియని దుండగులు షాపు తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడి, స్టాక్ రూమ్‌లో భద్రపరిచిన విలువైన అధునాతన మొబైల్ ఫోన్లు చోరీ జరిగినట్లు యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్ రంగంలోకి దిగి వేలిముద్రలు, ఇతర కీలక ఆధారాలను సేకరిస్తున్నారు.

# పంటల వైవిధ్యం పాటించాలి

### వరి, పత్తికి బదులు ప్రత్యామ్నాయం

### రైతులకు అవగాహన కార్యక్రమాలు

### వానకాలం సాగుపై వ్యవసాయ శాఖ అప్రమత్తం

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అప్రమత్తమైంది. పంటల వైవిధ్యం పాటించాలని కోరుతూ వ్యవసాయ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగంలో అవగాహన కార్యక్రమాలను ప్రారంభించింది. రాష్ట్రంలోని నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, కొమరం భీమ్ ఆసిఫాబాద్ తదితర జిల్లాలో వానాకాలం సీజనులో రైతులు ఎక్కువగా నీటి వినియోగం ఎక్కువగా ఉండే పంటలైన పత్తి, సోయా, వరి సాగు చేసేవారని అధికారులు తెలిపారు. వానాకాలం సీజనులో రాష్ట్రం మొత్తం మీద పత్తి దాదాపు 50 లక్షల ఎకరాల్లోను, వరి 67 లక్షల ఎకరాల్లోనూ రైతులు సాగు చేస్తున్నారు. అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 5.50 లక్షల ఎకరాలు, సూర్యాపేట్‌లో 4.70 లక్షల ఎకరాలు, సిద్దిపేట్‌లో 3.71 లక్షల ఎకరాలు, మెదక్, జగిత్యాల, కామారెడ్డిలలో 3 లక్షల ఎకరాలకు పైబడి, నిజామాబాద్ జిల్లాలో 4.50 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. అలాగే పత్తి సాగుకు సంబంధించి ఆదిలాబాద్ జిల్లాలో 4.30 లక్షల ఎకరాలు, ఆసిఫాబాద్‌లో 3.40 లక్షల ఎకరాలు, సంగారెడ్డిలో 3.50 లక్షల ఎకరాలు, ఖమ్మం, కొత్తగూడెం, వికారాబాద్‌లో 2.50 లక్షల ఎకరాలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 3 లక్షల ఎకరాల్లో అత్యధికంగా సాగు చేస్తున్నారు. అయితే ప్రస్తుత వానాకాలం సీజనులో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు కారణంగా కరువు లాంటి పరిస్థితి ఏర్పడే అవకాశం ఉన్నందున, జూలై 15, జూలై 30 మరియు ఆగస్టు 15 వరకు వర్షపాతం లేకపోవడంతో సహా వివిధ పరిస్థితుల కోసం శాఖ ఆకస్మిక పంట ప్రణాళికలను సిద్ధం చేసింది. కంది, జొన్న, పెసర, మినుములు వంటి పప్పుధాన్యాలతో పాటు సజ్జ, మొక్కజొన్న, నూనెగింజలు వంటి తక్కువ నీటి వినియోగం గల పంటలకు మారాలని రైతులకు సూచిస్తున్నారు. జాతీయ సహజ వ్యవసాయ మిషన్ కింద స్వల్పకాలిక వరిలో ఎనిమిది రకాలను ప్రోత్సహించాలని, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కూడా ఈ శాఖ యోచిస్తోంది. జిల్లాల్లోని ప్రతి క్లస్టర్‌లో 125 మంది రైతుల వరకూ సేంద్రియ వ్యవసాయంలో శిక్షణ ఇవ్వబడుతుంది. నానో యూరియా యొక్క ఉపయోగాలు మరియు ప్రయోజనాలపై కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వివిధ వర్షపాత పరిస్థితులకు అనువైన పంటల కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, పరిస్థితిని అంచనా వేయడానికి వ్యవసాయ విస్తరణ అధికారులు, ఇతర అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తు న్నామని అధికారులు తెలిపారు. నిర్మల్, ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్ మరియు మంచిర్యాలతో సహా 32 జిల్లాల్లో ఈ వానాకాలం సీజన్‌లో పచ్చిరొట్ట ఎరువుల పంపిణీని ప్లాన్ చేస్తున్నారు. సాధారణంగా మంచిర్యాలలో జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షపాతం కురుస్తుండగా, గత ఆరేళ్లుగా ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షపాతం సగటు కంటే తక్కువగా ఉందని అధికారులు గుర్తించారు. ఎల్ నినో ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుని ఒక వ్యవసాయ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. మిశ్రమ, స్వల్పకాలిక పంటలతో సహా పంటల వైవిధ్యీకరణను చేపట్టాలని, అలాగే పామాయిల్, మొక్కజొన్న సాగు వంటి ప్రత్యామ్నాయాలను పరిగణిం చాలని రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# బాధిత బాలికకు అండగా ప్రభుత్వం

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జూన్ 11, ప్రభాతవార్త:** ఖమ్మంలో 12 యేళ్ల బాలికపై తండ్రి వయసున్న వ్యక్తి లైంగిక దాడికి ఒడిగొట్టడం దారుణ మని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. కీచకుడి దాడిలో గాయపడి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధిత బాలికను గురు వారం ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. భవనంపై నుంచి తోసేయడం వల్ల బాలిక వెన్నుముక దెబ్బతినడంతోపాటు చాలాచోట్ల ఎముకలకు పగుళ్లు వచ్చాయని వైద్యులు తెలిపారన్నారు. ఎంత ఖర్చయినా ప్రభుత్వం తరుపున అత్యు త్తమ వైద్యం అందిస్తామన్నారు. బాలిక ఆరోగ్యస్థితి, అందిస్తున్న వైద్య సేవలను నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ మంత్రికి వివరించారు.



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

**ప్రభుత్వ తీరు బాధాకరం: మాజీమంత్రి హరీశ్‌రావు**

ఖమ్మంలో మైనర్ బాలికపై జరిగిన సంఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి చాలా బాధకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. నిమ్స్ ఆసుపత్రిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితో కలిసి బాలికను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. నాలుగు రోజుల క్రితం ఖమ్మం పట్టణంలో జరిగిన ఘటన అత్యంత బాధా కరమన్నారు. సభ్య సమాజం తలదించుకోవాల్సిన పరిస్థితి అన్నారు. ప్రాణాపాయ స్థితవిలో నిమ్స్‌లో ఉన్న చిన్నారికి ఉచిత వైద్యం అందించకుండా ఆ పేద కుటుంబాన్ని బయట మందులు కొనిపించడం కాంగ్రెస్ పార్టీ దివాలకోరుతనానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రోజురోజుకు పోక్సో కేసులు పెరుగుతున్నాయని, పసిపిల్లల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. బాధితులకు అండగా నిలిచి అఘాయిత్యాన్ని వెలుగులోకి తెచ్చిన వ్యక్తిపైనే అక్రమ కేసులు పెడుతామని ఖమ్మం పోలీసులు బెదరించడం అత్యంత దుర్మార్గమన్నారు. దారుణానికి ఒడిగట్టిన మృగాలను ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా శిక్షించి బాధిత కుటుంబానికి రూ. 10లక్షల సాయం అందించి, ఉచిత వైద్యసాయం అందించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో శాంతిభద్రతలు క్షీణించాయన్నారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో మహిళా మంత్రి ఈ విషయంలో ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు.

## ఖమ్మం బాలికకు పూర్తి ఉచితంగా ట్రీట్‌మెంట్

### ప్రస్తుతం ఆమె ఆరోగ్యం స్థిరంగా ఉంది

### నిమ్స్ డైరెక్టర్, డాక్టర్ రాహుల్ దేవరాజ్

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** ఖమ్మం బాధిత బాలికకు పూర్తి ఉచితంగా ట్రీట్‌మెంట్ అందిస్తున్నామని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ తెలిపారు. సీరియస్ కండీషన్‌లో అమ్మాయి నిమ్స్‌కు వచ్చిందని, వెంటనే ఆరోగ్యశ్రీలో అడ్మిట్ చేయించి, అవసరమైన చికిత్సను ప్రారంభించామన్నారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, అవసరమైన బ్లడ్ టెస్టులు అన్నీ ఆరోగ్యశ్రీ పరిధిలోనే ఉచితంగా పూర్తి చేయించామన్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం స్టేబుల్‌గా ఉందని నిమ్స్ డైరక్టర్ తెలిపారు. నిపుణులైన డాక్టర్ల బృందం ఆమెకు చికిత్స అందిస్తోందని, పాప తల్లిదండ్రులకు రూమ్ ఇచ్చామని, అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ట్రీట్‌మెంట్, మెడిసిన్, భోజనం అన్నీ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా అందిస్తున్నామని నిమ్స్ డైరక్టర్ డాక్టర్ రాహుల్ దేవ్‌రాజ్ మీడియాకు తెలిపారు.

**కంటికి రెప్పలా కాపాడుతున్నారు.. మీడియాతో ఖమ్మం బాధితబాలిక తల్లి**

నిమ్స్‌లో తమ పాపను కంటికి రెప్పలా కాపాడుతున్నారని, ఖమ్మం బాధిత బాలిక తల్లి మీడియాకు తెలిపింది. మీడియాతో మాట్లాడిన ఖమ్మం జిల్లాకు చెందిన బాధిత బాలిక తల్లిదండ్రులు నిమ్స్‌లో తమ పాపను కంటికి రెప్పలా కాపాడుతున్నారన్నారు. అవసరమైన ట్రీట్‌మెంట్, మెడిసిన్, టెస్టులన్నీ ఉచితంగా చేస్తున్నారని తెలిపారు. తమ దగ్గర మెడిసిన్ కోసం డబ్బులు తీసుకోలేదని, అవసరమైన మందులన్నీ వాళ్లే ఇస్తున్నారని తెలిపారు. తాము ఉండడానికి రూమ్ కూడా ఇచ్చారని, తమకు భోజనం కూడా ఉచితంగానే అందిస్తున్నారని వారు మీడియాకు చెప్పారు.

## ఖమ్మం బాధిత బాలికకు మెరుగైన వైద్యం అందించాలి

### నిందితుడిని కఠినంగా శిక్షించాలి

### సిఎంఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** ఖమ్మం బాధిత బాలికకు మెరుగైన వైద్యం అందించాలని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. నిందితుడిని కఠినంగా శిక్షి ంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా, కల్లం పాడు గ్రామానికి చెందిన మైనర్ బాలికపై మహమ్మద్ పాషా అనే కామాంధుడు అత్యా చారానికి పాల్పడి, నాలుగు అంతస్తుల బిల్డింగ్ పైకి తీసుకెళ్లి అతి కిరాతకంగా దాడి చేసి హత్యా యత్నానికి ప్రయత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తు న్నామన్నారు. ప్రభుత్వం మెరుగైన వైద్యం అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితుడు మహమ్మద్ పాషాను కఠి నంగా శిక్షించేందుకు, తక్షణమే ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## 20 యేళ్లుగా ఆయన వల్లే ఓటమిపాలు

### కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ముందు హాజరై వివరణ ఇచ్చిన చంద్రశేఖర్‌రెడ్డి

### మల్లు రవి లేకపోవడంతో వైస్‌చైర్మన్ శ్యాంమోహన్‌కు అందజేసిన సంజాయిషీ

### కాంగ్రెస్‌లో టెన్షన్ పెడుతున్న కామారెడ్డి పంచాయితీ

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** కామారెడ్డిలో ఇరవై సంవత్స రాలుగా కాంగ్రెస్ గెలుపొందకపోవడానికి షబ్బీర్‌అలీ కారణం అంటూ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ముందు హాజరైన కామారెడ్డి కాంగ్రెస్ నాయకుడు క్రమశిక్షణ కమిటి ముందు హాజరై మౌఖికంగా వివరించినట్లు తెలిసింది. గురువారం గాంధీభవన్‌లో క్రమశిక్షణ కమిటీ ముందు హాజరై గడ్డం చంద్రశేఖర్ రెడ్డి వివరణ ఇచ్చారు. తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ సంఘం చైర్మన్ బెంగుళూర్ వెళ్ళడంతో వైస్‌చైర్మన్ శ్యాంమోహన్‌కు రాతపూర్వక,మౌఖిక వివరణ అందజేశారు. చంద్రశేఖర్‌రెడ్డి వివరణ ఇవ్వడానికి గడువు గురువారంతో ముగిసిపోనుండటంతో ఆయన వివరణ అందజేశారు. రెండు రోజుల క్రితం షబ్బీర్ అలీ టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు రెండు రోజుల క్రితం పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లుగా వైరల్ అవుతున్న షబ్బీర్ అలీ ఆడియో ను కూడా ఆయన క్రమశిక్షణ సంఘం ముందు వినిపించినట్లు తెలిసిందాఇ. దీనిపై కూడా క్రమశిక్షణ కమిటీకి చంద్రశేఖర్ రెడ్డి వివరణ ఇచ్చినట్లు సమాచారం.

సీనియర్ నేత షబ్బీర్ అలీ వల్లనే కామారెడ్డిలో 20 ఏళ్లుగా పార్టీ గెలవడం లేదని ఆరోపించినట్లు తెలిసింది. సీనియర్ నేత షబ్బీర్ అలీ, జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ రెడ్డి మధ్య వివాదం చెలరేగింది. వీరిద్దరూ రెండు గ్రూప్‌లుగా విడిపోయి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. పార్టీకి నష్టం చేస్తున్నారంటూ షబ్బీర్ అలీపై చంద్రశేఖర్ ఫిర్యాదు చేశారు. అలాగే చంద్రశేఖర్ తనను తిట్టారంటూ షబ్బీర్ అలీ ఆరోపించారు. గత 20 రోజులుగా కామారెడ్డి పంచాయితీ కాంగ్రెస్ పార్టీలో హైటెన్షన్ వాతావరణాన్ని నెలకొల్పింది. షబ్బీర్ అలీ ఫిర్యాదు మేరకు చంద్రశేఖర్ రెడ్డికి క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసింది. దీంతో ఈరోజు క్రమశిక్షణ కమిటీ ముందు చంద్రశేఖర్ హాజరయ్యారు. తనపై వచ్చిన ఆరోపణలన్నింటిపైనా లిఖితపూర్వకంగా క్రమశిక్షణ కమిటీకి వివరించారు. షబ్బీర్ అలీ తీరుతో కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీకి నష్టం జరుగుతోందని, ఆయన్ను పార్టీ బాధ్యతల నుంచి పూర్తిగా తప్పించాలని చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు.

## మీనాక్షి నటరాజన్‌పై బిజెపి కుట్రలు వ్యతిరేకించాలి

### ప్రభుత్వ విప్ జాటోతు రామచంద్రనాయక్

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** బిజెపితో బిఆర్ఎస్ వలే చీకటి ఒప్పందాలు చేసుకునే వ్యక్తి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాదనీ ప్రభుత్వ విప్ జాటోతు రామచంద్రనాయక్ అన్నారు. గురువారం సిఎల్పీ మీడియా సెంటర్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కెటిఆర్‌ను బిఆర్ఎస్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించి హరీశ్‌రావుకు ప్రాధాన్యత లేకుండా కెసిఆర్ చేయడంతో హరీశ్‌రావు బిజెపిలోకి వెళ్లడానికి ప్రయత్నాలు చేస్తే వాళ్లు పట్టించుకోలేదనీ ఆ అసహనంలో హరీశ్‌రావు మాట్లాడుతున్నాడని విమర్శించారు. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ వెనుక కాంగ్రెస్ నాయకులున్నారని పిచ్చిగా మాట్లాడుదు కాదనీ, దమ్ము, ధైర్యం ఉంటే హరీశ్‌రావు ఆధారాలను ప్రజల ముందు పెట్టాలనీ సవాల్ విసిరారు. మీనాక్షి నటరాజన్ పైన బిజెపి కుట్రలను వ్యతిరేకిస్తే ప్రజాస్వామ్యాన్ని రక్షించి ంచినట్లు అవుతుందని హితవు చెప్పారు.

## కామారెడ్డిలో తల్లి, ముగ్గురు పిల్లల అదృశ్యం

### ఆచూకీ కోసం పోలీసుల గాలింపు

**హైదరాబాద్ జూన్ 11, ప్రభాతవార్త:** కామారెడ్డిలో ఓ గృహిణి ముగ్గురు పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానిక గాంధీనగర్‌లో నివసించే భానుప్రకాష్‌తో (41) లయ (37) దంపతులు. వీరికి బిందు (16), శివ (13), దివిజ (8) పిల్లలు. భానుప్రకాష్ నిత్యం మద్యం తాగి భార్యతో గొడవపడేవాడు. లయ తన పుట్టింటి వారు చేసే సహాయంతోపాటు చిన్నాచితక పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకు వస్తోంది. రెండేళ్ల క్రితం భర్త వ్యవహారంపై తన తల్లిదండ్రులకు లయ చెప్పగా వారు వచ్చి సముదాయించి నచ్చచెప్పారు. అయినా భానుప్రకాష్‌లో మార్పు కనిపించలేదు. దీంతో లయ తన ముగ్గురు పిల్లలను తీసుకుని మూడురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆలస్యంగా తెలుసుకున్న భానుప్రకాష్ భార్య పిల్లల గురించి పలుచోట్ల వాకబు చేసినా ఫలితం కనబడలేదు. దీంతో బుధవారం సాయంత్రం కామారెడ్డిటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం రాత్రి నుంచి వారి కోసం గాలించినా ఎలాంటి ప్రయోజనం కలగలేదు. లయ ఇంటి నుంచి సమీపప్రాంతాల్లోని సిసిటివి ఫుటేజిలను పోలీసులు పరిశీలిస్తున్నారు. సమీప పోలీసు స్టేషన్లకు సమా చారం ఇచ్చి బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్ల వద్ద గాలించసాగారు.

## మల్కాజిగిరిలో మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు

### గంటల్లోనే ప్రధాన నిందితుడి అరెస్ట్

### పిస్టల్, తూటాలు, కత్తులు స్వాధీనం



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

**హైదరాబాద్ (మల్కాజిగిరి), జూన్ 11, ప్రభాతవార్త :** మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో సంచలనం సృష్టించిన మహిళ హత్య కేసును పోలీసులు గంటల వ్యవధిలోనే ఛేదించారు. కేసులో ప్రధాన నింది తుడిని అరెస్ట్ చేసి, హత్యకు ఉపయోగించిన దేశీయతయారీ పిస్టల్, సజీవతూటాలు, కత్తులు తదితర వస్తువులను స్వాధీనం చేసుకు న్నారు. మరో నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు వివరాలను పోలీసులు వెల్లడించారు. మృతురాలు ధమరా నిశారాణి (35) కాగా, ప్రధాన నిందితుడు ఆమె భర్త ధమరా అరుణ్‌కుమార్(48). అతడు రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వ హిస్తు న్నాడు. మరో నిందితుడు హర్దిందర్‌సింగ్ అలియాస్ హర్భజన్ సింగ్ పరారీలో ఉండగా, మిర్ ముజమ్మిల్ అలీఖాన్ (23) పాత్రపై కూడా పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, అరుణ్‌కుమార్ మొదట నిశారాణి అక్కను వివాహం చేసుకున్నాడు. అనంతరం నిశారాణిని వివాహం చేసుకున్నాడు. కొంతకాలంగా భార్య నిశారాణి ప్రవర్తనపై అనుమానాలు పెంచుకున్న అరుణ్‌కుమార్ తరచూ ఆమెను వేధించేవాడు. దాంతో నిశారాణి పలుమార్లు మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని తన బంధువుల వద్ద ఆశ్రయం పొందినట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల దాంపత్య కలహాలు మరింత తీవ్రరూపం దాల్చడంతో, జూన్ 10న సాయంత్రం సుమారు 4:30 గంటల సమయంలో మారుతి నగర్‌లోని తన నివాసంలోనే నిశారాణిపై తుపాకీతో కాల్పులు జరపగా ఆమె అక్కడికక్కడే మృతి చెందిందని పోలీసులు వెల్లడించారు.

అరుణ్‌కుమార్ గతంలో అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నెం.134/2026లో అక్రమ తుపాకీ కలిగి ఉన్న కేసులో నిందితుడిగా ఉన్నట్లు విచారణలో తేలింది. హత్య జరిగిన వెంటనే మల్కాజిగిరి పోలీసులు సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలు, ఇతర కీలక సమాచారాన్ని విశ్లేషించి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. 11న ఉదయం మౌలాలి రైల్వేస్టేషన్ సమీపంలో ప్రధాన నిందితుడు అరుణ్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని పిస్టల్, మూడు తూటాలు ఉన్న మ్యాగజైన్, బటన్ నైఫ్, రెండు కత్తులు, సర్జికల్ బ్లేడ్, మారుతి బలెనో కారు, బజాజ్ చేతక్ స్కూటర్ స్వాధీనం చేసుకున్నారు. కేసును వేగంగా ఛేదించిన పోలీసు సిబ్బందిని కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

# నేపాలీ గ్యాంగ్‌ను పట్టించిన కొత్త సిమ్‌కార్డు కవర్!

### ప్రధాన నిందితుడిని పట్టుకొని వదిలేసిన హిల్‌రిడ్జ్ సెక్యూరిటీ

### ముగ్గురు నిందితుల అరెస్టు.. 7.83 కిలోల బంగారు ఆభరణాలు స్వాధీనం

**హైదరాబాద్ (గచ్చిబౌలి), జూన్ 11, ప్రభాతవార్త:** గచ్చిబౌలి నేపాలీ గ్యాంగ్‌ను ఓ సిమ్‌కార్డు కవర్ పట్టించింది. చోరీ అనంతరం సెల్‌ఫోన్లను మొత్తం స్విచ్ఛ్ ఆఫ్ చేసిన నిందితులు కొత్త సిమ్‌కార్డు కొని కవర్‌ను అక్కడే పడవేయడంతో పోలీసులకు క్లూ దొరికింది. సదరు కవర్ ఆధారంగా నెంబరుతో లొకేషన్ ట్రేస్‌చేసి నిందితులు దేశం దాటి వెళ్లకుండా అడ్డుకోవడంతోపాటు గంటల వ్యవధిలోనే అదుపులోకి తీసుకున్నారు. గచ్చిబౌలి నేపాలీ గ్యాంగ్ దోపిడీ ముఠాలోని ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి 7.83 కిలోల బంగారు ఆభరణాలు, 1.36 కిలోల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం సైబరాబాద్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ రమేష్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. గచ్చిబౌలి హిల్‌రిడ్జ్ గేటెడ్ కమ్యూనిటీలోని విల్లా నెంబరు 73లో ప్రకాశ్ పాయ్(73) కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. వీరి వద్ద నేపాల్‌కు చెందిన కమల్ షాహి(32), అతని భార్య విమలాషాహి(28)లు పనిమనుషులుగా నెలరోజుల క్రితం పనిలో చేరారు. వీరిని నేపాల్‌కే చెందిన సురేష్ ఆలియాస్ సూరజ్, కరణ్ బిశ్వశర్మ పనిలోపెట్టారు. కాగా ఈనెల 6వ ప్రకాశ్‌పాయ్ తన భార్య వందన, కుమారుడు అభిజిత్‌తో కలిసి ఇంటికి తాళంవేసి ముంబై వెళ్లి, 7న సాయంత్రం తిరిగివచ్చాడు. ఇంటికి వచ్చి చూడగా లాకర్‌పైన వినాయకుడి పటానికి ఉన్న 4 తులాల బంగారు గొలుసు కనిపించలేదు. దీంతోపాటు ఇంట్లోని సర్వెంట్ గదిలో ఉండాల్సిన నేపాలీ భార్య, భర్తలు సైతం కనిపించకుండా పోయారు. దీంతో ప్రకాశ్ పాయ్ వెంటనే గచ్చిబౌలి పోలీసులకు 7న పిర్యాదు చేశాడు. కాగా 8వ తేదీ అతని కుమారుడు వచ్చి లాకర్ తెరువగా, అందులో ఉండాల్సిన 8 కిలోల బంగారు ఆభరణాలు, వజ్రాల ఆభరణాలు కనిపించలేదు. దీంతో ప్రకాశ్ పాయ్ మరోసారి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు వచ్చి పిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు ఉత్తరాఖండ్‌లో నేపాలీ ముఠాను అరెస్టు చేశారు.

**పట్టించిన సిమ్‌కార్డు కవర్..**

నేపాలీ జంట కమల్, విమలాలను పనిలో పెట్టిన సురేష్ దోపిడీ కోసం ముందే పథకం వేశాడు. అదను కోసం వేచి ఉండగా, యజ మాని కుటుంబం ఇంటికి తాళం వేసి ముంబై వెళ్లడంతో తమ కుట్రకు పనిచెప్పారు. 6వ తేదీ సాయంత్రం సురేష్ హిల్‌రిడ్జ్‌కు వచ్చి కమల్, విమలాతో కలిసి లాకర్ మీద ఉన్న చెంబులో తాళం చెవితో లాకర్ తెరిచారు. అందులో ఉన్న 7.83 కిలోల బంగారు ఆభరణాలతో పాటు దేవుడి పటానికి వేసి ఉన్న 4తులాల బంగారు గొలుసును సైతం తీసుకున్నారు. అనంతరం అక్కడినుంచి ఆటోలో సికింద్రాబాద్ వెళ్లారు. అక్కడ విమలా సోదరి కల్పనా షాహి(26)తో కలిసి ట్రైన్‌లో ఉత్తరాఖండ్ మీదుగా నేపాల్‌కు వెళ్లేందుకు బయలుదేరారు. కాగా నగరంలో ట్రైన్ ఎక్కే ముందు నిందితులు తమ సెల్‌ఫోన్లను స్విచ్ఛాఫ్ చేయడంతో పాటు కొత్త సిమ్ కార్డు కొనుగోలు చేశారు. సదరు సిమ్ కార్డు కవర్‌ను అక్కడే పడవేశారు. నిందితుల వద్ద స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ దాదాపు 12కోట్ల విలువ ఉంటుందని అంచనా వేస్తున్నారు.




సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న కమిషనర్ రమేష్‌రెడ్డి

## రాష్ట్రంలో కేంద్ర పథకాలు అమలు చేయాలి

### ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వండి

### గవర్నర్ శివప్రతాప్‌శుక్లాకు ఎమ్మెల్సీ మల్క కొమరయ్య విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** కేంద్ర పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసేలారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య గవర్నర్ శివ్‌ప్రతాప్‌శుక్లాకు వినతిపత్రం అందజేశారు. కేంద్రంలోని ప్రధాని మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలు తెలంగాణలో అమలు కావడం లేదని, వాటిని అమలు చేసేలా రాష్ట్ర సర్కారును ఆదేశించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య గురువారం లోక్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. జల్ జీవన్ మిషన్, పీఎం సురక్షా బీమా యోజన, ఫసల్ బీమా, సాయిల్ హెల్త్ కార్డు సహా కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న దాదాపు 22 పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు రాష్ట్ర స్థాయిలో సరిగా అమలు చేయడం లేదని ఎమ్మెల్సీ గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లారు. అతివృష్టి, అనావృష్టి సహా ప్రకృతి వైపరీత్యాలకు పంట నాశనమైతే రైతులకు పరిహారం అందేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫసల్ బీమా యోజనను కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేయడం లేదన్నారు. తద్వారా అన్నదాతలకు నష్టం జరుగుతోందని ఎమ్మెల్సీ గవర్నర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కేంద్రం అమలు చేస్తున్న పథకాలన్నీ రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య గవర్నర్‌కు అందజేసిన వినతిపత్రంలో కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్

## ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వండి

### రైతులకు కేంద్రమంత్రి బండి సంజయ్ పిలుపు

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:** సమాజంలో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోవడంతో చాలా కాలంగా రసాయనిక ఎరువులను ఉపయోగించి, అధిక శాతం దిగుబడుల కోసం పండిస్తున్న వ్యవసాయ ఉత్పత్తులు అందులో ముఖ్యంగా వరిపంట మన ప్రాణాలకు పెనుముప్పుగా మారిందని, రైతన్నలారా.. లోతుగా ఆలోచించి, ప్రకృతి వ్యవసాయానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వండి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించండి.. అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ గురువారం జమ్మికుంట ప్రకాషం కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె)లో జరిగిన ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సులో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లా బిజెపి అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ జెడ్పి చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ శత్రునాయక్, కెవికె వ్యవస్థాపక సభ్యులు విజయపాల్ రెడ్డి, సీనియర్ సైంటిస్ట్ వెంకటేశ్వర్‌రావులు ముఖ్య అతిథులుగా హాజరైయ్యారు. ఈ కార్యక్రమానికి హాజరైన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ నేడు సమాజంలో మనం తింటున్న ఆహారంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేసారు. రసాయన ఎరువుల ద్వారా పండిన పంటలు తినడం అంటే.. పైసలిచ్చి రోగాలను కొనితెచ్చుకుంటున్నామని బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేసారు. ఇకనైన రైతన్నలు సేంద్రియ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించి, వరి పంటకంటే చిరుధాన్యాలు అధిక మొత్తంలో పండించి వరి భోజనాన్ని తగ్గించుకుని మిల్లెట్స్ ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యవంతులుగా మీతో పాటు సమాజం ముందుకు సాగుతుందని, మందుగోలిలు మింగని సమాజం కోసం మనమంత నడుము బిగించాలని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు. కేంద్రంలో నరేంద్ర మోది ప్రభుత్వం 12 వసంతాలు పూర్తి చేసుకున్న ఈ తరుణంలో ప్రకృతి వ్యవసాయ రంగానికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తూ దేశవ్యాప్తంగా రైతాంగానికి ప్రకృతి వ్యవసాయంపై సమగ్ర సూచనలు ఇచ్చి వారిని ముందుకు తీసుకెళ్తుందని బండి సంజయ్ అన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన వ్యవసాయ పంటలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిచ్చి సంపూర్ణ మద్దతు ధరలు ఇస్తుందన్నారు.

## సర్.. 88 లక్షల ఓట్లపై అనుమానాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 10:** తెలంగాణలో 88 లక్షలకు పైగా ఓటర్ల వివరాల్లో తేడాలున్నట్లు తెలుస్తోంది. ఎస్ఐఆర్‌కు ముందు బిఎల్‌ఓలు ప్రత్యేక యాప్ ద్వారా 2022 ఓటరు జాబితాను మ్యాపింగ్ చేశారు. దీనిలో చాలా ఓట్లు 2,3 చోట్ల నమోదై ఉన్నట్లు తేలింది. అలాగే కొత్త ఓటర్ల వివరాలను 2002 జాబితాతో మ్యాపింగ్ చేయగా లక్షల్లో తేడాలొచ్చాయి. హైదరాబాద్ జిల్లాలో ఇవి ఎక్కువ ఉన్నట్లు ఈసీ వర్గాల సమాచారం తరచూ నివాస మార్పు,డూప్లికేషన్ రిజిస్ట్రేషన్స్ దీనికి కారణంగా పేర్కొన్నాయి.

## కర్జూర రైతులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి

### ప్రభుత్వానికి కర్జూర రైతుల వినతి

**హైదరాబాద్, జూన్ 11,ప్రభాతవార్త:** కర్జూర రైతులకు ప్రభుత్వం మార్కెటింగ్ సదుపాయం కల్పించి దేశీయంగా ఖర్జూర ఉత్పత్తులకు దోహదపడాలని ప్రభుత్వానికి కర్జూర రైతుల విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం స్పీక్ సంస్థ అధ్యక్షుడు ప్రొ. గోపాలం విధ్యాసాగర్ ఆధ్వర్యంలో సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఖర్జూర రైతుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విదేశాల నుండి ఖర్జూర పళ్లను దిగుమతి చేసుకోవడం కంటే దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించడం శ్రేయోదాయకమన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఖర్జూర పంటలను కొందరు రైతులు మాత్రమే పండిస్తున్నారని వారిని ప్రోత్సహించడంతో పాటు ప్రజల్లో ఖర్జూర పెంపకం, వినియోగం పై అవగాహణ కార్యక్రమాలను విరివిగా చేపట్టాలని కోరారు. విదేశాల నుండి దిగుమతి చేసుకున్న ఖర్జూరం కంటే దేశీయంగా పండించిన పళ్లలో పోషక విలువలు, శ్రేష్టత ఎక్కువ లభ్యమవుతాయన్నారు. ప్రస్తుతం ఖర్జూరం అంటే కేవలం సంపన్నులకు చెందిన పళ్లుగా భావించడం జరుగుతుందని, సర్వజనులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం రైతులకు ప్రోత్సహించే కార్యక్రమాలను రూపొందించాలని కోరారు.

## ఆ హోర్డింగ్‌తో సిఎంఆర్‌కు సంబంధం లేదు

**విశాఖపట్నం, ప్రభాతవార్త:** సోషల్ మీడియా వేదికలలో ఒక తప్పుడు, దురుద్దేశ పూర్వకమైన పోస్ట్ లేదా స్క్రీన్‌షాట్ విస్తృతంగా ప్రచారంలో ఉన్నట్లు ప్రజల దృష్టికి తీసుకువస్తున్నామని ఆ చిత్రంలో ఒక హోర్డింగ్ కనిపిస్తుండగా, దాని కింద"హిందూ యువతి/మహిళతో కలిసి వచ్చే ముస్లిం పురుషుడికి 10 నుండి 50 వరకు తగ్గింపు లభిస్తుంది" అనే వాక్యం ఉందని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, భారతదేశంలోని ఇతర రాష్ట్రాల ప్రజలకు మేము తెలియజేయునది ఏమనగా, ఆ చిత్రంలో చూపిన విధంగా సిఎంఆర్ గ్రూప్ ఎప్పుడూ ఎటువంటి హోర్డింగ్‌ను ఏర్పాటు చేయలేదు లేదా అటువంటి ప్రకటనను విడుదల చేయలేదని గత 4 దశాబ్దాలకు పైగా అత్యంత ప్రతిష్టాత్మకంగా వ్యాపారాన్ని నిర్వహిస్తున్న మా సంస్థ, సమాజంలో మతపరమైన విభేదాలకు లేదా అశాంతికి దారితీసే ఇటువంటి ప్రకటనలను ఎప్పుడూ చేయలేదు, భవిష్యత్తులో కూడా చేయదు అని కాబట్టి, సిఎం ఆర్ గ్రూప్ తరపున మేము ఈ తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ఇందుకు కారకులైన వారి మీద తగు క్రిమినల్ చర్యలు తీసుకోవలసిందిగా సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లోనూ, వివిధ జిల్లాల పోలీస్ స్టేషన్లలోనూ ఫిర్యాదు చేయడం కూడా జరిగిందనికావున, ప్రజలకు తెలియజేయడమేమిటంటే సోషల్ మీడియా వేదికలలో ఎవరికైనా ఇటువంటి తప్పుడు పోస్ట్‌లు కనిపిస్తే లేదా వస్తే, దయచేసి వాటిని ఇతరులకు షేర్ చేయవద్దని లేదా ప్రచారం చేయవద్దని ప్రజలను కోరుతూ... ఈ హెచ్చరికను గమనించిన తర్వాత కూడా వాటిని ప్రచారం చేస్తే తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవలసి వస్తుందని తెలియజేస్తున్నామన్నారు.

# సీతారామసాగర్‌కు పర్యావరణ అనుమతుల సాధనకు ప్రాధాన్యత

### ఉమ్మడి ఖమ్మం జిల్లా నీటిపారుదల ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలి

### పోలవరం బ్యాక్‌వాటర్ సమస్యలను ప్రాజెక్ట్ అథారిటీ దృష్టికి తీసుకెళ్తాం

### మంత్రి కెప్టెన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త :** సీతారామ సాగర్ ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులు త్వరితగతిన సాధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం జలసౌధలో ఉమ్మడి ఖమ్మం జిలాలోని ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టులపై నిర్వహించిన సమగ్ర సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న అన్ని అడ్డంకులను తొలగించి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. భూసేకరణ, పునరావాసం,పునర్నిర్మాణం , అటవీ అనుమతులు, పర్యావరణ అనుమతులు, కోర్టు కేసులకు సంబంధించిన అంశాలను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రతిపాదనలను వెంటనే జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులకు పంపించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. సీతారామ ప్రాజెక్టుకు కేంద్ర జల సంఘం నుంచి టెక్నికల్ అడ్వైజరీ కమిటీ అనుమతి లభించినట్లు అధికారులు వివరించారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి సుప్రీంకోర్టు సహా వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షిస్తూ సమర్థవంతంగా వాదించేందుకు అదనపు అడ్వకేట్ జనరల్‌ను న్యూఢిల్లీకి నియమించే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు.సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువ వ్యవస్థ ద్వారా పాలేరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు మళ్లించే అంశానికి అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన ఆదేశించారు. దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద గోదావరి జలాలను ఎత్తిపోసి ఎన్ఎస్‌పీ ఎడమ కాలువ వ్యవస్థతో అనుసంధానం చేయడం ద్వారా ప్రస్తుతం ఉన్న ఆయకట్టుకు, ముఖ్యంగా చిట్టచివరి ఆయకట్టుకు నీటి కొరత లేకుండా సాగునీటి స్థిరీకరణ చేయడమే ఈప్రాజెక్టు లక్ష్యమని వివరించారు. నీటిపారుదల, రెవెన్యూ, జిల్లా యంత్రాంగాల సమన్వయంతో పెండింగ్ భూసేకరణ సమస్యలను పరిష్కరించాలని పరిహారం



చెల్లింపును వేగవంతం చేయాలని సూచించారు.. జూలై నెలాఖరు నాటికి అవసరమైన అన్ని అటవీ అనుమతులు పొందాలని మంత్రి ఆదేశించారు.మున్నేరు-పాలేరు లింక్ కాలువ కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. సుమారు 9 కిలోమీటర్ల పొడవైన ఈ గ్రావిటీ కాలువ కోసం నాలుగు గ్రామాల్లో 317 ఎకరాల భూమి అవసరమని అధికారులు వివరించారు. రెండు గ్రామాల్లో సర్వే పూర్తయిందని, మిగతా రెండు గ్రామాల్లో కొనసా గుతోందని తెలిపారు. భూసేకరణకు సుమారు రూ.30 కోట్ల వ్యయం అవుతుందని వెల్లడిం చారు..ఎల్లందు నియోజకవర్గంలోని బయ్యారం మెట్ట ప్రాంత గిరిజన ప్రాంతాలకు సీతారామ ఎత్తిపోతల పథకం ప్యాకేజీ-1 నుంచి నీటిని అందించేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేసిన ప్రతిపాదనకు మంత్రి ఉత్తమ్ సూత్రప్రాయ ఆమోదం తెలిపారు. నీటి మూలం, అవసరమైన కనిష్ట ఎత్తిపోత, స్థానిక వాగుల వినియోగం, ఆర్థిక వ్యయం, లబ్ధి పొందే ఆయకట్టు వంటి అంశాలపై ఆచరణాత్మక, వ్యయసరళమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.పోలవరం బ్యాక్‌వాటర్ సమస్యలపై ప్రత్యేక సమీపోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ల కారణంగా భద్రాచలం డివిజన్‌లో ఏర్పడుతున్న ముంపు సమస్యలపై ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని త్వరలోనే పోలవరం ప్రాజెక్టు అథారిటీ దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించి పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.పక్షం రోజుల్లో ఖమ్మం జిల్లా ప్రాజెక్టుల పర్యటఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు పక్షం రోజుల్లో విస్తృత పర్యటన చేపడతానని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టుల వేగవంతమైన పూర్తి కోసం అవసరమైన నిధులను సకాలంలో విడుదల చేస్తూ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## దేశవ్యాప్తంగా 400 బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు

### ఇంధనానికి బొగ్గు గ్యాసిఫికేషన్ పరిణామాత్మక అవకాశం

### ప్రపంచంలోనే అతిపెద్ద ఉత్పత్తిదారునిగా భారత్

### గ్యాసిఫికేషన్ ప్రోత్సాహానికి రూ.46 వేల కోట్లతో పథకం

### బొగ్గు మంత్రిత్వ శాఖ రోడ్‌షోలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా దాదాపు 400 బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని కేంద్ర బొగ్గు, గనుల మంత్రి జి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ సహజ సంపద రీత్యా భారత్ ప్రపంచంలో 5వ స్థానంలో ఉందని గుర్తుచేశారు. ఈ నిల్వలను వెలికితీస్తే అనేక దశాబ్దాలపాటు అవసరాలు తీరగలవని పేర్కొన్నారు. అయితే దేశంలో బొగ్గు నిల్వలు విస్తృతంగా ఉన్నప్పటికీ మిథనాల్, అమ్మోనియా, ఎరువుల ఫీడ్‌స్టాక్ సహా అనేక కీలక పారిశ్రామిక రసాయనాల దిగుమతుల పరాధీనత ఇంకా తొలగలేదని చెప్పారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ హైదరాబాద్‌లో హెచ్ఐసిసిలో గురువారం బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై కీలక రోడ్‌షోను నిర్వహించింది. ఆ శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబేతో కలసి పాల్గొన్న కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ దిగుమతుల ఫలితంగా ఏటా గణనీయ స్థాయిలో విదేశీ మారక ద్రవ్యం వెచ్చించాల్సి వస్తోందన్నారు. దేశీయ బొగ్గును విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడం, ఇంధన భద్రతను బలోపేతం చేయడం, దిగుమతి పరాధీనతను తగ్గించడం, ఆర్థిక పునరుత్థానాన్ని ఇనుమడింపజేయడం తదితరాల దిశగా బొగ్గు గ్యాసిఫికేషన్ ఒక వ్యూహాత్మక మార్గం చూపుతుందని స్పష్టం చేశారు. భారత్ నేడు ప్రపంచంలో రెండో అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారుగానే కాకుండా, వినియోగదారుగానూ ఉందన్నారు. ఈ సమృద్ధ వనరును మరింత వివేచనతో వినియోగించుకోవాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. భారత ఇంధన పారిశ్రామిక భవిష్యత్తుకు బొగ్గు గ్యాసిఫికేషన్ ఒక పరిణామాత్మక అవకాశమని పేర్కొన్నారు. దేశంలోని సమృద్ధ బొగ్గు వనరులను కాలుష్య రహితంగా, విలువ ఆధారితంగా వినియోగించుకునే దిశగా బొగ్గు గ్యాసిఫికేషన్‌ను వేగిరపరచడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించిందన్నారు. ఉపరితల బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను ప్రోత్సహించడం కోసం రూ.46 వేల కోట్లతో సంయుక్త పథకాన్ని కేంద్ర మంత్రివర్గం మొత్తం ఆమోదించడమన్నది దేశ ఇంధన, పారిశ్రామిక ప్రస్థానంలో విప్లవాత్మకమైన ముందడుగు అని వ్యాఖ్యానించారు.

**విబి జి రాం జి పథకం కింద 125 రోజులు ఉపాధి తప్పనిసరిగా కల్పిస్తాం**

గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎలాంటి ఉపాధి పనులు దొరకని సమయంలో కూడా ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి సంవత్సరం వారికి తప్పనిసరిగా 125 రోజుల ఉపాధిని కల్పించాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ స్కీం(గ్రామీణ) విబి జి రాం జీ పథకాన్ని అమలు చేస్తున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వెల్లడించారు. గురువారం విబి జి రాం జి పథకాన్ని తెలంగాణలో అమలు చేయడంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో చర్చించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ ఈ పథకం కింద ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం గ్రామాలలో నివసిస్తున్న పేద ప్రజలకు గత 12 ఏళ్లుగా (2014-15 నుండి 2025-26 వరకు) 143.23 కోట్ల పని దినాలను కల్పించినట్లు, ఇందుకోసం మొత్తం రూ. 34,639.17 కోట్ల నిధులను ఖర్చు చేసినట్లు తెలియజేశారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026-27 కు కూడా తెలంగాణ గ్రామీణ ప్రజల కోసం 8.50 కోట్ల పనిదినాలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, జూన్ 9 నాటికి ఇందులో 4.38 కోట్ల పనిదినాలు పూర్తవగా, రూ. 1,163.64 కోట్ల నిధులను ఖర్చు చేసి 11,684 పనులను పూర్తి చేసినట్లు శివరాజ్ సింగ్ చౌహాన్ తెలియజేశారు. ఈ సమావేశం అనంతరం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఈ పథకం కింద గతంలో అందిస్తున్న 100 రోజుల ఉపాధిని 125 రోజులకు పెంచి గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత లబ్ధి చేకూర్చాలన్న ఉద్దేశ్యంతో అవసరమైన మార్పులు చేసి, వికసిత భారత్ దృష్టిలో భాగంగా మోడీ ప్రభుత్వం ఈ పథకాన్ని తెచ్చిందన్నారు. జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా అమలులోకి రానున్న ఈ పథకం కింద 2026-27 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ రాష్ట్రానికి రూ. 3,825.31 కోట్ల నిధులను కేటాయించినట్లు శివరాజ్ సింగ్ చౌహాన్ తెలియజేశారన్నారు.

## హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 మంజూరు చేయండి

### కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సిఎం రేవంత్‌రెడ్డి వినతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 10:** హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2కు సత్వరమే అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి ఖట్టర్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం సమావేశమయ్యారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో ఫేజ్2 అవసరం ఎంతో ఉందని సీఎం కేంద్ర మంత్రికి తెలియజేశారు. మెట్రో ఫేజ్2 సాకారమైతే నగరంలో రాకపోకలు వేగంగా సాగడంతో పాటు రహదారులపై రద్దీ తగ్గుతుందని.. సుస్థిరాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి ఖట్టర్‌కు తెలిపారు. పట్టణ వ్యవహారాల శాఖ సూచన మేరకు అవసరమైన సవరణలు చేసి ప్రాజెక్టు డీపీఆర్ సమర్పించిన విషయాన్ని కేంద్ర మంత్రికి సీఎం గుర్తు చేశారు.హైదరాబాద్ మెట్రో ఫేజ్2 ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకొని ఇతర శాఖల నుంచి అవసరమైన అనుమతులు ఇప్పించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రితో జరిగిన సమావేశంలో సీఎం వెంట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి మాణిక్‌రాజ్, ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, స్పెషల్ సెక్రటరీ (కోఆర్డినేషన్) అద్వైత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## హాకీంపేట్ భూముల ఇ-వేలం వాయిదా: హెచ్ఎండిఎ

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** హాకీంపేట్‌లోని విలువైన భూముల విక్రయానికి సంబంధించి నిర్వహించనున్న ఈ వేలం షెడ్యూల్‌ను సవరిస్తున్నట్లు హెచ్ఎండిఎ ప్రకటించింది. పరిపాలనా కారణాల దృష్ట్యా ముందుగా ప్రకటించిన ప్రీబిడ్ సమావేశం, ఈవేలం తేదీలు మార్చినట్లు వెల్లడించారు. హాకీంపేట్ గ్రామం, షేక్‌పేట్ మండల పరిధిలోని సర్వే నంబర్ 102/1, టి.ఎస్. నంబర్లు 1/పీ, 3/పీ పరిధిలో ఉన్న బంజారాహిల్స్ సమీప భూభాగాన్ని విక్రయించేందుకు ఈ వేలం నోటిఫికేషన్ జారీ అయిందని,. ఈ భూమి విస్తీర్ణం 8 ఎకరాలు 24 గుంటలుగా ఉంది. ముందుగా ప్రీబిడ్ సమావేశాన్ని జూన్ 12న, ఈ వేలాన్ని జూన్ 19న నిర్వహించాలని నిర్ణయించబడింది. అయితే పరిపాలనా కారణాల వల్ల ఈ కార్యక్రమాల తేదీలు మార్చడం జరిగిందని హెచ్ఎండిఎ ప్రకటించింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం ప్రీబిడ్ సమావేశం జూన్ 19న, ఈ వేలాన్ని జూలై 2న నిర్వహించబడతాయని తెలిపారు. ఈ వేలంలో పాల్గొనదలచిన పెట్టుబడి దారులు, ప్రతినిధులు, ఇతర భాగస్వాములు కొత్త తేదీలను గమనించి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని హెచ్ఎండిఎ కోరింది.

## ప్రభుత్వ సలదాహాదారు విహెచ్‌కు తెలంగాణ కాచి సంఘ్ వినతి

## నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలపై చర్యలు తీసుకోవాలి

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ మండలం తహసీల్దార్ కార్యాలయం ద్వారా అక్రమంగా జారీ చేసిన నకిలీ వెనుకబడిన తరగతుల కుల ధృవీకరణ పత్రాలను తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ కాచి సంఘ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం తెలంగాణ ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ, అభివృద్ధి సలహాదారులు, మాజీ ఎంపీ వి. హనుమంత రావుకు సంఘం ప్రతినిధులు ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ కాచి సంఘ్ అధ్యక్షుడు ఎస్. బల్వీర్ సింగ్ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలంలో కొంతమంది వ్యక్తులు ఒక మోసపూరిత సంఘం ద్వారా తప్పుడు సమాచారం అందించి ఖికాచిఖి మరియు ఖికుస్వాహాఖి కులాలను ఒకటిగా చిత్రీకరించారని మండిపడ్డారు.

ఈ తప్పుడు ప్రాతిపదికన వారు అక్రమంగా బీసీ కుల ధృవీకరణ పత్రాలను పొందారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ బీసీ జాబితాలో గ్రూప్‌డి కింద సీరియల్ నంబర్ 13లో ఖికాచిఖి సంఘం గుర్తించబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. రిజర్వేషన్ల వ్యవస్థ యొక్క సమగ్రతను కాపాడటానికి, అర్హులకు న్యాయం చేయడానికి ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. మోసపూరితంగా సర్టిఫికెట్లు పొందిన దరఖాస్తుదారులపై, వారికి సహకరించిన సదరు సొసైటీ నిర్వాహకులపై కఠినమైన చట్టపరమైన మరియు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో డిమాండ్ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మహిళ

### 35 నిమిషాలపాటు రోడ్డుపైనే శవం

**హైదరాబాద్ (శేరిలింగంపల్లి), జూన్ 11, ప్రభాతవార్త:** ఓ మహిళ రోడ్డుప్రమా దంలో నడిరోడ్డుపైనే ప్రాణాలు కోల్పోతే.. ఆమె మృతదేహాన్ని చూస్తూ కూడా ఏ మనిషి స్పందించలేదు. కనీసం అధికారులైనా వస్తారనుకుంటే పట్టిం చుకున్న పాపానపోలేదు. 35 నిమిషాలపాటు ఓ మహిళ అనాథశవంలా రోడ్డుపైనే పడిఉంది. ఈ ఘటనపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హృదయ విదారక ఘటన శేరిలింగంపల్లి మదీనాగూడలో చోటుచేసుకుంది. శేరిలింగంపల్లి మదీనాగూడ ప్రధాన రహదారిపై ఒక్కసారిగా పెద్దశబ్ధం. అంతలోనే హాహాకారాలు. రోడ్డుప్రమాదంలో తీవ్రగాయాలపాలై రక్తపు మడుగులో మహిళ కొట్టుమిట్టాడుతుంది. క్షణాల వ్యవదిలోనే రక్తపు మడుగులో ప్రాణాలు విడిచింది. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ వందలమంది జనం గుమిగూడినా చోద్యం చూస్తూ ఉన్నారే కాని ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేయలేదు. ఆ మహిళ మృతదేహం సుమారు 35 నిముషాల పాటు మండుతున్న ఎండలో, నడిరోడ్డుపైనే ఉంది. రోడ్డుపైనే దిక్కుతోచని స్థితిలో శవాన్ని చూసిన నెటిజన్లు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## మీనాక్షి నటరాజన్ పిటిషన్‌పై నేడు సుప్రీంలో విచారణ

**హైదరాబాద్, జూన్11,ప్రభాతవార్త:** రాజ్యసభ ఎన్నికల కోసం ఎఐసిసి తెలంగాణ రాష్ట్ర పరిశీలకురాలు మీనాక్షినటరాజన్ మధ్యప్రదేశ్ నుంచి వేసిన నామినేషన్ తిరస్కరణ విషయమై సుప్రీంకోర్టులో కాంగ్రెస్ వేసిన వాజ్యంను సుప్రీంకోర్టు విచారణకు అంగీకరించడమే కాకుండా శుక్రవారం విచారణ చేపట్టనుంది. ఎఐసిసి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు అంగీకరించినప్పటికి ఈ పిటిషన్ పై తక్షణ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు సుప్రీం నిరాకరించింది.

## ఎస్సీ గురుకుల డిగ్రీ కాలేజీ అధ్యాపకులకు యుజిసి స్కేలు

### న్యాక్ గుర్తింపు కోసం ప్రత్యేక కమిటీలు..

### మరో 9 సిఒఇల ఏర్పాటు

### 133 సొంత భవనాల నిర్మాణానికి అనుమతి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** ఎస్సీ గురుకులాల అభివృద్ధికి విప్లవాత్మక చర్యలు తీసుకోనున్నట్టు సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఎస్సీ గురుకుల డిగ్రీ కాలేజీల్లో బోధిస్తున్న అధ్యాపకులకు యుజీసీ పే స్కేల్‌ను అమలు చేయనున్నారు. డిగ్రీ కాలేజీలకు న్యాక్ గుర్తింపు కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నారు. 9వ తరగతి నుంచే విద్యార్థులకు నీట్, జేఈఈ, ఎప్‌సెట్ వంటి పోటీ పరీక్షల్లో శిక్షణ ఇవ్వడం కోసం మరో 9 సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్సీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు మంత్రి తెలిపారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్) మూడవ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశం గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాల యంలోని మంత్రి ఛాంబర్‌లో అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధ్యక్షతన జరిగింది. 2017 తరువాత 3వ గర్నరింగ్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భం గా విద్యా ప్రమా ణాల పెంపు, విద్యార్థుల సంక్షేమం, మౌలిక వస తుల అభివృద్ధి, డిజిటల్ విద్య, ఉపాధ్యా య సంక్షేమం, ఉన్నత విద్య అవకాశాల విస్తరణకు సంబంధించి పలు కీలక నిర్ణయాలను బోర్డు ఆమోదించింది. సామాజి కంగా వెనుకబడిన వర్గాల విద్యా ర్థులకు నాణ్యమైన, ప్రపంచ స్థాయి విద్య అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యను సామాజిక మార్పుకు ప్రధాన ఆయుధంగా భావిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణానికి ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. డిగ్రీ కళాశాలల నిర్వహణ కోసం ప్రత్యేక పరిపాలనా విభాగాన్ని ఏర్పాటు చేయాలని, డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు యూజీసీ వేతన స్కేలు అమలుపై సానుకూల నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. డిగ్రీ కళాశాలలకు న్యాక్ గుర్తింపు సాధించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ఉన్నత విద్య కోసం దేశ, విదేశీ విశ్వవిద్యాలయాలకు వెళ్లే ఎస్సీ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ఆర్థిక సహాయం అందించేందుకు ఆమోదం తెలిపారు. 9వ తరగతి నుంచే నీట్, జేఈఈ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసేందుకు మరో 9 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)లను ప్రారంభించాలని నిర్ణచించారు.

## అధికారంలోకి వచ్చాక మేం ఫ్యూచర్‌సిటీని వందకు వంద శాతం రద్దు చేస్తాం

### పనిచేయని సిఎంకు ఇన్ని క్యాంపు కార్యాలయాలు ఎందుకు?: మాజీ మంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 10:** అధికారంలోకి వచ్చాక ఫ్యూచర్ సిటీని వందకు వంద శాతం బిఆర్ఎస్ రద్దు చేస్తుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నిర్వాకం వల్ల రూ.70వేల కోట్ల ఫార్మా పెట్టుబడులు పోయాయని పేర్కొన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఫార్మా సిటీ రద్దు చేసి భూములు వెనక్కి ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, భూములు ఫార్మాకు కాకుండా మార్పులు చేస్తే చట్టం అంగీకరించదన్నారు. ఫార్మాసిటీ కోసం నేను కూడా 17 ఎకరాల భూమి ఇచ్చాను, ఆ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం వాడితే ఊరుకుంటామా? ఇప్పటికే పలువురు రైతులు ఈ భూములపై కేసులు వేశారన్నారు. జర్నలిస్టులపై ప్రేమ ఉంటే వివాదాలు లేని భూములు ఇవ్వొచ్చు కదా అని పేర్కొన్నారు. ఒకవేళ ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చినా మేం వ్యతిరేకించం, పాత భూములనే వారికి ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు.

## ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

**హైదరాబాద్, జూన్ 11,ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను ఇంటర్ బోర్డు గురువారం ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. ఉదయం 11.30 గంటలకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను ఇంటర్ బోర్డు విడుదల చేసింది. ఇంటర్ మొదటి సంవత్సరంలో జనరల్, ఒకేషనల్ విద్యార్థుల్లో 68.84 శాతం ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 49.29 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ పరీక్షలకు 3,98,459 మంది హాజరయ్యారు. వారి కోసం రాష్ట్ర వ్యాప్తంగా మే 13 నుంచి 21 వరకు 889 పరీక్షా కేంద్రాలను ఇంటర్ బోర్డు ఏర్పాటు చేసింది. పరీక్షలు ముగిసిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా 17 కేంద్రాల్లో మూల్యాంకనం ప్రక్రియను కొనసాగించారు. మొదటి సంవత్సరంలో 2,67,331 మంది పరీక్షలకు హాజరు కాగా వారిలో 1,84,042 మంది పాసయ్యారు. మొదటి సంవత్సరంలో 1,22,964 మంది ఇంప్రూవ్‌మెంట్‌కు హాజరయ్యారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో బాలురు 62.57 శాతం పాస్ కాగా, బాలికలు 76.10 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో నలుగురు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్ కేసుల్లో పట్టుబడ్డట్టు ఇంటర్‌బోర్డు ప్రకటించింది. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు సంబంధించిన 1,31,128 మంది హాజరు కాగా వారిలో 64,639 మంది ఉత్తీర్ణత సాధించారు. వారిలో బాలురు 47.45 శాతం, బాలికలు 52.56 శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులు రీకౌంటింగ్ కోసం రూ. 100 చెల్లించి ఈ నెల 12 నుంచి 18 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవల్సి ఉంటుంది.

# రాష్ట్రంలో కాక్రోచ్ రాజకీయం.. మేము కూడా అంటూ మాజీ సిఎం జగన్ ప్రకటన

**విజయవాడ జూన్ 11 ప్రభాతవార్త ప్రతినిది:** దేశవ్యాప్తంగా కాక్రోచ్ పార్టీ సంచలనం సృష్టించింది.. కేంద్రప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ఈ పార్టీ చేసిన రచ్చ అంతా ఇంత కాదు. ఆఖరికి కాక్రెచ్ పార్టీ అఫీషియల్ ట్విట్టర్ సైతం బ్యాన్ వరకూ వెళ్లింది. అయినా సరే వేరే నేమ్‌తో మళ్లీ తన పోస్టులను కాక్రోచ్ పార్టీ కొనసాగించింది. ఇదిలా ఉంటే కాక్రోచ్ రాజకీయం ఏపీని కూడా తాకింది. కాక్రోచ్ పార్టీపై స్పందించాలంటూ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిని అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పారు. రాష్ట్రంలో తామే కాక్రోచ్ అనిఅన్నారు. తప్పు ఒప్పుకోకుండా ప్రశ్నించిన వారిని ఇబ్బంది పెడితే కాక్రోచ్‌లు లేస్తాయని ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాదు ఈ విషయాన్ని చంద్రబాబు గుర్తు పెట్టుకోవాలంటూ హెచ్చరించారు.



## శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాజస్థాన్ మంత్రి

**శ్రీకాళహస్తి,జూన్ 11 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వ రాలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించు కున్నారు. గురువారం రాజస్థాన్‌కు చెందిన వాటర్ రిసోర్సస్ శాఖ మంత్రి సురేష్ సింగ్ రావత్ కుటుంబసభ్యులతో ఆలయానికి వచ్చారు. వారికి దక్షిణ గోపురం వద్ద వేద పండితులతో ఆలయ ఇఒ బికె వెంకటేశులు ,ప్రోటోకాల్ ఎఇఒ లోకేష్‌బాబు ఎపిఆర్ఓ రవిలు స్వాగతం పలికారు. ఆలయంలోని సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద వారికి రాహుకేతుదోష నివారణ పూజలు ప్రత్యేక వేదపండితులతో ఏర్పాటు చేసారు. ఉత్తర భారత దేశంలో ఇ లాంటి ఆలయం లేదని ఈ ఆలయంలో శిల్ప, నిర్వహణ చక్కగా ఉందని మంత్రి ప్రసంశించారు.ఆలయ చరిత్ర గురించి మంత్రికి ఆలయ ఇఒ బికె వెంకటేశులు వివరించారు. స్వామిఅ మ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.స్వామి అమ్మవార్ల చిత్రపటాలను,తీర్థ ప్రసాదాలను అందించారు. ఏర్పాట్లును ఆలయ ఇన్స్ పెక్టర్ హరియాదవ్, ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డిలు పర్యవేక్షించారు.

## స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

**విజయవాడ,జూన్ 11, ప్రభాతవార్తప్రతినిధి:** స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. 419 స్టాఫ్ నర్సుల పోస్టులను భర్తీ చేయనుంది. 110 మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్, ఫార్మసిస్టుల పోస్టులకు కూడా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్టులను ఒప్పంద విధానంలో భర్తీ చేయనున్నట్లు విడుదల చేసిన నోటిఫికేషన్‌లో వైద్య ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది.జూన్ 13వ తేదీ నుంచి దరఖాస్తు చేసు కోవచ్చని అర్హులైన అభ్యర్థులకు సూచించింది. జూన్ 30వ తేదీ దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ అని ప్రకటించింది. ఈ స్టాఫ్ నర్సుల పోస్టులను పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వా సుపత్రుల్లో ఎన్సీడీ క్లినిక్‌లు, న్యూట్రిషన్ రికవరీ సెంటర్లు, నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్లతోపాటు వివిధ విభాగాల్లో భర్తీ చేయనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ వివరించింది.

## కొండవీటివాగు, పాలవాగులలో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించిన ఎడిసి చైర్‌పర్సన్

**విజయవాడ,జూన్ 11,ప్రభాతవార్తప్రతినిధి:**రాజధానిలో కొండవీటివాగు, పాలవాగు అభివృద్ధి పనులకు ఎక్కడా అవాంతరాలు లేకుండా చర్యలు చేపట్టాలని అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీపార్థసారథి వారు అధికారులను ఆదేశించారు. వర్షాల దృష్ట్యా గురువారం రాజధాని అమరావతిలోని కొండవీటివాగు, పాలవాగులలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. గత తనిఖీలలో సూచించిన విధంగా వరద నియంత్రణ పనులకు సబంధిత ప్రదేశాలలో సమీక్షించారు. రాయపూడి నుంచి వెంకటపాలెం వరకు పాలవాగులో నీటి పారుదలకు గల అడ్డంకుల తొలగింపులను పరిశీలించారు. అదేవిధంగా కొండవీటివాగులో ఈ 11 రోడ్డు వెస్ట్‌బైపాస్ జంక్షన్ వద్ద ఎదురు ప్రవాహం, దిగువ ప్రవాహాల వద్ద చురుగ్గా జరుగుతున్న పనులను పరిశీలించారు. ముఖ్యంగా వెస్ట్‌బైపాస్ వద్ద రెండు వాగులు దాటే ప్రదేశాలలో అవసరమైన చోట చైన్‌మిషన్లను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసి అడ్డంకులను తొలగించాలని ఆదేశించారు. ఈ 4, ఈ 10, ఈ 11, ఈ 12 వెస్ట్‌బైపాస్ బ్రిడ్జిల వద్ద వాగుల ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఇంజినీరింగ్ అధికారులను ఖచ్చితమైన ఆదేశాలు జారీచేశారు.

# రాజ్యసభకు నలుగురూ ఏకగ్రీవం

### ధ్రువీకరణ పత్రాలు అందచేసిన ఎన్నికల అధికారి



**విజయవాడ,జూన్ 11, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యులుగా సానా సతీశ్ , చింతకాయల విజయ్, భాష్యం రామకృష్ణ, లింగమనేని రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ఉపసంహారణ గడువు ముగియడంతో నలుగురూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈసీ ధ్రువీ కరించింది. నాలుగు ఖాళీలకు నాలుగు నామినేషన్లే దాఖలు కావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించింది. అనంతరం ఎన్నికైన సభ్యులకు ధ్రువపత్రాలు జారీ చేసింది. రాష్ట్రం నుంచి నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీకాగా ముగ్గురు టీడీపీ తరఫున, ఒకరు జనసేన తరఫున ఎన్నికయ్యారు. ఏపీ నుంచి ఖాళీ అయిన 4 రాజ్యసభ స్థానాలకు కూటమి ఒప్పందం మేరకు 4 రాజ్యసభ స్థానాల్లో 1 జనసేన, 3 టీడీపీకి ఖరారయ్యాయి.రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ గడువు సోమవారంతో ముగిసింది. మంగళవారం నామినేషన్ల పరిశీలన, బుధవారం ఉపసంహారణకు చివరి తేదిగా గడువు పెట్టారు. చివరికి నాలుగు ఖాళీలకు నాలుగు నామినేషన్లే దాఖలవడంతో గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈసీ ప్రకటించింది.

అభ్యర్థుల ఎంపికను అధికారికంగా ప్రకటించిన రిటర్నింగ్ అధికారిణి వనితాకుమారిన నేరుగా ఎంపీ ఎన్నిల దృవీకరణ పత్రాలను టీడీపీ అభ్యర్ధు చింత కాయల విజయ్, భాష్యం రామకృష్ణకు అందించారు.

టీడీపీ అభ్యర్ది సానా సతీష్, జనసేన అభ్యర్ది లింగమనేని రమేష్‌ల ఎంపిక దృవీకరణ పత్రాలను వారి ప్రతినిధులు అందుకున్నారు.

# విజయవంతంగా 'యోగ - టిటిడి ఆరోగ్యానంద'

**తిరుమల,జూన్ 11ప్రభాతవార్తప్రతినిధి:** అంతర్జాతీయ యోగ దినోత్సవానికి టిటిడి భారీ ఏర్పాట్లు చేస్తోంది. 17 కేంద్రాల్లో ప్రతిరోజూ యోగాభ్యాసం: చేయిస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం, ఉద్యోగుల్లో శారీరకమానసిక దృఢత్వం పెంపొందించాలనే లక్ష్యంతో టిటిడి నిర్వహిస్తున్న "యోగ-టిటిడి ఆరోగ్యానంద" కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. జూన్ 7 నుండి 21వ తేదీ వరకు జరుగుతున్న ఈ ప్రత్యేక యోగ శిక్షణలో టిటిడి ఉద్యోగులు, విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొంటూ యోగాసనాలను అభ్యసిస్తున్నారు. 14 రోజుల పాటు యోగ శిక్షణ టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర ఆదేశాల మేరకు ఉద్యోగులు, విద్యార్థులు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవడంతో పాటు కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు దోహదపడేలా 14 రోజులపాటు ప్రతిరోజూ గంటసేపు యోగాభ్యాసాన్ని నిర్వహిస్తున్నారు. టిటిడి జెఇఒ డాక్టర్ ఎ. శరత్ పర్యవేక్షణలో తిరుపతిలోని 17 కేంద్రాల్లో యోగ శిక్షణ కొనసాగుతోంది. పరిపాలనా భవనం, ఎస్వీ ఆయుర్వేద కళాశాల, స్విమ్స్, బర్డ్ క్యాంపస్, శ్వేత క్యాంపస్, ఎస్వీ సంగీత నృత్య కళాశాల, గోవిందరాజస్వామి ఆలయం, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల, ఎస్వీడబ్ల్యూ డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలలు, ఎస్వీ జూనియర్ కళాశాల, కోదండరామస్వామి హైస్కూల్, ఎస్వీ బాలికల ఉన్నతపాఠశాల, వినాయకనగర్, గోవిందరాజనగర్, ఎల్.ఎస్. నగర్ క్వార్టర్స్ ప్రాంతాల్లో ప్రతిరోజూ యోగాభ్యాసం నిర్వహిస్తున్నారు. యోగతో మానసిక ప్రశాంతత - శారీరక దృఢత్వం నిత్య యోగాభ్యాసం ద్వారా ఉద్యోగులు మానసిక ఒత్తిడిని అధిగమించి భక్తులకు మరింత సమర్థవంతంగా సేవలందించగలరని టిటిడి భావిస్తోంది. యోగ సాధన శారీరక దృఢత్వం, మానసిక వికాసం, ఏకాగ్రత, అంతర్గత చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు కుటుంబ సభ్యుల ఆరోగ్య సంరక్షణకు కూడా ఎంతో దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 7న తిరుపతి మహతి ఆడిటోరియంలో "యోగ-టిటిడి ఆరోగ్యానంద" కార్యక్రమాన్ని ప్రారంభించారు. జూన్ 18, 19, 20 తేదీలలో యోగ పోటీలను నిర్వహించనుండగా, జూన్ 21న టిటిడి పరిపాలనా భవనంలోని పరేడ్ గ్రౌండ్‌లో అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలను భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.







సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

# ఎక్సైజ్, మైనింగ్ రంగాల్లో పారదర్శకతకు ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి కొల్లు రవీంద్ర

**మదనపల్లె, జూన్ 11 ప్రభాతవార్త :** ఎక్సైజ్ మైనింగ్ రంగాల్లో పారదర్శకత సంస్కరణలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గనుల, భూగర్భ,ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లెకు వచ్చిన సందర్భంగా కలెక్టరేట్‌లో అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి ఉమ్మడి జిల్లాల ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులతో సమీక్ష సమావేవం నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు సంబందించిన ఎక్సైజ్ అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించి, ప్రస్తుత పరిస్థితులపై చర్చించినట్లు తెలిపారు. ఈ శాఖలో గతంలో నెలకొన్న పరిస్తితులను సరిదిద్దుతూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. మద్యం విక్రయాల్లో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడంతో ప్రసుత్తం 60నుండి 70శాతం వరకు డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయని వాటిని వందశాతానికి పెంచే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. అక్రమ మద్యం విక్రయాలు, బెల్టుషాపులు, గంజాయి రవాణా వంటి అంశాలపై కఠినచర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వారిపై అవసరమైన పీడి యాక్టు పెట్టి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మద్యం ఎంఆర్‌పి ధరలు ఉల్లంఘనలు, విక్రయ సమయాలు అమలు తదితర అంశాలపై పర్యవేక్షణను కొనసాగించాలన్నారు. విధి నిర్వహణలో ఎక్సైజ్‌శాఖ ఉద్యోగి మరణిస్తే రూ.5లక్షలు, ప్రభుత్వ తరపున మరో రూ.5లక్షలు మొత్తం రూ.10లక్షలు ఆర్థికసాయం అందజేశామని తెలిపారు. ఆయన భార్యకు ఉద్యోగం కల్పిస్తామన్నారు. మదనపల్లె వైట్ ఇస్కాన్ వైట్, కలర్ గ్రానైట్ వంటి ఖనిజాలకు డిమాండ్ ఉందన్నారు. ఖనిజ తవ్వకాలలో భద్రతా ప్రమాణాలు, నిబంధనలు అమలను పరిశీలించేందుకు క్వారీలను సందర్శిస్తున్నామని తెలిపారు. ఎక్కడైన అవకతవకలు జరిగిప విజిలెన్స్ తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఖనిజ సంపదను సమర్థవంతంగా వినియోగించి వాల్యూ అడిషన్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఖనిజ వనరులను సద్వినియోగంచేసుకుంటూ ఆదాయం పెంచే దిశగా ప్రభుత్వం ముండుదకు సాగుతోందన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, ఎక్సైజ్‌శాఖ అధికారులు, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు, ఇతర అదికారులు పాల్గొన్నారు.

# గుమ్మడి గోపాలకృష్ణకు కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం

### సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, మంత్రుల అభినందన

**విజయవాడ,జూన్ 11,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్, ప్రముఖ రంగస్థల నటుడు కళారత్న గుమ్మడి గోపాలకృష్ణకు కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు లభించిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆయనకు " ఎక్స్ " వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు రంగస్థల ఖ్యాతిని విశ్వవిఖ్యాతం చేసిన గుమ్మడి నటన అపూర్వమన్నారు.పద్యనాటకాల్లో శ్రీకృష్ణునిగా, శ్రీనాధునిగా, హరిశ్చంద్రునిగా ఆయన నటన,గానం మరువలేని వన్నారు. డీసీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్‌లు గుమ్మడికి అభినందనలు తెలిపారు. పద్య నాటక గానగంధర్వుడిగా ప్రసిద్ధి చెందారు. ఆయన కృష్ణా జిల్లా మేడూరు గ్రామంలో 1955లో జన్మించారు. మచిలీపట్నంలో ప్రాథమిక విద్యను అభ్యసించారు..1982లో ప్రముఖ నాటకకర్త ఆచంట వెంకటరత్నం నాయుడు మేడూరులో నాటకం వేసేందుకు వచ్చారు. ఆ సందర్భంగా గోపాలకృష్ణను చూసి తన బృందంలో చేర్చుకుని, హార్మోనిస్ట్ చింతా ఆంజనేయులు వద్ద శిక్షణకు పంపారు. ఒకటి, రెండు నాటకాలు వేసిన తర్వాత కుటుంబ సభ్యులు, వారి కోరిక మేరకు ఉపాధి కోసం గోపాలకృష్ణ హైదరాబాద్ వెళ్లారు. అక్కడ ఓ హౌసింగ్ సొసైటీలో ఉద్యోగం చేస్తూనే, గురువు విద్వాన్ రామచంద్ర ప్రోత్సాహంతో మళ్లీ రంగస్థలంపై అడుగుపెట్టారు.గోపాలకృష్ణ పౌరాణిక, చారిత్రక నాటకాల్లో విభిన్న పాత్రలు పోషించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. శ్రీనాథ కవిరాజు పాత్రలో వందకు పైగా ప్రదర్శనలు ఇచ్చారుశ్రీకృష్ణ రాయబార్ంలో శ్రీకృష్ణుడిగా, శ్రీరాముడిగా, హరిశ్చంద్రుడిగా,"చింతామణి‌లో బిల్వమంగళుడిగా ఆయన నటనకు విశేష ఆదరణ లభించింది. 1983 నుంచి గోపాలకృష్ణ ప్రస్థానం మలుపు తిరిగింది. 1991లో తిరుపతి పరిషత్‌లో తొలిసారిగా ఉత్తమ నటుడి పురస్కారం అందుకున్నారు. 1999లో నంది నాటకోత్సవాల్లో ఉత్తమ నటుడిగా,"శ్రీనాథుడు్ నాటకానికి నంది అవార్డు పొందారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ పురస్కారంతోనూ సత్కరించింది."శ్రీనాథుడు్తో అమెరికా వరకు: 2003లో విజయనగరంలో ప్రదర్శించిన "శ్రీనాథుడు్ నాటకాన్ని వీక్షించిన అప్పాజోస్యుల ఫౌండేషన్ అమెరికాలో ప్రదర్శనలు ఏర్పాటు చేసింది. ఈ నాటకాన్ని డాక్టర్ సి.నారాయణరెడ్డి వీక్షించి గోపాలకృష్ణ నటనను అభినందించారు."శ్రీనాథుడు నాటకం వందకు పైగా ప్రదర్శనలు పూర్తిచేసుకుంది. 2024 డిసెంబర్ లో ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్‌గా రెండోసారి బాధ్యతలు చేపట్టిన గోపాలకృష్ణ, తెలుగు పద్య నాటకానికి పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేస్తున్నారు.

# రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో అన్నీ అక్రమాలే!



### - నేడు రాష్ట్రవ్యాప్తంగా వైసిపి నిరసన ర్యాలీలు :మాజీ సిఎం వైఎస్ జగన్

**విజయవాడ,జూన్ 11, ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో ఎన్నో అక్రమాలు జరిగాయని, చంద్రబాబు ప్రభుత్వం రెండేళ్ళలో అనేక అవకతవకలకు పాల్పడగిందని వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోపించారు.చంద్రబాబు రెండేళ్ల వెన్నుపోటు పాలనపై నిరసనగా రేపు రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ స్థాయిలో వైసిపి ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. డీఎస్సీ అవకతవకల అంశంపై గురువారం తాడేపల్లిలోని పార్టీ కేం ద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ . పేపర్ లీకుల్లో చంద్రబాబుదే రికార్డు అని చెప్పారు. డీఎస్సీ పరీక్షల పేరుతో చంద్రబాబు, మంత్రి లోకేష్ కలిసి అక్రమాలకు పాల్పడ్డారనీ, తప్పులను ఎత్తిచూపుతుంటే చంద్రబాబుకు నరాలు తెగిపోయేంత బీపీ వస్తోందని ఎద్దేవా చేశారు. ఇది జెన్‌జీ కాలం.. దేన్నీ చంద్రబాబు ఆపలేరనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. చంద్రబాబు రెండేళ్ల వెన్నుపోటు పాలనపై నిరసనగా రేపు రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ స్థాయిలో వైసిపి అధ్వర్యంలో ర్యాలీలు నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. డీఎస్సీ విషయంలో ఇవాళ వెలుగులోకి వస్తున్న విషయాలన్నీ చూస్తుంటే ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయన్నారు. లక్షల మంది అభ్యర్థుల నమ్మకాన్ని చంద్రబాబు ప్రభుత్వం వమ్ము చేసిందని మండిపడ్డారు. డీఎస్సీ అంటే లక్షల మంది యువత ఆశ. వారి భవిష్యత్తు అని, అలాంటి ఉద్యోగ నియామక ప్రక్రియలో కూడా అవినీతి, అక్రమాలకు పాల్పడటం అత్యంత దారుణమన్నారు. 16వేల పోస్టులకే ఇన్ని స్కామ్‌లు, లీకులు కనిపిస్తున్నాయన్నారు. మెగా డీఎస్సీ అనడానికి అర్హత లేదు.. అని చెప్పారు. తమ ప్రభుత్వంలో ఒకే సమయంలో ఒకే నోటిఫికేషన్ ఇచ్చామని జగన్ చెప్పారు. 1లక్షా 30 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేశామన్నారు. 2019 మే 30న సిఎంగా ప్రమాణం చేసిన 50 రోజుల్లోనే ఇచ్చామని తెలిపారు. 19 లక్షల మంది పరీక్షలు రాస్తే ఒక్క తప్పు కూడా జరగలేదు అని అన్నారు. నాలుగు నెలల్లోనే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ భర్తీ పూర్తి చేశామన్నారు. ఇప్పుడు మాత్రం డీఎస్సీ పేరుతో అభ్యర్థులకు ఆవేదన మిగిల్చారు అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనంతా దగా, మోసం, అబద్ధాలు, స్కాములతోనే సాగుతోందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరీక్షలను "మెగా డీఎస్సీ అనడానికి వీలు లేదన్నారు. ప్రస్తుత డీఎస్సీలో జరిగిన అవకతవకలు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయని జగన్ పేర్కొన్నారు. కేవలం 16 వేల పోస్టుల భర్తీకే ఎన్నో అక్రమాలు, లీకులు, స్కాములు కనిపిస్తున్నాయని ఆరోపించారు. డీఎస్సీ ప్రశ్నాపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ బాధ్యతలను నిబంధనలకు విరుద్ధంగా పూర్తిగా ఎస్‌సిఇఆర్‌టీఅప్పగించారని మండిపడ్డారు. అత్యంత రహస్యంగా జరగాల్సిన ప్రశ్నాపత్రాల తయారీ, వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే కీలకమైన పనులను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో చేయించారని దుయ్యబట్టారు. రేపు ఏదైనా తప్పు బయటపడితే ఆ నెపాన్ని సులువుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై నెట్టేయవచ్చనే కుట్రతోనే ఇలా చేశారని విమర్శించారు.

# భవిష్యత్ వైద్య విధానాల్లో క్వాంటం బయాలజీ కీలకం

### - ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విసి డాక్టర్ పులాల చంద్రశేఖర్ - వైద్య విద్యా ప్రణాళికలో క్వాంటం బయాలజీని చేర్చేలా ఎన్ఎంసికి ప్రతిపాదనలు - డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల రూపకల్పనపై పై దృష్టి

**విజయవాడ,జూన్ 11,ప్రభాతవార్తప్రతినిధి:** వైద్య పరిశోధనలు, చికిత్సా విధానాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా రాబోయే రోజుల్లో క్వాంటం బయాలజీ కీలకపాత్ర పోషించనుందని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ పులాల చంద్రశేఖర్ స్పష్టం చేశారు. క్వాంటం బయాలజీ అనేది వైద్యం, రోగ నిర్ధారణ మరియు బయోమెడికల్ పరిశోధనలలో విప్లవాత్మక మార్పులు తీసుకురాగల అభివృద్ధి చెందుతున్న రంగమని ఆయన పేర్కొన్నారు.డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గురువారం "క్వాంటం బయాలజీ: అణువుల నుండి వైద్యం వరకు" అనే అంశంపై వెబెక్స్ ద్వారా ప్రతిష్ఠాత్మక ఈ వెబ్ నార్ సెమినార్‌ను ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి ప్రద్యుమ్న సూచనల మేరకు నిర్వహించామని, ఇందులో ప్రద్యుమ్న తమ అమూల్యమైన సలహాలు క్వాంటం ప్రాముఖ్యతలను అందించారన్నారు. క్వాంటం బయాలజీకి సంబంధించిన డిప్లొమా మరియు సర్టిఫికేట్ కోర్సులను త్వరలో ప్రవేశపెట్టవలసిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే ఆరోగ్య సంరక్షణ విద్యను ప్రోత్సహించడానికి గాను, దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో క్వాంటం బయాలజీ విద్య, శిక్షణా మాడ్యూళ్లను పాఠ్యాంశాల్లో చేర్చేలా జాతీయ వైద్య కమిషన్ కు విశ్వవిద్యాలయం తరపున ప్రతిపాదనలు పంపుతామని ఆయన వెల్లడించారు. తమకు మరియు విశ్వవిద్యాలయానికి నిరంతరం మద్దతు ఇస్తూ, మార్గనిర్దేశం చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రికి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి మరియు ఆరోగ్య, విద్యా శాఖా కార్యదర్శులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. క్వాంటం సాంకేతికతతో ఆరోగ్య వ్యవస్థల బలోపేతం పై ముఖ్యమంత్రి కార్యదర్శి పి.ఎస్. ప్రద్యుమ్న ఈ సెమినార్‌కు ఆన్‌లైన్ ద్వారా హాజరయ్యాయారు. ఈ వెబ్ నార్ లో పి.ఎస్. ప్రద్యుమ్న ప్రారంభోపన్యాసం చేశారు. ఆరోగ్య సంరక్షణ, పరిశోధన మరియు ఆవిష్కరణల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో క్వాంటం సాంకేతికతల ప్రాముఖ్యతను గురించి ఆయన వివరించారు. ప్రజా ఆరోగ్య వ్యవస్థలలో క్వాంటం సైన్స్‌ను ప్రోత్సహించడానికి ప్రభుత్వ పరంగా చేపడుతున్న చర్యలను ఆయన వివరించారు.ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కె.ఎన్. సత్యనారాయణ ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ, ఆధునిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో క్వాంటం భౌతికశాస్త్రం యొక్క ఆవశ్యకతను మరియు దాని అనువర్తనాలను వివరించారు. అణువుల నుండి వైద్యం వరకు.. ఈ సెమినార్‌కు ఐఐటి ఢిల్లీ ఎయిమ్స్ ఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ ఆరత్ కల్రా ఖిరిసోర్స్ పర్సన్‌ఖిగా వ్యవహరించారు. ఆయన "క్వాంటం జీవశాస్త్రం: అణువుల నుండి వైద్యం వరకు" అనే అంశంపై సుదీర్ఘమైన, విపులమైన ఉపన్యాసం ఇచ్చారు. వైద్య, జీవశాస్త్ర రంగాలలో క్వాంటం బయాలజీ తీసుకువస్తున్న ఇటీవలి పురోగతులను ఆయన సోదాహరణంగా వివరించారు.

ఈ సెమినార్ ద్వారా జీవ ప్రక్రియలలో క్వాంటం దృగ్విషయాల పాత్రను వైద్య వర్గాలు అర్థం చేసుకోవడానికి ఒక అద్భుతమైన వేదిక లభించింది. అనుబంధ వైద్య కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపక సభ్యులు చురుకుగా పాల్గొని వక్తతో తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ టి. సాయి సుధీర్, పబ్లికేషన్స్ డైరెక్టర్ డాక్టర్ కె. సుధ, ఏక్యూవీ ) డైరెక్టర్ శ్రీధర్, మరియు తిశిళీతిబీశిది కార్యదర్శి శ్రీమతి సుమైలా సహా పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

# మీ అసహానం.. అతి స్పందన ఏంటి?

### బిజెపి నేతలపై వైఎస్ షర్మిల ఆగ్రహం

**విజయవాడ జూన్ 11 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిలకు రాజ్యసభ సీటుఇస్తున్నట్లు ప్రచారం జరిగింది. కర్ణాటక స్థానం నుంచి ఆమెను రాజ్యసభకు కాంగ్రెస్ అధిష్టానం పంపుతున్నట్లు వార్తలు విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి.చివరి క్షణంలో అది జరుగలేదు, అసలు ఆమెకు రాజ్యసభ ఇస్తున్నట్లు అధికారికంగా ప్రకటించకుండానే ప్రచారం జరిగిపోయిందంటూ షర్మిలకు రాజ్యసభ ఇవ్వకపోవడంపై బీజేపీ నేతలు విమర్శలు కురిపించారు. మీనాక్షి నటరాజన్ నామినేటర్ తిరస్కరణ బీజేపి కక్ష సాధింపు చర్య అంటూ వైఎస్ షర్మిల చేసిన వ్యాఖ్యలపై బీజేపి ఈ రకంగా స్పందించింది కాంగ్రెస్ అధిష్టానం షర్మిలకు రాజ్య సీటు ఇవ్వకపోవడంతోనే ఆ అసహనంలో షర్మిల వాస్తవాలను పూర్తి విస్మరించినట్టున్నారంటూ బీజేపి నేతలు అవహేళన చేసారు. దీనికి కౌంటర్‌గా వైఎస్ షర్మిల 'ఎక్స్' వేదికగా బీజేపీ నేతలపై మరోసారి మండిపడ్డారు. రాజ్యసభ సీటు మాట ఇచ్చిన వాళ్లకు, మాట తీసుకున్న వాళ్లకు మాత్రమే సంబంధించిన విషయం. మధ్యలో మీ అసహనం ఏంటి ? ఈ అతి స్పందన ఎందుకు? 12 ఏళ్ల వైఫల్యాలను ప్రజల ముందు పెడితే, సమాదానం చెప్పే దమ్ములేక, అర్థం పర్థం లేని అంశాలను మాట్లాడే మీ సంస్కారం ఏపాటితో అర్థమైంది. అంటూ ఆమె పేర్కొన్నారు. ప్రజా ఉద్యమ గొంతుకగా ఎవరిని ఆరాటమో ఎవరిది అసహనమో రాష్ట్ర ప్రజలకు అంతా తెలుసు. రాష్ట్ర అభివృద్ధికి అంకితభావం మాది. సహానాన్ని కోల్పోయి పిచ్చిప్రేలాపనలు మీవి. నిజంగా బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే పుండుమీద కారం చల్లే చేష్టలు బంద్‌పెట్టి, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన లేవనెత్తిన 12 వైఫల్యాల మీద సమాధానం చెప్పాలి. మీద మెరుగులు చూపించడం ఆపి లోపల పురుగుల సంగతి తేల్చాలి అని వైఎస్ షర్మిల సవాల్ విసిరారు.

# యోగాంధ్రలో భాగస్వాములు కావాలని అసోసియేషన్లకు పిలుపునిచ్చిన ప్రభుత్వం

**విజయవాడ,జూన్ 11,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వం ప్రతిష్టాకరంగా తీసుకున్న యోగాంధ్ర2026 కార్యక్రమాల నిర్వహణలో భాగస్వాములు కావాలని ప్రముఖ యోగా అసోస యేషన్లను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కోరింది. ప్రభుత్వ సంకల్పానికి తగ్గట్లు ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఈశా పౌండేషన్, పతంజలి భారత్ స్వాభిమాన్ ట్రస్టు, బ్రహ్మ కుమారీస్, యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, [illegible] ఇన్స్టిట్యూట్, భారత్ స్వాభిమాన్ ట్రస్టు/పతంజలి యోగా సమితి, హాబిల్డ్ (ఏఐ దెవలపర్స్), గిప్సి (ఏఐ డెవలపర్స్), యోగాంత స్టారప్ ఇతర సంస్థల ప్రతినిధులతో వర్చువల్ గా ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి ప్రద్యుమ్న, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్, ఆయుష్ డైరెక్టర్ రోణంగి గోపాల కృష్ణ ప్రభృతులు యోగా సంస్థల ప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ తామిచ్చే లాగిన్ల ద్వారా యోగాంధ్ర 2026 పోర్టలులో సదరు అసోసియేషన్లకు చెంది న వారి పేర్లను నమోదుచేసి, యోగా కార్యక్రమాల్లో భాగస్వాములు చేయాలని కోరారు. యోగాంధ్ర కార్యక్రమాలను జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్క రించుకుని మాత్రమే కాకుండా ఏడాది పొడవునా నిరాటంకంగా కొనసాగించే విషయమై సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. బ్రహ్మకుమారీలు యోగా కార్యక్రమాల్లో ధ్యానం చేయడాన్ని కూడా జోడించాలని కోరారు. గత ఏడాది 400కిపైగా గ్రామాల్లో ఉచిత శిక్షణ కార్యక్రమాలను జరిపామని, ఈ ఏడాది కూడా అదేవిధంగా చేస్తామని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు చెప్పారు.

# ఆ హోర్డింగ్‌తో సిఎంఆర్‌కు ఎలాంటి సంబంధం లేదు

**విశాఖపట్నం, ప్రభాతవార్త:** స్తోషల్ మీడియా వేదికలలో ఒక తప్పుడు, దురుద్దేశపూర్వకమైన పోస్ట్ లేదా స్క్రీన్‌షాట్ విస్తృతంగా ప్రచారంలో ఉన్నట్లు ప్రజల దృష్టికి తీసుకువస్తున్నామని ఆ చిత్రంలో ఒక హోర్డింగ్ కనిపిస్తుండగా, దాని కింద "హిందూ యువతి/మహిళతో కలిసి వచ్చే ముస్లిం పురుషుడికి 10 నుండి 50 వరకు తగ్గింపు లభిస్తుంది" అనే వాక్యం ఉందని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, భారతదేశంలోని ఇతర రాష్ట్రాల ప్రజలకు మేము తెలియజేయునది ఏమనగా, ఆ చిత్రంలో చూపిన విధంగా సిఎంఆర్ గ్రూప్ ఎప్పుడూ ఎటువంటి హోర్డింగ్‌ను ఏర్పాటు చేయలేదు లేదా అటువంటి ప్రకటనను విడుదల చేయలేదని గత 4 దశాబ్దాలకు పైగా అత్యంత ప్రతిష్టాత్మకంగా వ్యాపారాన్ని నిర్వహిస్తున్న మా సంస్థ, సమాజంలో మతపరమైన విభేదాలకు లేదా అశాంతికి దారితీసే ఇటువంటి ప్రకటనలను ఎప్పుడూ చేయలేదు, భవిష్యత్తులో కూడా చేయదు అని కాబట్టి, సిఎంఆర్ గ్రూప్ తరపున మేము ఈ తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ఇందుకు కారకులైన వారి మీద తగు క్రిమినల్ చర్యలు తీసుకోవలసిందిగా సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లోనూ, వివిధ జిల్లాల పోలీస్ స్టేషన్లలోనూ ఫిర్యాదు చేయడం కూడా జరిగిందనికావున, ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమేమిటంటే సోషల్ మీడియా వేదికలలో ఎవరికైనా ఇటువంటి తప్పుడు పోస్ట్‌లు కనిపిస్తే లేదా వస్తే, దయచేసి వాటిని ఇతరులకు షేర్ చేయవద్దని లేదా ప్రచారం చేయవద్దని ప్రజలను కోరుతూ... ఈ హెచ్చరికను గమనించిన తర్వాత కూడా వాటిని ప్రచారం చేస్తే తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవలసి వస్తుందని తెలియజేస్తున్నామన్నారు.

## నిద్రకీ, వయసుకు సంబంధం..



మనందరికీ తెలిసిన విషయం ఒకటుంది. మన అసలు వయసుకంటే మనకి మనం ఫీలవుతున్న వయసు వేరు అన్నది. దీన్నే సబ్జెక్టివ్ ఏజ్ అంటారు. నిత్యం ఉత్సాహంగా ఉండేవాళ్ళు 55 ఏళ్ళలో ఉన్నా 45లో ఉన్నట్టే ఫీలవుతారు. ఆ మాట బయటకు చెప్పకున్నా సరే. అదే ఎప్పుడూ డీలాగా ఉండేవారు 35 ఏళ్ళలోనూ తమకి తాము 40ల్లో ఉన్నట్టు భావిస్తారు. ఈ తేడా ఎందుకొస్తోంది? ఈ భావనకీ నిద్రకీ ఏదైనా సంబంధం ఉందా? అన్న సందేహం వచ్చింది. ఇటీవల స్వీడన్‌లోని కెరోలిన్‌స్కా వర్సిటీ పరిశోధకులకి. దానిపైన 186 మందితో అధ్యయనానికి నడుం బిగించారు. వాళ్లని రెండువారాలు తొమ్మిదిగంటలపాటు నిద్రపోమ్మన్నారు. అదయ్యాక- ఓ రెండురోజుల పాటు నాలుగంటలే నిద్రపోనిచ్చారు. ఆ రెండు సందర్భాల్లోనూ వాళ్ళ ఉత్సాహాన్నీ, చురుకుదనాన్నీ, తద్వారా వాళ్ల సబ్జెక్టివ్ ఏజ్‌నీ అంచనావేశారు. మొదటి రెండువారాలు కంటి నిండా నిద్రపోయినప్పుడు ప్రతిరోజూ తమ వయసు 0.23 ఏళ్లు (దాదాపు రెండున్నర నెలలు) తగ్గుతున్నట్టు ఫీలయ్యారట ఈ అధ్యయనంలో పాల్గొన్నవారు. అదే నిద్ర తగ్గినప్పుడు వయసు నాలుగున్నరేళ్ళు పెరిగినట్టు భావించారట. దీన్ని బట్టి నిద్రకీ సబ్జెక్టివ్ ఏజ్‌కీ చాలా దగ్గర సంబంధం ఉందని రూఢీ అయ్యిందంటున్నారు పరిశోధకులు.

## చేపల ఫ్రై రుచిగా..

ముందుగా చేప ముక్కలను 20 నిమి షాలు పాలలో నానబెట్టా, తర్వాత పాలు తీసేయాలి. ఇలా చేయడం వల్ల నీచు వాసన తగ్గడమే కాకుండా అదనపు రుచి వస్తుంది. చేపముక్కలకు మసాలా పట్టించేటప్పుడు కొద్దిగా శనగపిండి లేదా బియ్యప్పిండిని జోడిస్తే.. ఫ్రై కరకలడుతుంది. ఉల్లిపాయల్లో తగినంత తేమ ఉంటుంది కనుక మసాలా పేస్ట్‌ను గ్రైండ్ చేసేందుకు నీళ్ల అవసరం లేదు. దానికి బదులు చెంచా నిమ్మరసం ఉపయోగించవచ్చు. ఉల్లి, అల్లం, వెల్లుల్లి పేస్టు, పసుపు, కారం ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరం మసాలా, ఉప్పు కలిపి ముద్దలా చేయాలి. చేపముక్కలకి ఈ మిశ్రమాన్ని పట్టించి అరగంట ఫ్రిజ్‌లో పెట్టాలి. 4.ఫిష్ ఫ్రై యథాతథంగా చేపలతో చేయొద్దు,



చేపలను ముక్కలుగా కోసి చేస్తేనే భాగుంటుంది. దీనికి ఎక్కువ నూనె అవసరం లేదు. నూనె మరీ వేడిగా ఉంటే నానబెట్టిన చేప ముక్కలు పాత్రకు అంటుకుంటాయి. తగినంత సెగలో వేయించాలి. . ఎక్కువ మోతాదులో చేయాల్సివస్తే అనీ ఒకసారే వద్దు. కొన్ని కొన్ని ముక్కల చొప్పున వేయించండి. ఎక్కువ మొత్తంలో ముక్కలు వేస్తే నూనె ఎక్కువ పీల్చుకుంటుంది. పైగా ముక్కలు సరిగా వేగవు. చేపముక్కలను రెండు వైపులా బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. వహ్వా అనిపించే రుచి రావాలంటే పావుగంట పడుతుంది.

## చులకన చేయొద్దు !



కొంత మంది దంపతుల్దిరూ నింపాదిగా చర్చించు కోరు ఒకరిపై మరొకరు కోపంతో రగిలిపోతారు. ఒకరినొకరు నిందించుకోవడం మొదలుపెడతారు. ఇటువంటి వాతావరణం కుటుంబ సంతోషాన్ని దూరం చేస్తుందంటున్నారు. కాబట్టి.. ఎదుటివారితో మాట కలపడం ఓ కళ. అందులోనూ జీవిత భాగస్వామితో మరింత అపురూపంగా మాట్లాడాలి. అప్పుడే ఆ వైవాహికబంధం సాఫీగా సాగిపోతుంది. అలా జరగలంటే ఎదుటివారికన్నా తామే ఎక్కువ, నాకే అన్నీ తెలుసనే ఆలోచన భార్యాభర్తల్లో ఎవరికీ ఉండ కూడదు. లేదంటే భాగస్వామిపై చులకన భావం పెరుగుతుంది. అలాకాకుండా అవతలి వారిలోని ప్రత్యేకతను గుర్తించి విలువ నివ్వండి. ఇద్దరి మధ్యా అసమానతలకు చోటుండదు.

**నియంత్రించుకోవాలి....** దంపతులు ఏదైనా విషయంపై చర్చించుకున్న ప్పుడు..ఎదుటివారు చెప్పింది నచ్చకపోతే కోపాన్ని ప్రదర్శించొద్దు. కూల్‌గా ఆ సందర్భాన్ని డీల్ చేయడం నేర్చుకోవాలి. స్వీయ నియంత్రణ ఉండాలి. అవతలి వారెందు కలా మాట్లాడుతున్నారని ఆలోచించాలి. ఇలా ఇరువురూ చేస్తే సమస్య తేలికవుతుంది కోపానికీ తావుండదు.

**మృదువైన మాటలతో..** ఏ విషయాన్నైనా చర్చించాలనుకున్నప్పుడు మృదువైన మాటలతోనే సంభాషణ కొనసాగించాలి. ఎదుటివారి అభిప్రాయానికి విలువనిస్తూ, వారు చెప్పేది పూర్తిగా వినాలి. ఆ తర్వాత మీ ఆలోచననీ మృదువుగా చెప్పగలగాలి. ఇది అవతలివారికి ఒత్తిడి కలిగించదు. పైగా ఒకరికొకరు సానుకూలంగా అభిప్రాయాలను పంచుకునే వాతావరణం ఏర్పడుతుంది. ఇక కోపాలకు తావేది?

**అవతలివారి గురించి ఆలోచించి..** భార్యాభర్తల్లో ఏ ఒక్కరు కోపాన్ని ప్రదర్శించినా ఎదుటివారు దాన్ని తగ్గించడానికి ప్రయత్నించాలి. మీరు బాధపడుతూ కూర్చోక. భాగస్వామికి ఎలా అనిపించిందో అన్న కోణంలో ఆలోచించాలి. వారి స్థానంలో ఉండి ఆలోచించాలి. అవతలివారి అర్థమవడమే కాదు. సమస్యా తీరుతుంది.

## భక్తుల ధర్మం మేళ్లు వారికి చేరడం లేదెందుకని!?

ఈ లోకంలో 'ప్రతి విషయం' దానిదంటూ కొన్ని డిమాండ్స్ కలిగి ఉంటుంది. వాటిని పరి పూర్తి చేసినప్పుడే ఆ విషయం ఆధారంగా కలగ వలసిన 'మేళ్ళు కలుగుతాయి'. లేదంటే అది ఫలరహితమై, వ్యర్థమైపోతుంది. ఉదా: మీరు ఒక విద్యాలయంలో చేరారు. అది ఒక ఈవెంట్ మాత్రమే. అంతమాత్రానికే మీకు ఏమాత్రమూ విద్య రాదు. ఆ తరువాత మరొక ఈవెంట్ ఉంటుంది . అది 'కఠోర శ్రమ'తో విద్యను 'అభ్యాసం చేయటం'. ఈ ఉదా: సకల విషయాలకూ వర్తిస్తుందన్నది గమనార్హం! నేటి అధికశాతం ముస్లింలు, మేము 1.అల్లాహ్ పట్ల, 2.పరలోకం పట్ల, 3.ప్రవక్త పట్ల విశ్వాసం కలిగి, 4. ఆరాధనలు కూడా చేస్తున్నాం. అయినా ఇస్లాం మేళ్ళు మాకు కలగటం లేదేమిటి!?" అనిఆశ్చర్యంగా, విషాదంతో ప్రశ్నిస్తుంటారు. దానికి కారణం ఏమిటంటే రెండవ ఈవెంట్‌ను పాటించక పోవటమే! రెండవ ఈవెంట్ ఏమిటో చూడండి. కేవలం 'అల్లాహ్ పట్ల విశ్వాసం' ఏమాత్రమూ సరిపోదు. దాని 'డిమాండు' అయిన దేవుని 'విధినిషేధాల అనుసరణ'ను కూడా 'కఠోర శ్రమ'తో పాటించాలి. కేవలం పరలోకం పట్ల విశ్వాసం ఏమాత్రమూ సరి పోదు. దాని డిమాండు అయిన 'త్యాగమూ వైరాగ్యము' కూడా 'కఠోర శ్రమ'తో మీ ప్రవర్తనలో తెచ్చు కోవాలి. కేవలం ప్రవక్త పట్ల విశ్వాసం ఏ మాత్రమూ సరిపోదు. దాని 'డిమాండు'అయిన 'సహనమూక్షమాశీలత'లను కూడా 'కఠోర శ్రమ'తో మీ ప్రవర్తనలో తెచ్చు కోవాలి, కేవలం 'ఆరాధనల అమలు' ఏ మాత్రమూ సరిపోదు. దాని 'డిమాండు' అయిన సత్కర్మలను 'కఠోర శ్రమ'తో ఆచరించాలి.

**ఒక అబద్ధం! ఒక నిజం!!**

ధార్మిక విశ్వాసాలు కలిగి, ఆరాధనలు చేస్తే, ఇస్లాం మేళ్ళు కలుగుతాయన్నది ఒక అబద్ధం. అవి కోరే డిమాండులను కూడా పూర్తిచేస్తేనే ఇస్లాం మేళ్ళు కలుగుతాయన్నది ఒక నిజం". ఈ అబద్ధమూనిజమ్మును గుర్తించకపోతే మీ విశ్వా సాలూ ఆరాధనలు ఫలరహితమై, వ్యర్థమై పోతాయి! ఈ పుస్తకం యావత్తూ ఈ విషయం కేంద్రంగానే సాగింది. అల్లాహ్ మొదటి ఈవెంట్ తో పాటు, దాని డిమాండు అయిన రెండవ ఈవెంట్‌ను కూడా ఆచరించే సౌభాగ్యాన్ని కలిగించుగా!

**ముష్తాఖ్ అహ్మద్ అభిలాష్**

## గాజును మెరిపిద్దాం !

ఆరోగ్య స్పృహ, అలం కరణపై శ్రద్ధ.. ఇంట్లో గాజు వస్తువుల వాడకాన్ని పెంచేశాయి. ఇవి చూడ్డానికి ఎంతందంగా ఉన్నా.. ఇవి ఎప్పటికప్పుడు శుభ్రపరచకపోతే దుమ్ము, జిడ్డు వంటి వాటితో మరకలు పడతాయి. అలాగని శుభ్రం చేసేటప్పుడు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. అవి పగిలి పోతాయి. అలాకాకూడదంటే ఈ చిట్కాలు పాటించండి మరి.. గాజు వస్తువులను శుభ్రం చేసేటప్పుడు పీచుకి బదులు స్పాంజ్‌ని వాడాలి. దీన్ని వాడేందుకు సబ్బుకి బదులు లిక్విడ్ సోప్ ఎంచుకోవడం మంచిది. చేతులు పట్టని గాజు వస్తువుల్లోకి మెత్తటి ఫోమ్, లేదాకుచ్చుల నబ్రష్‌తో శుభ్రపరిస్తే సరి.. గ్లాస్‌వేర్‌ని క్లీన్ చేయడానికి చన్నీళ్లకు బదులుగా వేడినీళ్లను వాడండి. ఇవి బ్యాక్టీరియాలను సులువుగా తొలగిస్తాయి. గ్రీజు, జిడ్డు మరకల్ని త్వరగా వదలగొడ తాయి. కఠిన రసాయనాలతో కూడిన క్లీనర్లను గాజుపాత్రల్ని కడగడానికి వాడటం మంచిది కాదు. ఇవి వాటికుండే సహజమెరుపుని తగ్గిస్తాయి .బదులుగా వెనిగర్, నిమ్మ, బేకింగ్ సోడా వంటివి వినియోగించొచ్చు. గాజు పాత్రల్ని ఓసారి వేడి నీళ్లలో శుభ్రపరిచి నిమ్మచెక్కలతో రుద్దితే దానిమీదే పేరుకున్న మురికి తొలగిపోతుంది. అంతేకాదు.. ఆహార పదార్థాలు, తేనీటి వాసనలు, మరకలు వంటివీ దూరమవు తాయి. చివరిగా టూత్ పేస్ట్‌ని ఉపయోగించీ గాజు పాత్రల్ని శుభ్రపరచుకోవచ్చు.



## ఒంటరితనాన్ని వదిలించుకుందాం...

**జీవనశైలి, పని ఒత్తిడి కారణాలేవైనా చాలామంది మహిళలను డిప్రెషన్ వేధిస్తుంటుంది. ఇలాంటప్పుడు ఒంటరితనం బాధించ కూడదంటే.. ఈ అలవాట్లు చేసుకోవాలి.**



జీవితం ఎవరికీ పూల పాన్పుకాదు.. ఎదురయ్యే సంఘటనల్ని డీల్ చేసుకునే విధానమే వారిని గట్టెక్కిస్తుంది. అలాకాకుండా అన్నింటికీ ఎవరో ఒకరు తోడు కావాలనుకుకోవడం, మనసుకి నచ్చిన వారు పక్కనుంటేనే అన్నీ చేయగలను అనుకోవడం వల్ల. మీ ఒంటరి తనం పోగొట్టడానికి ఏవవైనా హాబీలను అలవాటు చేసుకోండి. ఉదాహరణకు మీకు మంచి ముగ్గులు పెట్టడమో, వంట చేయడమో వస్తే.. దానిలోనే ప్రత్యేకత సాధించడానికి ప్రయత్నిం చండి. సామాజిక మాధ్యమాల వేదికగా వాటిని ప్రదర్శిం చండి. ఇవన్నీ మీకో గుర్తింపు తేవడమే కాదు.. ఒంటరితనాన్నీ దూరం చేస్తాయి. నలుగురిలో కలవడానికి బోలెడు మార్గాలు.. వ్యాయామం చేయడానికి రోజూ దగ్గర్లోని యోగా సెంటర్‌కో, పార్కుకో వెళ్లండి. కసరత్తులు మీ ఒంటికి శ్రమనూ, మనసుకు సాంత్వననూ అందిస్తాయి. కొత్త స్నేహాలకూ, ఆలోచనలకూ ఇవి వేదిక అవుతూయి. లేదంటే ఉదయమో, సాయంత్రమో వెల్లండి క్రమంగా మీలోని ఒత్తిడి దూరమవుతుంది. మీలో ఒంటరితనం అనే భావన రావడానికి మీ చుట్టూ ఉండే వ్యక్తులూ, సమాజం.. ఏదైనా కారణం కావొచ్చు. నిత్యం ఏదో ఒక ప్రతికూల పరిస్థితితో పోరాడాల్సి రావొచ్చు. అంతమాత్రాన మిమ్మల్ని మీరు తక్కువ చేసుకోవద్దు. ఏ రోజుకారోజు మీలోని ఓ నెగెటివ్ అంశాన్ని అధిగమించాలనే లక్ష్యం పెట్టుకోండి. ఏ విషయంలోనైనా వెనకబడి ఉంటే అందులో పట్టు తెచ్చుకోవడానికి ప్రయత్నిం చండి. ఇవన్నీ మీ ఒంటరితనాన్ని దూరంచేసేవే.

## త్వరలో రిలీజ్‌కు వస్తున్న 'సాజు3'



సరికొత్త కంటెంట్‌తో త్వరలో రిలీజ్‌కు వస్తున్న "సాజు3" సినిమా ప్రేక్షకుల్ని అలరి స్తుంది డైరెక్టర్ కృష్ణమాయ స్మామ్రాట్, డీమోన్ పవన్, లిఖిత (రాను బొంబాయికి రాను సాంగ్ ఫేమ్) హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "సాజు3". ఈ చిత్రాన్ని లక్ష్మి కృష్ణ ఫిలింస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం.2గా నిర్మాత వి.విజయ నిర్మిస్తున్నారు. నటుడు, దర్శకుడు కృష్ణ మాయ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. రెబల్ స్టార్ ప్రభాస్ "ఈశ్వర్" సినిమాలో కృష్ణమాయ ఫ్రెండ్ క్యారెక్టర్ లో నటించి పేరు తెచ్చుకున్నారు.యాక్టర్ అదిరే అభి మాట్లాడుతూ నెక్స్ ఇయర్ కు ఈశ్వర్ సినిమా పాతికేళ్లకు చేరుకుంటుంది. అప్పుడు ఓ గెట్ గెదర్ పెట్టుకోవాలని, అందుకు కృష్ణమాయ ఇనిషేటివ్ తీసుకోవాలి కోరుతున్నా. ఈశ్వర్ చిత్రంలో మేము ప్రభాస్ ఫ్రెండ్‌గా నటించాం. ఆ మూవీతో మాకు మంచి గుర్తింపు దక్కింది. ప్రభాస్ ఈ రోజు బిగ్ స్టార్ అయ్యారు. హీరో స్మామ్రాట్ మాట్లాడుతూ ప్రభాస్ మా అందరికీ ఫేవరేట్ హీరో. ఆయన ఈశ్వర్ సినిమా రీ రిలీజ్ కు మేమంతా టీమ్‌గా వెళ్లి థియేటర్స్‌లో సినిమా చూస్తాం. ఈశ్వర్ సినిమా రీ రిలీజ్ సందర్భంగా మా మూవీ ప్రెస్ మీట్ నిర్వహించుకోవడం హ్యాపీగా ఉంది. "సాజు3" సినిమా కంటెంట్ చూసిన ప్రతి ఒక్కరూ మూవీ చాలా బాగుందంటూ చెబుతున్నారు. హీరోయిన్ లిఖిత మాట్లాడుతూ ప్రభాస్ ఈశ్వర్ సినిమా రీ రిలీజ్ సందర్భంగా మా సినిమా నుంచి ట్రిబ్యూట్‌గా ప్రెస్ మీట్ నిర్వహించుకోవడం సంతోషంగా ఉంది. నటి శ్రావణ సంధ్య మాట్లాడుతూ డైరెక్టర్ కృష్ణమాయ నాకు గతంలో రైల్వే స్టేషన్ మూవీలో నటించే అవకాశం కల్పించారు. ఆ సినిమా టైమ్ లో రిహార్సల్స్ చేయించి పర్ఫెక్ట్‌గా వచ్చేలా షూటింగ్ చేశారు.

# తెర

## NBK111 'ఎంట్రీ ఆఫ్ ఆన్ ఎరా' గ్లింప్స్ రిలీజ్



NBK111 నుంచి బాలయ్య బర్త్ డే సందర్భంగా కింగ్ ఆఫ్ కేయాస్ 'ఎంట్రీ ఆఫ్ ఆన్ ఎరా' గ్లింప్స్ రిలీజ్ గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని భారీ కాన్వాస్‌పై రూపుదిద్దు కుంటున్న NBK111 చిత్రం కోసం మళ్ళీ జతకట్టారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్, హైవోల్టేజ్ యాక్షన్, గ్రిప్పింగ్ డ్రామా. ఈ స్టార్ డైరెక్టర్ కాంబినేషన్ నుంచి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూసే ట్రేడ్‌మార్క్ మాస్ మూమెంట్స్‌తో సినిమా అద్భుతంగా అలరించబోతోంది. బాల కృష్ణకు పుట్టినరోజు శుభాకాంక్షలు బాలకృష్ణ పాత్రను పరిచయం చేసేలా ఈ గ్లింప్స్‌ను రూపొందించారు. 1993 బాంబే అల్లకల్లోల పరిస్థితుల నేపథ్యం లో సాగే ఈ వీడియోలో డార్క్, హింసతో నిండిన ప్రపంచాన్ని చూపించారు. అలాంటి పరిస్థితుల్లో స్టైల్, ఇంటెన్స్, పవర్‌కు ప్రతీకగా బాలకృష్ణ ఎంట్రీ అదిరి పోయింది. డైలాగ్స్ లేకుండానే విజువల్స్ ద్వారా పాత్ర పవర్‌ను అద్భుతంగా చూపిం చారు. దర్శకుడు గోపీచంద్ మలినేని ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ సాగాగా మలిచారు. భారీ యంత్రాలు, అగ్నిజ్వాలలు, ప్రాణాంతక ఆయు ధాలు, విధ్వంసకర యాక్షన్ ఎపిసోడ్స్‌తో గ్లింప్స్ అంతా ఉత్కంఠ భరితంగా సాగింది. ప్రతి ఫ్రేమ్ హీరో పాత్ర స్థాయిని మరింత ఎలివేట్ చేసేలా రూపొందిం చారు. ఈ చిత్రంలో బాలకృష్ణ పాత్రను కింగ్ ఆఫ్ కేయాస్‌గా ప్రజెంట్ చేశారు. ఈ గ్లింప్స్ బాలకృష్ణ ఆదరగొట్టేశారు. సరికొత్త మేకోవర్‌లో ఆయన ఎంతో స్టైలిష్‌గా, ఎనర్జిటిక్‌గా, అత్యంత పవర్‌ఫుల్‌గా కనిపించారు. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ పాత్రను మరింత ఇంపాక్ట్ ఫుల్‌గా నిలబెట్టింది.

## 'దీవాన' మూవీ ట్రైలర్ లాంచ్



"దీవాన" సినిమాను ఎంత నిజాయితీగా రూపొందించారో ట్రైలర్ తోనే తెలుస్తోంది మాస్ కా దాస్ హీరో విశ్వక్ సేన్..శుభం సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న యంగ్ టాలెంటెడ్ యాక్టర్ హర్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "దీవాన". ఈ చిత్రాన్ని అర్వ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిస్తున్నారు. ఈ బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో హీరోయిన్ స్మేహ మణిమేగలై, దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి పరిచయం కానున్నారు. "దీవాన" సినిమా గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈ నెల 19న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ రోజు ఈ చిత్ర ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్, మాస్ కా దాస్ హీరో విశ్వక్ సేన్, ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగాయాక్టర్ టోనీ మాట్లాడుతూ గీతా ఆర్ట్స్‌లో వచ్చిన ఎన్నో చిత్రాలను థియేటర్ లో చూసి ఎంజాయ్ చేశాను. ఇప్పుడు ఆసంస్థకొలాబ్రేట్ అయిన మూవీలో నటించడం గర్వంగా ఉంది. ప్రొడ్యూసర్ వాసుదేవ్ కొప్పినేని మాట్లాడుతూ చిన్నప్పటి సినిమా అంటే ప్యాషన్ ఉండేది. ఎన్నో చిత్రాలు చూస్తూ పెరిగాను. అరవింద్ గతో పరిచయం అయ్యాక ఆయనకు ప్రతి రోజూ ఏదో విషయంలో థ్యాంక్స్ చెబుతూనే ఉన్నాను. ప్రొడ్యూసర్ శ్రీదేవి కార్యంపూడి మాట్లాడుతూ నేను ఆహాలో పనిచేశాను. అక్కడ విశ్వక్ గారిని కొన్నిసార్లు కలిశాను. కొత్త వాళ్లతో కూడా ఆయన ఎంతో ఫ్రెండ్లీగా ఉంటారు. "దీవాన" సినిమా గురించి చెప్పాలంటే ఈ చిత్రానికి మా డైరెక్టర్ శ్రీకాంత్, మ్యూజిక్ డైరెక్టర్ ఈశ్వర్, హీరోయిన్ స్మేహ, హీరో హర్షిత్ నాలుగు ఫిల్లర్స్. ఈ ఫిల్లర్స్ కు పునాదిలా నిలబడ్డారు మా ప్రొడ్యూసర్ వాసుదేవ్. ఆయన ఈ సినిమా కోసం ప్రాణం పెట్టారు.



## ఆలియా భట్ 'ఆల్ఫా' టీజర్ రిలీజ్

ఆలియా భట్ ప్రధాన పాత్రలో యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మిస్తోన్న భారీ యాక్షన్ మూవీ ఆల్ఫా. బుధవారం (జూన్ 10) మేకర్స్ ఈ మూవీ టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో ఆలియా భట్ ఓ హంతకురాలి పాత్రలో నటించింది. టీజర్‌ను గమనిస్తే.. బాబీ డియోల్ తండ్రి పాత్రలో కనిపించారు. తన కుమార్తెను బాబీ చిన్నప్పటి నుంచే హత్యలు చేసే ఓ హంతురాలిగా పెంచి పెద్ద చేస్తాడని అర్థమవుతుంది. అలాగే ఆమె చేసిన భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను కూడా మనం ఇందులో గమనించ వచ్చు. త్వరలోనే ఈ సినిమాలో మరో ప్రధాన పాత్రలో నటించిన శర్వారి పాత్రను మేకర్స్ పరిచయం చేయబోతున్నారు. ఆల్ఫా స్వభా వాన్ని అలవరుచు కున్న ఇద్దరమ్మాయిల కథతో తెరకెక్కిన పాప్‌కార్న్ సినిమా. ఇద్దరు హీరోయిన్స్ ప్రధాన పాత్రధారులుగా ఇప్పటి వరకు యాక్షన్ సన్నివేశాలతో రూపొందింది. థ్రిల్లింగ్, ఎమోషనల్, ఫన్నీ ఎలిమెంట్స్‌తో ఎవరూ ఊహించని మలుపులతో రైడింగ్‌లా ఆల్ఫా సినిమాను రూపొందించారు. 'ఆల్ఫా' మూవీని గ్లోబల్ హిట్ సిరీస్ రైల్వే మెన్ ఫేమ్ శివ్ రవాలి తెరకెక్కిస్తు న్నారు. బాబీ డియోల్, అనీల్ కపూర్ కీలక పాత్రల్లో నటిసు న్నారు. జూలై 3న ఈ మూవీ వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ కానుంది.

## 'అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి'



జీఎస్ఆర్ మూవీ మేకర్స్ పతాకంపై పవన్ మహావీర్ ను హీరోగా పరిచయం చేస్తూ... ప్రముఖ మహిళా వ్యాపారవేత్త శైలజరెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వినూత్న ప్రేమకథా చిత్రం "అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి". శివాల ప్రభాకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో వర్షిక, సుహానా హీరో యిన్లు. సుమన్, రావు రమేష్, రాజీవ్ కనకాల, సత్యకృష్ణ, సుజాత తదితరులు ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం టీజర్ రిలీజ్ ఫంక్షన్ హైదరాబాదులోని ప్రసాద్ ల్యాబ్ లో అత్యంత ఘనంగా జరిగింది!! ఆంధ్రప్రదేశ్ ఫిలిం డవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ భరత్ భూషణ్, నిర్మాతల మండలి ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్, ఫెడరేషన్ అధ్యక్షులు వల్లభనేని అనిల్, ఫిలిం చాంబర్ ప్రధాన కార్యదర్శి కే అశోక్ కుమార్, దర్శకుల సంఘం అధ్యక్షులు వివిన్ ఆదిత్య, సీనియర్ ఫిలిం జర్నలిస్టులు ప్రభు, సురేష్ కొండేటి, ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ ఈ వేడుకలో పాల్గొన్నారు. "తొలి చిత్రంతోనే అన్ని శాఖల పట్ల అవగాహన పెంచుకున్న శైలుజా రెడ్డి సినిమా నిర్మాణ రంగంలోనూ అసాధారణ విజయం సాధించడం ఖాయమని" అతిథులు ఆకాంక్షించారు."హీరోగా పరిచయమవుతున్న పవన్ మహావీర్‌ను చూస్తుంటే... ఇది అతని తొలి చిత్రం అనిపించ లేదని, అతనిలో అంత ఈజ్ ఉందని" అన్నారు.

## 'కొత్త మలుపు' నా జీవితంలో కొత్త మలుపు': భైరవి ఆర్ధ్యా



భైరవిఆర్ధ్యాతో మీడియా ప్రతినిధులు స్పెషల్ చిట్‌చాట్

**మీ నేపథ్యం చెప్పండి. అస్సాం నుంచి టాలీవుడ్ వరకు మీ ప్రయాణం ఎలా సాగింది?**

నేను అస్సాంకు చెందిన అమ్మాయిని. మా కుటుంబంలో అమ్మ, నాన్న, చెల్లెలు అందరూ అక్కడే ఉంటారు. చిన్నప్పటి నుంచే సినిమాలు, నటన అంటే చాలా ఇష్టం. తెలుగు సినిమాలు కూడా చూస్తూ పెరిగిన నేను ఒక రోజు నటిగా మారాలనే కల కనడం ప్రారంభించాను.

**కొత్త మలుపు' సినిమాలో అవకాశం ఎలా వచ్చింది?**

నా చదువుతో పాటు ఆడిషన్స్ ఇవ్వడం మొదలుపెట్టాను. అప్పట్లో నాకు తెలుగు అస్సలు రాదు. అయినప్పటికీ వెనక్కి తగ్గలేదు. దాదాపు రెండు మూడు సంవత్స రాల పాటు నిరంతరం ఆడిషన్స్ ఇస్తూ, తెలుగును నేర్చుకునేందుకు ప్రత్యేకంగా ప్రయత్నిం చాను.

**సినిమాలో మీ పాత్ర చెప్పండి.**

ఈ చిత్రంలో నా పాత్ర పేరు వరలక్ష్మి. ఆమె కొనసీమకు చెందిన అమాయకమైన గ్రామీణ యువతి. చాలా స్వేచ్ఛగా, మనసు కు నచ్చినట్టు జీవించే అమ్మాయి. సహజత్వా నికి దగ్గరగా ఉండే అందమైన పాత్ర ఇది. నటిగా నాకు మంచి అవకాశాన్ని ఇచ్చిన క్యారెక్టర్.

**కొనసీమ నేపథ్యంలో నటించడం ఎలా ఉంది?** కొనసీమ ప్రకృతి అందాలు నన్ను చాలా ఆకట్టుకున్నాయి. కొబ్బరి తోటలు, అక్కడి సంస్కృతి, ఆహారం అన్నీ నాకు కొత్త అనుభవం.

**ఈ సినిమాలో మీకు ఎదురైన ప్రధాన సవాళ్లు ఏమిటి?**

భాషే పెద్ద సవాలు. తెలుగు నేర్చుకున్నప్పటికీ గోదావరి ప్రాంత యాసను పట్టు కోవడం అంత సులభం కాదు. అలాగే వర్షాకాలంలో షూటింగ్ జరగడంతో వాతావరణ పరిస్థితులు కూడా కొంత ఇబ్బంది కలిగించాయి.

**తెలుగు సినీ పరిశ్రమ మీ అభిప్రాయం?**

నేను స్కూల్ రోజుల నుంచే తెలుగు సినిమా లకు అభిమానిని. ముఖ్యంగా ఇక్కడి కథలు, భావోద్వేగాలు చాలా బాగుంటాయి.

**హైదరాబాద్‌లో మీకు నచ్చిన విషయం ఏమిటి?**

హైదరాబాద్ అంటే ముందుగా గుర్తొచ్చేది చికెన్ దమ్ బిర్యానీ. నాకు చాలా ఇష్టం. నగర వాతావరణం, ఇక్కడి ప్రజల ఆతిథ్యం కూడా బాగా నచ్చాయి.



టి20 ముంబయి లీగ్‌లో..

## సిక్సర్లతో శివమ్ వీరంగం

**న్యూఢిల్లీ:** టీ20 ముంబై లీగ్‌లో టీమిండియా టీ20 ప్లేయర్ శివమ్ దూబే శివాలెత్తి వీరంగం సృష్టించాడు. ఈ టోర్నీలో అంధేరి ఆర్బ్‌కు సారథ్యం వహిస్తున్న శివమ్ గురువారం ఆకాశ్ టైగర్స్‌తో జరిగిన తొలి సెమీ ఫైనల్లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టాడు. ఫలితంగా అతడి జట్టు ఫైనల్స్‌కు దూసుకుపోయింది. ఈ మ్యాచ్‌లో తొలుత బంతితో (3-0-16-1) రాణించిన శివమ్ ఆ తర్వాత బ్యాటింగ్‌లో చెలరేగిపోయాడు. ప్రత్యర్థి నిర్దేశించిన 151 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఒంటిచేత్తో తన జట్టును గెలిపించాడు. 26 బంతుల్లో ఓ బౌండరీ, 5 సిక్సర్లతో విరుచుకుపడి అజేయమైన 45 పరుగులు చేశాడు. తద్వారా అతడి జట్టు మరో 9 బంతులు మిగిలిఉండగానే విజయతీరాలకు చేరింది. లక్ష్య ఛేదనలో దూబేకు దివ్యాంశ్ సక్సేనా (34), ప్రసాద్ పవార్ (26), గౌరవ్ జాథర్ (11 నాటౌట్) సహకరించారు. ఈ జట్టు స్టార్ ఆటగాళ్లు ముషీర్‌ఖాన్ (0), అర్జున్ టెండూల్కర్ (13) ఈ మ్యాచ్‌లో నిరాశపరిచారు. అంతకు ముందు ఆకాశ్ టైగర్స్ తరపున ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. కెప్టెన్ సర్ఫరాజ్ ఖాన్ (34), జయ్ గోకుల్ బిస్తా (35) మాత్రమే ఓ మోస్తరు స్కోర్లు చేశారు. మిగిలిన ఆటగాళ్లలో ఒక్కరు కూడా కనీసం 20 పరుగుల మార్కును తాకలేదు. అంధేరి బౌలర్లల అశుతోష్ 2 వికెట్లు తీయగా, అర్జున్ టెండూల్కర్, ముషీర్‌ఖాన్, శివమ్ దూబే, ప్రసూన్ సింగ్, అజయ్ మిశ్రా తలో వికెట్ తీశారు.

# నేటి నుండి మహిళా టి20 వరల్డ్ కప్



### 14న భారత్, పాక్ మధ్య హైఓల్టేజ్ మ్యాచ్

**న్యూఢిల్లీ:** మహిళా టీ20 ప్రపంచ కప్ 2026 కౌంట్‌డౌన్ మొదలైంది. ఇంగ్లండ్ వేదికగా శుక్రవారం నుంచి విమెన్స్ టీ20 వరల్డ్ కప్ జరగబోతున్నది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీలోని భారత జట్టు తన తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్‌తో తలపడనుంది. ఈ నెల 14న బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో రాత్రి 7 గంటలకు భారత్ తమ పోరాటాన్ని మొదలుపెడుతుంది. ఇప్పటివరకు టీ20 ప్రపంచ కప్ గెలవని భారత్, ఈసారి చరిత్ర సృష్టించాలని యోచిస్తోంది. గత కొన్నేళ్లుగా ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్ విజయాలు సాధించి భారత్ తన సత్తా చాటినప్పటికీ, టోర్నీకి ముందు దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లలో ఓటమి జట్టు సన్నద్ధతపై కొన్ని ప్రశ్నలను లేవనెత్తింది. భారత్ గ్రూప్ ఎ లో ఉంది. ఇందులో పాకిస్థాన్, నెదర్లాండ్స్, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా వంటి జట్లు ఉన్నాయి. భారత జట్టులో షెఫాలీ వర్మ, స్మృతి మంధాన, యాస్తిక భాటియా, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్, రిచా ఘోష్, భారతి ఫుల్మాలి, దీప్తి శర్మ, రాధా యాదవ్, అరుంధతి రెడ్డి, శ్రేయంక పాటిల్, శ్రీ చరణి, క్రాంతి గౌడ్, రేణుకా ఠాకూర్, నందిని శర్మ ఉన్నారు. టాప్ ప్లేయింగ్ ఎలెవన్‌లో షెఫాలీ వర్మ, స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్, రిచా ఘోష్, భారతి ఫుల్మాలి, దీప్తి శర్మ, అరుంధతి రెడ్డి, శ్రీ చరణి, శ్రేయంక పాటిల్/ నందిని శర్మ, రేణుకా ఠాకూర్ ఉండే అవకాశం ఉంది. మిడిల్ ఆర్డర్‌లో జెమీమా రోడ్రిగ్స్ బాధ్యత తీసుకోనుంది ఇంగ్లాండ్ కండిషన్స్‌లో 130.25 స్ట్రైక్ రేట్‌తో రాణించిన రికార్డు ఆమెకు ఉంది. 21 ఏళ్ల లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శ్రీ చరణి బౌలింగ్‌లో ఖిఎక్స్ ఫ్యాక్టర్‌గా మారవచ్చు. అదే సమయంలో, యాస్తిక భాటియా నెమ్మదైన బ్యాటింగ్, రిచా ఘోష్ ఫామ్ జట్టుకు ఆందోళన కలిగిస్తోంది. స్మృతి మంధాన తన టీ20 అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో 4500 పరుగుల మైలురాయిని అందుకోవడానికి మరో 167 పరుగుల దూరంలో ఉన్నారు. అరుంధతి రెడ్డికి 50 టీ20 వికెట్లు పూర్తి చేయడానికి మరో రెండు వికెట్లు కావాలి. మహిళల టీ20 వరల్డ్ కప్‌లో భారత్ లీగ్ మ్యాచ్‌ల షెడ్యూల్ చూస్తే ఈ నెల 14న డ్జ్‌బాస్టన్ (బర్మింగ్‌హామ్)లో రాత్రి 7 గంటలకు భారత్ వర్సెస్ పాకిస్తాన్ మధ్య జరిగే తొలి టీ20 మ్యాచ్ ప్రారంభం అవుతుంది. 17న భారత్ వర్సెస్ నెదర్లాండ్స్, 21న భారత్ వర్సెస్ సౌతాఫ్రికా, 25న భారత్ వర్సెస్ బంగ్లాదేశ్, 28న భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి.

### ప్లేయర్ ఆఫ్ మంత్ నామినీస్‌లో బంగ్లాదేశ్ హవా

**న్యూఢిల్లీ:** మే నెలకు సంబంధించి ప్లేయర్ ఆఫ్ ది మంత్ నామినీస్ పేర్ల జాబితాలో బంగ్లాదేశ్ ఆటగాళ్ల హవా కనిపించింది. ఈ మేరకు గురువారం ఐసీసీ నామినీస్ పేర్లను ప్రకటించింది. గత నెలలో బంగ్లాదేశ్ జట్టు పాకిస్తాన్‌పై టెస్ట్ సిరీస్ విజయం (2-0తో క్లీన్ స్వీప్) సాధించింది. ఈ సీరిస్‌లో విశేషంగా రాణించిన వికెట్‌కీపర్ బ్యాటర్ ముష్ఫికర్ రహీం, స్పిన్ బౌలర్ తైజుల్ ఇస్లాం ప్లేయర్ ఆఫ్ ద మంత్ నామినీస్‌గా ఎంపికయ్యారు. ముష్ఫికర్ పాక్‌పై రెండు టెస్టుల్లో 253 పరుగులు చేశాడు. రెండో టెస్టులో 137 పరుగుల భారీ ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను పూర్తిగా బంగ్లాదేశ్ వైపు తిప్పేశాడు. అలాగే తైజుల్ పాక్‌తో జరిగిన సిరీస్‌లో 13 వికెట్లతో సిరీస్ టాప్ వికెట్ టేకర్‌గా నిలిచాడు. రెండో టెస్టులో మ్యాచ్ విన్నింగ్ స్పెల్ (6/120) ఇందులో హైలైట్‌గా నిలిచింది. మరో నామినీగా నేపాల్ ఆల్‌రౌండర్ దీపేంద్ర సింగ్ ఎయిరీ ఎంపికయ్యాడు. దీపేంద్ర గత నెలలో ఆడిన వన్డేల్లో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో చెలరేగాడు. యుఏఈపై జరిగిన వన్డేల్లో ఓ సెంచరీ, రెండు హాఫ్ సెంచరీలు (యూఎస్ఏపై) సహా 8 వికెట్లు తీశాడు. అతడి ఆల్ రౌండ్ ప్రదర్శన వల్ల నేపాల్ కీలక విజయాలు సాధించింది. ఫలితంగా ప్లేయర్ ఆఫ్ ద మంత్ వార్డుకు నామినేట్ అయ్యాడు. ఇక మహిళల విషయానికి వస్తే ఇంగ్లండ్ బౌలర్ లారెన్ బెల్, పాకిస్తాన్ ఓపెనింగ్ బ్యాటర్ గుల్ ఫెరోజా, న్యూజిలాండ్ బ్యాటర్ మ్యాడీ గ్రీన్ మే నెల ప్లేయర్ ఆఫ్ ద మంత్ అవార్డుకు నామినేట్ అయ్యారు.



### వన్డే ట్రై సిరీస్‌లో భారత్ ఓటమి

**న్యూఢిల్లీ:** ట్రై సిరీస్‌లో భాగంగా శ్రీలంక వేదికగా అఫ్ఘాన్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌లో భారత్ జట్టు ఓటమిని చవి చూసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 49 ఓర్లలో 349 పరుగులు చేసింది. ఇక వర్షం కారణంగా అఫ్ఘానిస్తాన్ టార్గెట్‌ను 38 ఓవర్లలో 294 రన్స్‌కి కుదించగా 4 పరుగుల తేడాతో డిఎస్ఎస్ పద్ధతితో అఫ్ఘాన్ విజయం సాధించింది. శ్రీలంకలోని దంబుల్లా స్టేడియం వేదికగా గురువారం జరిగిన వన్డే మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఇండియా జట్టు నిర్ణీత 49 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 349 పరుగుల భారీ స్కోర్ చేసింది. వికెట్ కీపర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో 84 పరుగులు చేశగా. కెప్టెన్ తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్ చెరో హాఫ్ సెంచరీతో స్కోర్ బోర్డును ముందు తీసుకెళ్లారు. ఇక తొలిసారి ఇండియన్ టీమ్‌లో చోటు దక్కించుకున్న వైభవ్ సూర్యవంశీ కేవలం 22 బంతుల్లో 44 పరుగులు చేసి అఫ్ఘాన్ ముందు భారీ లక్ష్యాన్ని ఉంచాడు. ఆఫ్ఘానిస్తాన్ బ్యాటింగ్ చేస్తుండగా ఒక్కసారిగా వర్షం కురవడంతో ఇన్నింగ్స్‌ను 38 ఓవర్లకు కుదించింది. 294 పరుగుల టార్గెట్‌ను ఫిక్స్ చేశారు. తర్వాత మళ్లీ బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘానిస్తాన్ 25.5 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసింది. మళ్లీ వర్షం రావడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ఆఫ్ఘానిస్తాన్ 4 పరుగులు తేడాతో భారత్‌పై విజయం సాధించింది. ఆఫ్ఘన్ కెప్టెన్ ఇమ్రాన్ మీర్, బాహిర్ షా అజేయ చెరో ఆఫ్ సెంచరీతో తమ జట్టును విజయంలో కీలక పాత్ర పోషించారు.



ఆట

## ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు సింధు, తన్వి

**న్యూఢిల్లీ:** భారత షట్లర్లు పివి సింధు, తన్వి శర్మ 2026 ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. సిడ్నీలో జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో భాగంగా గురువారం జరిగిన రెండు భారతీయ ప్రీక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లలో, సింధు 22-20, 21-12 తేడాతో ఇషారాణి బరువాను ఓడించగా, తన్వి 21-13, 21-15 తేడాతో మాల్వికా బన్సోద్‌ను ఓడించింది. తదుపరి రౌండ్‌లో జపాన్‌కు చెందిన టాప్ సీడ్ అకానె యమగుచితో తలపడనున్నందున, 17 ఏళ్ల ఈ క్రీడాకారిణికి ముందు కఠినమైన సవాలు ఎదురుకానుంది. వీరిద్దరి మధ్య ఇదే తొలి పోరు. మరోవైపు, సింధు శుక్రవారం జరిగే తన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో చైనీస్ తైపీకి చెందిన, తన కంటే చాలా తక్కువ ర్యాంకు క్రీడాకారిణి అయిన సు యు చెన్‌ను ఎదుర్కోనుంది. ఇదిలా ఉండగా, మరో భారత మహిళల సింగిల్స్ క్రీడాకారిణి తాన్యా హేమంత్, థాయ్‌లాండ్‌కు చెందిన రెండో సీడ్ పోర్న్‌పావీ చోచువాంగ్ చేతిలో 12-21, 15-21 తేడాతో రెండో రౌండ్‌లోనే నిష్క్రమించింది. అలాగే పురుషుల డబుల్స్‌లో, వర్ధమాన భారత జోడీ హరిహరన్ అమ్సకరుణన్-ఎంఆర్ అర్జున్, న్యూజిలాండ్ జోడీపై 21-17, 21-7 తేడాతో ఆధిపత్య విజయం సాధించి తదుపరి రౌండ్‌కు దూసుకెళ్లారు. మరోవైపు, ధ్రువ్ రావత్-కె మనీషాల మిక్స్‌డ్ డబుల్స్ జోడీ కూడా జపాన్‌కు చెందిన అకిరా కోగా మరియు నాట్సు సైటో చేతిలో 19-21, 18-21 తేడాతో ఓడిపోయి రెండో రౌండ్‌లోనే నిష్క్రమించింది.




## బులియన్‌రంగంపై వార్ ఎఫెక్ట్

### 10 గ్రా. పసిడి రూ.1.46 లక్షలు

### కిలో వెండి రూ.2.60 లక్షలు!



**ముంబయి,జూన్ 11:** పశ్చిమాసియా యుద్ధప్రభావం బులియన్‌రంగంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. రోజురోజుకూ ధరల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా బంగారం భారత్‌మార్కెట్‌లో 24 కేరట్ల పదిగ్రాముల బంగారం 1,45,640గాట్రేడ్ అయింది. అదే 22 కేరట్ల బంగారం 1,33,500 రూపాయలుగా ఉన్నట్లు బులియన్ రంగం ప్రకటించింది. మొత్తంగాచూస్తే బేస్ వాల్యు, తరుగు, జీఎస్టీ వంటివి కలుపుకుంటే పదిగ్రాముల బంగారం రూ.1,68,01గా ట్రేడ్ అయిందని బులియన్ అసోసియేషన్‌ప్రకటించింది. హైదరాబాద్‌లో 1,45,564రూపాయలు, 1,33,500గాకొనసాగితే చెన్నైలో 1,47,280, 22 కేరట్లు 1.35 లక్షలుగానూ, ముంబయిలో 1,45,640, 1,33,500గాను కొనసాగాయి. అలాగే ఢిల్లీ మార్కెట్‌లో పదిగ్రాముల బంగారం 1,45,790గాను, 22 కేరట్లు పసిడి 1,33,650గానుట్రేడ్ అయింది. కోల్‌కత్తాలో 1,45,640, రూ,1,33,500గాను ట్రేడ్ కావడం గమనార్హం. బెంగలూరులో 1,45,640, రూ. 1,33,500గానుట్రేడ్ అయింది. ఇక వెండిధరలు కిలో ఒక్కింటిక 2.60 లక్షలుగా ఉంది. ఆభరణాలపరంగాచూస్తే బేస్ వాల్యూకి తోడు తయారీ ఛార్జిలు, జీఎస్టీ వంటివాటిని కలుపుకుంటే 2,99,900గా కొనసాగింది. ఇక బేస్ వాల్యూపరంగా చెన్నైలో కిలో ఒక్కింటికి 2.60 లక్షలు, ముంబయిలో 2.50లక్షలు, ఢిల్లీలో 2.50, కోల్‌కత్తా, బెంగళూరునగరాల్లోకూడా 2.50 లక్షలుగానే కొనసాగింది. హైదరాబాద్ చెన్నైల్లో మాత్రమే కిలో ఒక్కింటికి రూ.2.60 లక్షలుగా కొనసాగినట్లు బులియన్ వర్తకులు తెలిపారు.



### భారత్‌లో కార్యకలాపాలు నిలిపివేయనున్న ఓపెన్‌డోర్

**న్యూఢిల్లీ,జూన్ 11:** అమెరికాకు చెందిన రియల్ ఎస్టేట్ టెక్నాలజీ సంస్థ ఓపెన్‌డోర్ భారత్‌లోని తన ఉద్యోగులందరినీ తొలగించనున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో దాదాపు 250 మంది ఉద్యోగులు ప్రభావితం కానున్నారు. కంపెనీ సీఈవో కాజ్ నెజాటియన్ ఉద్యోగులకు పంపిన సందేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. భారత్‌లోని కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. గత కొన్ని నెలలుగా కార్యకలాపాలను అమెరికాకు తరలిస్తున్నామని, ఇప్పుడు ఆ ప్రక్రియ పూర్తయినట్లు పేర్కొంది. దీంతో భారత్‌లో ఉన్న మొత్తం వర్క్‌ఫోర్స్‌పై ప్రభావం పడనుంది. కంపెనీ కస్టమర్లంతా అమెరికాలోనే ఉన్నారని, వారికి సంబంధించిన కార్యకలాపాలు కూడా అక్కడే నిర్వహించడం సమర్థంగా ఉంటుందని భావించినట్లు నెజాటియన్ పేర్కొన్నారు. గతంలో పలు మాన్యువల్ ప్రక్రియలను నిర్వహించేందుకు భారత్‌లో పెద్ద బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం సాంకేతికత గణనీయంగా అభివృద్ధి చెందిందని చెప్పారు. ముఖ్యంగా ఏఐ ఆధారిత వ్యవస్థలు అందుబాటులోకి రావడంతో గతంలో మనుషులు చేసిన అనేక పనులను ఇప్పుడు తక్కువ సిబ్బందితో నిర్వహించగలుగుతున్నట్లు వివరించారు. ఈ నిర్ణయం ఉద్యోగుల పని తీరుతో సంబంధం లేదని నెజాటియన్ స్పష్టం చేశారు. భారత్‌లోని ఉద్యోగులు ప్రతిభావంతులని, వారు ఇతర సంస్థలకు విలువైన ఆస్తిగా నిలుస్తారని అన్నారు. కంపెనీ అభివృద్ధిలో వారి పాత్ర కీలకమని కొనియాడారు. ఉద్యోగాలు కోల్పోతున్న వారికి పరిహారంతో పాటు కొత్త ఉద్యోగాల కోసం సాయం, ఇతర మద్దతు కార్యక్రమాలు అందిస్తామన్నారు. కీలక పనుల బదిలీ పూర్తయ్యే వరకు కొంతమంది ఉద్యోగులు తాత్కాలికంగా కొనసాగుతారన్నారు.

# ఇన్వెస్టర్లకు వార్ ఎఫెక్ట్

### నష్టాలకే పరిమితం అయిన సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి,జూన్ 11:** దేశీయ ఈక్విటీసూచీలు ప్రారంభంలోని లాభాలను బ్రేక్‌చేసి చివరినిమిషంలో అమ్మకాల ఒత్తిడికి గురయి నష్టాల్లోముగిసాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు పెరుగుతుండటంతో విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు తమతమ పెట్టుబడులను లాభాలస్వీకరణకే మొగ్గుచూపించారు. సెన్సెక్స్‌లోని ఫ్యూచర్స్, అండ్‌ఆప్షన్స్ కాంట్రాక్టుల ముగింపు కూడా ఇన్వెస్టర్లను అప్రమత్తంచేసింది. ఇంట్రాడేలో గరిష్టానికి తాకిన సూచీలు చివరి గంటలో పతనంచెందాయి. ఐటి, రసాయనాలు, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగాలషేర్లు క్షీణించాయి. ఫార్మా,ప్రైవేటు బ్యాంకింగ్ షేర్లు కొంతమేర సూచీలకు మద్దతిచ్చాయి. ఎస్అండ్‌పి బిఎస్ఇ సెన్సెక్స్ 150.63 పాయింట్లు క్షీణించి 73,832.55 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపితే ఎన్ఎస్ఇ నిఫ్టీ50 సూచీ కూడా 53.35 పాయింట్లు క్షీణించి 23,161.60 పాయింట్లవద్ద ట్రేడింగ్ ముగించింది. బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.83శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.72శాతం క్షీణించాయి. మార్కెట్లపరంగా బిఎస్ఇలో 1384 షేర్లు పెరిగితే 2807 షేర్లు క్షీణించాయి. 214 షేర్లుమాత్రం స్థిరంగా కొనసాగాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్‌రూపాయి 95.79వద్ద కదలాడింది. ఉందురోజు 95.25తో పోలిస్తే మరికొంత క్షీణించింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఆగస్టు ఐదో తేదీనాటి సెటిల్‌మెంట్లు 0.34శాతం క్షీణించి రూ.1,47,573కి చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు జూలై సెటిల్‌మెంట్ ధరలు 1.10 డాలర్లు క్షీణించి బ్యారెల్‌కు 92 డాలర్లుగా కొనసాగాయి. ఇక యూరోపియన్ స్టాక్స్ గురువారం కొంతమేర పెరిగాయి. ఆసియా మార్కెట్లు మాత్రం దిగువస్థాయిలోనే ముగిసాయి. వాల్‌స్ట్రీట్‌లో కూడా స్వల్ప దిగువస్థాయిలోనే ముగిసాయి. డౌజోన్స్‌పారిశ్రామిక సగటు 953.33 పాయింట్లు క్షీణించింది. ఎస్అండ్‌పి 500 1.62శాతం, నాస్‌డాక్ కాంపోజిట్ 1.98శాతం చొప్పున దిగజారాయి. ఇక నిఫ్టీ ఐటిసూచీ 1.62శాతంక్షీణించింది. ఎల్అండ్‌టిమైండ్‌ట్రీ 2.59శాతం, ఎంటార్ టెక్నాలజీస్ 10.99శాతం, పిపిఎపి ఆటోమోటివ్ 20శాతం ఎగువ సర్క్యూట్‌లోముగిసింది. జీ ఎంటర్‌టైన్‌మెంట్ 8.52శాతంపెరిగితే త్రీఐ ఇన్ఫోటెక్ 4.02శాతం పెరిగింది. వాస్కాన్ ఇంజినీర్స్ ఐదుశాతం పెరిగింది. ఇజ్‌మో 1.20శాతం, కిమ్స్ 0.77శాతం పెరిగితే టైమ్ టెక్నోప్లాస్ట్ 3.01శాతం క్షీణించింది. బ్లూక్లౌడ్ సాఫ్టెక్ సొల్యూషన్స్ 0.85శాతంపెరిగాయి.

### ఇథనాల మిక్సింగ్ ఇంధనాలపై ఎక్సైజ్ సుంకం రద్దు!



**న్యూఢిల్లీ,జూన్ 11:** పెట్రోల్‌లో అధిక శాతం ఇథనాల్ కలిపిన ఇంధనాలకు కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకం మినహాయించింది. 22శాతం నుంచి 30శాతం వరకు ఇథనాల్ ఉన్న పెట్రోల్‌పై ఈ మినహాయింపు వర్తించనుంది. ఈ22, ఈ25, ఈ27, ఈ30 ఇంధన రకాలపై కేంద్రం ఈ మినహాయింపు ఉంటుంది. దేశంలో అధికశాతం ఇథనాల్ ఉన్న ఇంధనాల వినియోగానికి ఊతం లభించే అవకాశం ఉంది. ముడి చమురు దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించడం, దేశీయంగా ఉత్పత్తి అయ్యే స్వచ్ఛ ఇంధనాల వినియోగాన్ని పెంచడం లక్ష్యంగా కేంద్రం అడుగులు వేస్తోంది. కొన్ని రోజుల క్రితమే ఈ22, ఈ25, ఈ27, ఈ30 పెట్రోల్ మిశ్రమాలకు కొత్త నాణ్యత ప్రమాణాలను బీఐఎస్ ప్రకటించింది. ఇథనాల్ శాతం, ఆక్టేన్ రేటింగ్, సల్ఫర్ పరిమితులు, భద్రతా నిబంధనలకు సంబంధించిన మార్గదర్శకాలను అమల్లోకి తీసుకొచ్చింది. దేశంలో ఇథనాల్ మిశ్రమాల కార్యక్రమం వేగంగా ముందుకు సాగుతోంది. 2018లో తీసుకొచ్చిన జాతీయ బయోఫ్యూయల్ విధానాన్ని 2022లో సవరించిన కేంద్రం 20 శాతం ఇథనాల్ మిశ్రమ లక్ష్యాన్ని 2030 నుంచి 2025-26కు ముందుకు తీసుకొచ్చింది. ప్రభుత్వ చమురు మార్కెటింగ్ సంస్థలు 2022 జూన్‌లోనే 10 శాతం మిశ్రమ లక్ష్యాన్ని చేరుకున్నాయి. ఆ తర్వాత ఇథనాల్ వినియోగం క్రమంగా పెరుగుతూ వస్తోంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.